అపరాధ పరిశోధన

రు.7.50 మే '88



Blank Page

సంపుటి: 46
సంచిక : 4

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

మే, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఎ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

అపరాధ పరిశోధన పోటీ-236

[ఫలితాలు]

మార్చి '88 నెల "అపరాధ పరిశోధన పోటీ-236" కి సరియైన సమాధానాలు:

1. ఇజ్రాయిల్
2. తమిళదేశం
3. లంచాలు
4. అణు జలాంతర్గాములు
5. రవిశాస్త్రి

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆలీ కరెక్టుగా పంపారు. వీరికి వచ్చే నెలనుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) డాక్టర్ ఎమ్.ఎ. నజీర్, ఎమ్.బి.బి.ఎస్,
సిద్దీక్ హాస్పిటల్,
గణపతిరావు రోడ్డు,
విజయవాడ—520 001.

(2) శ్రీమతి టి.ఎమ్. రేణుక, బి.ఏ.,
ఇందిరానగర్ కాలనీ,
ఖైరతాబాద్,
హైద్రాబాదు-500 004.

(3) కుమారి సయ్యద్ అయిషా,
44-101, ప్రకాష్‌నగర్,
కర్నూలు-4.

ఈ నెలలో... 25/4/88

కథలు (మాస పత్రిక)

4. ధైర్యానికి చావులేదు—వసుంధర
24. తొణికిన స్వప్నం—ఫణిబాబు
32. అపార్టుమెంట్‌లో హత్య—యస్.డి.వి. అజీజ్
43. ఫాలనేత్రం (సీరియల్)—వి.యస్. రావ్
82. గోవిందరావూ-కథా—జొన్నలగడ్డ రామలక్ష్మి
102. గూళ్ళోని గువ్వపిట్ట—కె.వి.యస్.ఎన్. మూర్తి
115. శవంతో ప్రయాణం—'సరసి'
128. సాక్షికోసం అన్వేషణ—వసుంధర
148. నగరంలో నేరగాళ్ళు—(సీరియల్) ప్రతాపరవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. క్రాంతి—వసుంధర
44. హంతకుడి ఫోటోలు—బొమ్మిడి అచ్చారావు
87. మృత్యుభస్మం—వి. యస్. రావ్
179. రాక్షసవేట (సీరియల్)—వాణిశ్రీ

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

ధైర్యానికి చాప్రతేదు
వసుంధర

"ఏమే—ఇంకా రెడీ కాలేదు. ఈ రోజు కాలేజీకి వెళ్ళవా?" అంది తాయారమ్మ.

"కాలేజీకి వెళ్ళాలంటే భయంగా ఉందమ్మా...."

అంది సరోజ జాలిగా ముఖంపెట్టి.

"ఏం—కుర్రాళ్ళల్లరిచేస్తున్నారనా? ఇలా భయపడితే చదువేం సాగుతుంది? అందుకే నేను సంబంధాలు చూసి త్వరగా పెళ్ళి చేసేయమని చెబుతూంటే మీ నాన్నేమో నీకు చదువు బాగా వస్తోంది—అప్పుడే తొందరేమొచ్చిం దంటారు. కాలేజీకి వెళ్ళనని ఒక్కమాట చెప్పు. ముందు సంతోషించేదాన్ని నేనే!"

సరోజ భయానికి అర్థముంది.

ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది కాలేజీ. అది దగ్గరదారి. లేదంటే అయిదు కిలోమీటర్ల చుట్టు దారి ఉంది. దగ్గరిదారిలో ఓ అరకిలోమీటరు కేవలం నడకకే వీలవుతుంది. ఆ దారిలో కొందరు మగపిల్లలు కాసి వచ్చే పోయే ఆడపిల్లల్నేడిపిస్తూంటారు. వాళ్ళలో కొందరు పుర ప్రముఖుల పిల్లలూ ఉండడంవల్ల—వాళ్ళనెవరూ ఏమీ చెయ్యలేకపోతున్నారు.

అయితే ఆ మగపిల్లలు కూడా కొన్ని హద్దులు దాటరు. వాళ్ళు దారిన పోయే ప్రతి ఆడపిల్లనీ అంగాంగవర్ణన చేసి అసభ్యకరంగా మాట్లాడి వినోదిస్తారు తప్ప చేతితోకూడా తాకరు. కానీ పరువైన ఆడపిల్ల కామాటలు వినడమే కష్టం.

నిన్నటిరోజున ఓ కుర్రాడు సరోజ శరీరపు సొగసులు వర్ణించాడు. ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది.

"నిన్నరాత్రి వంటిమీద చేయివేసి మాట్లాడుతూంటే ఇవే కబుర్లు కళ్ళలోకి కళ్ళుపెట్టి మరీ వింది. ఇప్పుడు చూడు ఎంత సిగ్గుపడుతోందో? ఆడాళ్ళకు నటన పుట్టుక తోనే వస్తుంది కాబోలు...." అన్నాడా కుర్రాడు.

"పిట్ట చాలా బాగుంది గురూ—ఎలా పట్టావు?"

"చాలా సింపుల్. వేరుశనక్కాయలు కొనిపెడతా నన్నాను. అంతే రాత్రికి నా గదికి వచ్చేసింది...."

"ఏయ్ పిల్లా— నేనైతే జీడిపప్పు కొనిపెడతాను. రాత్రికి నా గదికి రా...." అన్నాడింకో కుర్రాడు.

సరోజకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఏం జరిగిందో తల్లికికూడా చెప్పుకోలేదు. కానీ ఇప్పు డామెకా దారిలో వెళ్ళాలంటే భయంగా ఉంది. చుట్టుదారిలో వెళ్ళాలంటే రిక్షా కావాలి. రిక్షాలో వెళ్ళాలంటే మాటలు కాదు. ఏ రోజు కా రోజు డబ్బిచ్చి ఎక్కాలంటే నెలకు రెండువందలవుతుంది. ఎంతగా బేరమాడుకున్నా నెలకు వందయాభాయిలివ్వాలి.

సరోజ కాలేజీకి రిక్షాలో వెడతానంటోంది. తల్లి ఆమెను కాలేజీ మానేయమంటోంది.

ఆ సమయంలో ఆ సంభాషణలో కలగజేసుకుంది పద్మ. పద్మ సరోజ చెల్లెలు. వయసు పద్నాలుగు. టెన్తు చదువు తోంది. మనిషి మహా ధైర్యస్థురాలు. ఆపైన పెంకితనం, మొండితనం ఉన్నాయి.

"అమ్మా! అక్కకు నేను సాయం వెడతాను...." అందామె.

"నువ్వెళ్ళి ఏం చేస్తావే?"

"అల్లరి వెధవలకి బుద్ధిచెబుతాను...."

"వద్దు. ఆ వెధవలు నోటితీట వదుల్చుకుంటున్నారు. వాళ్ళమీద తిరగబడితే దేనికైనా తెగిస్తారని భయం అంద రికీ!"

"అక్కా! నువ్వు ఇన్‌స్పెక్టర్ విజయ్ పేరు విన లేదా?"

"లేదు— ఏం?"

"ఆయన కొత్తగా ఈ ఊరికి వచ్చాడు. రౌడీలకూ, గూండాలకూ, అల్లరి వెధవలకూ సింహస్వప్నంగా ఉంటు న్నాడు. ఆయనకు న్యాయమే తప్ప—నేరస్థుడి హోదాతో నిమిత్తంలేదు. మనమాయనకు ఫిర్యాదు చేద్దాం...."

"సరే—ఆ విజయ్ నిజంగా అంత గొప్పవాడైతే ఈ పాటికీ అల్లరివెధవల ఆటకట్టించి ఉండకపోయేవాడా? అంతా ప్రచారం....ఆయన పత్రికలవాళ్ళకి డబ్బులిచ్చి తన గురించలా రాయించుకుని ఉంటాడు...."

"అక్కా! ఆ విజయ్ మనిషేకానీ దేవుడుకాదు. ఈ అల్లరి కుర్రాళ్ళ గురించెవరూ ఆయనకు ఫిర్యాదుచేసి ఉండరు...."

సరోజ మాట్లాడలేదు.

"అక్కా! నువ్వాయనకు ఫిర్యాదు చేయకూడదూ?" అంది పద్మ.

"అమ్మబాబోయ్—నాకు భయం...."

"నువ్వింక భయపడకు. ఈ రోజు నించీ నేను నీకు సాయంగా వస్తాను. దేనికైనా ధైర్యముండాలి. ధైర్య మున్నవాళ్ళ నెవరూ ఏమీ చేయలేరని ఈ రోజు నేను ఋజువు చేస్తాను...." అంది పద్మ.

2

"అదిగో జీడిపప్పు పిల్ల వచ్చిందిరోయ్—" అన్నా డొకడు.

"జీడిపప్పెంత కొన్నావేమిటి?"

"వందగ్రాములు. మొత్తమంతా తనే తినేసింది. తింటే తిందిలే కానీ ఏం సుఖం?" అంటూ వాడు వర్ణన ప్రారంభించాడు.

"పిల్లా నేను బాదంపప్పు కొనిపెడతాను. నన్నూ సుఖ

పెట్టు ...."

పద్మ చటుక్కున ఆగి "పాపం బాదంపప్పు కొనాలంటే నీకోసం—మీ అమ్మ ఎన్ని మిరపకాయ బజ్జీలమ్మాలో?" అంది.

"మా అమ్మ బజ్జీలెందు కమ్ముతుంది?" అన్నాడు వాడు.

"నీలాంటి బుజ్జీని కన్నందుకు ...."

"ఎవరీ పిల్ల? చాలా పొగరుగా ఉంది ...."

"కన్నె మొగ్గరా? ఇంకా వికసించని పుష్పం ....దీన్నే ఓ పట్టుపడితే "

"ఇన్‌స్పెక్టర్ విజయ్ మిమ్మల్నందర్నీ ఓ పట్టు పట్టాడంటే—మీరంతా జైల్లో మొగ్గల్లా ముడుచుకు కూర్చుంటారు ...."

"ఏయ్ పిల్లా! ఆ విజయ్ దగ్గర కెళ్ళకు. వాడికంటే నేనే ఎక్కువ సుఖపెడతాన్నిన్ను ...." అన్నాడింకొకడు.

"అమ్మో భయమేస్తోంది. ఎక్కడ దాక్కుందాంరా?"

"దాక్కుంటే ఎలాగరా? విజయ్ మన్ని వెతుక్కోలేడు కదా!"

"ఎదురుగుండా కనబడితే మన్నిచూసి భయపడి పారిపోతాడుకదా! అప్పుడీ పిల్లేం చేస్తుంది?"

పద్మ హుంకరించి ముందుక్కదిలింది.

"ఏయ్ పిల్లా—వెళ్ళిపోకు మరి ...."

"వెళ్ళనివ్వరా ....నడుస్తూంటే చూడు ...." అసభ్య వర్ణన ప్రారంభమయింది.

"పద్మా —అనవసరంగా వాళ్ళను రెచ్చగొట్టి ఏం సాధించావు?"

"ఏం సాధించానా? మన పాకెట్ పేపురికార్డర్లో వాళ్ళ

మాటలు రికార్డు చేశాను. రెచ్చిపోవడంవల్ల వాళ్ళు మరిన్ని కారుకూతలు కూశారు...."

"రికార్డుచేసి రోజూ వింటావా?"

"నేను వినడానికి కాదు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కి విని పించడానికి. మన పోలీసులు, కోర్టులు—కళ్ళముందు హత్యజరిగినా సరే సాక్ష్యం కావాలంటారు. ప్రధాన మంత్రిని హత్యచేసిన హంతకులకే—ఇంకా ఉరికంబం ప్రమాదం రాలేదంటే సాక్ష్యాల గొప్పతనం నీకింకా తెలియలేదన్నమాట...."

"ఏమిటో—రేపట్నించి వాళ్ళు మరింత రెచ్చిపోతా రేమోనని నా భయం...."

"నీ భయం బంగారం గానూ—నాకంటే నాలుగేళ్ళు పెద్దదానివి—నాకున్నపాటి ధైర్యం లేదా నీకు? భయపడ్డ వాళ్ళకి రోజూ అవస్థ...."

"నీకేం—నీ స్కూలుకు వెళ్ళే దారి బాగుంది కాబట్టి ఎన్ని కబుర్లయినా చెబుతావు...."

"అదేమిటే—నేను నీకోసం నీ దారిలోకి వచ్చి నా స్కూలుకు చుట్టుదారిని వెడుతున్నాను...."

"అవును—ఒక్కరోజు కేగదా!"

"నేను నీతో వచ్చానుగా....ఒక్కరోజు చాలు....రేప ట్నించి నీ దారి నిష్కంటకం...."

అక్కా చెల్లెళ్ళిద్దరూ విడిపోయారు.

3

ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆశ్చర్యంగా—"నువ్వు చెప్పేది నాకు నమ్మశక్యం కాకుండా ఉంది" అన్నాడు.

"అందుకే సార్........వాళ్ళ మాటలు రికార్డుచేసి తెచ్చాను...."

విజయ్ రేపు విన్నాడు. ఆయన కళ్ళెర్రబడ్డాయి.

"ఎంతకాలంగా జరుగుతోం దిది?"

"చాలా ఏళ్ళుగా జరుగుతోంది సార్! వాళ్ళ ఊళ్ళో పలుకుబడి ఉన్నవాళ్ళ పిల్లలు కావడంవల్ల ఎవ్వరూ పోలీసులకు ఫిర్యాదివ్వడంలేదు. ఇచ్చినా ప్రయోజనం కనబడలేదని కొందరన్నారు. నేను మీగురించి విని మీమీద నమ్మకంతో వచ్చాను సర్...." అంది పద్మ.

"వెరీగుడ్! నీవంటి ఆడపిల్లలే దేశానిక్కావాలి. పెద్దయ్యాక నువ్వు పోలీసు ఫోర్సులో జేరు...."

"అలాగే సర్....ఇప్పుడు మీరేం చేస్తారు!"

"నేనేం చేస్తానో—రేపు పేపర్లో చూడు....నువ్వింక స్కూలుకు వెళ్ళొచ్చు...."

"థాంక్యూ సర్...."

"నీకు సాయంగా ఓ కానిస్టేబుల్ని పంపనా?"

"వద్దుసార్....అర్ధరాత్రే నాకు సాయమక్కరలేదు. పట్టపగలు సాయం కావాలంటే అవమానం...."

విజయ్ ఆమెను భుజం తట్టి మెచ్చుకున్నాడు.

పద్మ స్కూలుకు వెళ్ళిపోయింది.

సాయంత్రం సరోజ కాలేజీ నుంచి వచ్చేసమయానికి పద్మ యింటికి వచ్చేసింది.

"మళ్ళీ ఏమైనా విశేషాలా?" అంది పద్మ.

"ఆశ్చర్యంగా ఉందే! వచ్చేటప్పుడు దారిలో ఆ కుర్రాళ్ళు లేరు. అక్కడ ఓ బీటుకానిస్టేబులు తిరుగుతున్నాడు. పలకరించాలనుకుని మళ్ళీ నాకెందుకూ అని భయపడ్డాను."

"అంటే విజయ్ అప్పుడే రంగంలో దిగిపోయాడన్న మాట!" అంది పద్మ.

"ఏమో నాకు నమ్మకంగా లేదు. ఈ పోలీసులు కూడా గూండాల మనుషులే! అసలు వాళ్ళే పెద్ద గూండాలు. పత్రికల్లో చూస్తూన్నావుగా?"

"పత్రికలు చూసి అదే ప్రపంచమనుకున్నావంటే ఈ ప్రపంచం నిండా నేరాలు, ఘోరాలు, మోసాలు, దోపిడీలు....కానీ మనమంతా ఎలా బ్రతుకుతున్నామంటావు? సామాన్యంగా జరిగేదానికి భిన్నంగా ఉండే విశేషాలే పత్రికల్లో వేస్తారు. నిత్యసంఘటనల్లో వాటి శాతం పాయింట్ వన్ కూడా ఉండదు. పోలీసులు కూడా మన లాంటి మనుషులే. ఎక్కడో ఓ పోలీసు గడ్డి తిన్నాడని మిగతావాళ్ళందరూ గడ్డి దుకాణాలచుట్టూ తిరుగుతున్నారనుకోవడం తెలివి తక్కువ...."

"చాలా తెలివిగా మాట్లాడుతున్నావు. నాకే తెలియవు ఇన్ని విషయాలు....నీకెలా తెలిశాయే?"

"ఇవి నా మాటలు కాదు. ఇన్‌స్పెక్టర్ విజయ్ మాటలు - ఆయన గురించి ఎన్నోసార్లు పేపర్లో వచ్చింది...."

"ఈసారి వచ్చినప్పుడు నాకు చెప్పవే.... నేనూ చదువుతాను."

"ఎప్పుడో ఎందుకు! రేపే పేపరు చూడు. మొదటి పేజీలో ఇనస్పెక్టర్ విజయ్ గురించి ఉండకపోతే నన్నడుగు..." అంది పద్మ.

పద్మ మాటలు నిజమే అయ్యాయి. మర్నాటి పేపర్లో మొదటి పేజీలోనే ఇన్‌స్పెక్టర్ విజయ్ - కొందరు అల్లరి కుర్రాళ్ళను పట్టుకుని జైల్లోవేసి ఉదంతం ఉంది. వాళ్ళందరికీ గుండు గీయించి, పిలక పెట్టించి, ఫోటోలు తీసి పేపర్లో మొదటి పేజీలో వేయించి పేర్లు కూడా వ్రాయిం

చాడు విజయ్. పేపర్లో పద్మ ప్రసక్తి కూడా ఉంది.

పద్మ ఆ ఫోటోలు చూసి పక పకా నవ్వింది.

"వాళ్ళు గొప్పవాళ్ళ పిల్లలే - ఏమైనా చేస్తారు. మన మీన పగ పెంచుకుంటే? అందులోనూ విజయ్ వార్తలో నీ గురించి కూడా వ్రాశాడు...."

"ఎందుకే ఇంకా భయపడతావు ధైర్యానికి చావు కూడా భయపడుతుందని నీకు తెలియదా?" అంది పద్మ.

"ఏమో - నీకున్న ధైర్యం నాకు లేదు...." అంది సరోజ.

4

"ఏమిటే అక్కా! అదోలాగున్నావు? మళ్ళీ ఆ కుర్రాళ్ళుగానీ కనబడ్డారా?" అంది పద్మ అప్పుడే కాలేజీ నుంచి వస్తున్న సరోజను చూసి.

"లే పలకు రా - నీకో రహస్యం చెప్పాలి...." అంది సరోజ నెమ్మదిగా.

పద్మ సరోజ ననుసరించి వెళ్ళింది. సరోజ జాకెట్ లోంచి ఓ ఉత్తరం తీసి చెల్లెలి కిచ్చింది. పద్మ ఆ ఉత్తరం చదివింది.

"నువ్వు, నీ చెల్లెలు మాకు చేసిన అన్యాయానికి మీ యిద్దరిమీదా పగ తీర్చుకుంటాం. ఘోరంగా, క్రూరంగా పగ తీర్చుకుంటాం. అప్పుడే ఇన్స్పెక్టరూ మిమ్మల్ని రక్షించలేడు. సిద్ధంగా ఉండండి - మా ప్రతాపం చూడ్డానికి."

ఉత్తరం ఎవరికి వ్రాసిందో, ఎవరు వ్రాశారో తెలియదు.

"నీకీ ఉత్తర మెలా వచ్చింది?" అంది పద్మ.

"కాలేజీలో ఎవరో ఇది నా నోట్సులో పెట్టారు."

"మీది ఉమన్స్ కాలేజీ కదా....?" అంది పద్మ సాలోచనగా.

"అవును....ఎవరో ఆ వెధవల తాలూకువాళ్ళు పెట్టారని నా అనుమానం."

"ఎవరో నువ్వూహించగలవా?"

సరోజ తల అడ్డంగా ఊపింది.

"ఈ ఉత్తరాన్ని వెంటనే ఇన్స్పెక్టర్ విజయ్ కందజేస్తాను."

"వద్దు - ఇప్పటికే వాళ్ళు మనమీద పగబట్టారు. అనవసరంగా కొరివితో తల గోక్కున్నామనిపిస్తోంది నాకు... "

"కొరివితో ఎవరూ తల గోక్కోరు అవసరమైనంతసేపు వంట చేసుకుని తర్వాత నీళ్ళోసి ఆర్పేస్తారు...."

"అయితే నువ్వీ ఉత్తరం విజయ్ కిస్తావా?"

"ఇస్తాను....ఇప్పుడే...." అంది పద్మ.

ఆమె ఆ ఉత్తరం తీసుకుని పోలీస్ స్టేషన్ లోకి వెళ్ళింది. విజయ్ ఆమెను చూసి - "మళ్ళీ ఏమైనా విశేషమా!" అన్నాడు.

పద్మ అవునన్నట్లు తలూపి విజయ్ కా ఉత్తరమిచ్చింది.

విజయ్ ఆ ఉత్తరం వంక చూసి - "ఆ వెధవలకింకా బుద్ధి రాలేదన్నమాట!" అన్నాడు.

"వాళ్ళు నాకూ మా అక్కకూ బుద్ధి చెప్పాలనుకుంటున్నారు " అంది పద్మ నవ్వుతూ.

"నువ్వు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకైనా మంచిది మా యిల్లు కూడా నీకు తెలియాలి నాతో వస్తావా? మా యిల్లు చూపిస్తాను...." అన్నాడు విజయ్.

"మీ యిల్లే కాదు-ఆంటీని కూడా చూస్తాను...."అంది పద్మ.

"ఆంటీతో నీకేం పని?"

"మీ అంత గొప్పవారి భార్యను చూడాలన్నది నా కోరిక."

ఎందుకో ఇన్‌స్పెక్టర్ విజయ్ ముఖం అదోలాగయి పోయింది.

"మా యింటికి వెడితే నా గురించి నీ అభిప్రాయాలు మారవచ్చు. అయినా లోపలకు వస్తావా?" అన్నాడు విజయ్.

పద్మ అతడి వంక ఆశ్చర్యంగా చూసి - "అభిప్రాయా లెందుకు మారతాయి?" అంది.

"ఎందుకంటే?" అని ఏదో చెప్పబోయి - "ఎందుకులే__వెళ్ళాకే తెలుస్తుంది" అన్నాడు విజయ్.

ఇద్దరూ జీపులో విజయ్ ఇంటికి వెళ్ళారు.

"అంకుల్! మీ యిల్లు నాకు బాగా గుర్తుంది. ఒక్క సారి చూస్తేచాలు - ఏమైనా గుర్తుంటుంది నాకు...." అంది పద్మ.

"లోపలకు రావూ మరి!"

"అయ్యో....ఆంటీని చూడకుండానా నేను వెళ్ళేది!" అంటూ అతడి ననుసరించింది పద్మ.

ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

ముందు గదిలో విజయ్ బూట్లు విప్పుకున్నాడు. పద్మ తన చెప్పులు విడిచింది. ఇద్దరూ పక్క గదిలోకి వెళ్లారు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

"ఇంట్లో ఎవరూ లేరా అంకుల్?" అంది పద్మ.

"ఉండు....చీకటిగా ఉంది. గదిలో దీపం వేసి

అప్పుడు నీ కన్నీ చెబుతాను....'' అన్నాడు విజయ్.

మరుక్షణం గదిలో దీపం వెలిగింది.

పద్మ గుమ్మం అవతల నుంచి గదిలో అడుగు పెట్టింది.

విజయ్ ఆమె చేయి పట్టుకుని-''పద్మా! ఈ లోకంలో నేను ఒంటరిని'' అన్నాడు.

పద్మ చేయి విడిపించుకోలేదు - ''ఒంటరి అయితే ఆంటీని చూపిస్తానని ఎలా చెప్పారు?'' అందామె.

''ఆంటీ — అదిగో ....అటు చూడు....'' అంటూ విజయ్ ఆమె చేయి వదిలిపెట్టాడు.

గదిలో గోడకు వ్రేలాడుతోంది ఓ ఫొటో ....అందులో నవ్వులు చిందిస్తోందో అందమైన యువతి. ఆ ఫొటోకు చేమంతి పూలదండ వ్రేలాడుతుంది.

''అంటే....ఆంటీ....'' అని ఏదో అనబోయి ఇటు తిరిగేసరికి పద్మకు విజయ్ ఏడుపు వినిపించింది.

''పద్మా! నీవంటి పిల్లలు ఆంటీని చూస్తానన్నప్పుడల్లా నేను పసివాడికన్నా ఘోరంగా మారిపోతాను. నేనేనా-దొంగలకు, గూండాలకు సింహస్వప్నమైన ఇనస్పెక్టర్ విజయ్‌ని—అన్న అనుమానం నీవంటివారిలో కలుగుతుంది. కానీ నేను నిజంగానే ధైర్యవంతుణ్ని పద్మా! అందుకే ప్రాణంకంటె మిన్నగా ప్రేమించిన భార్యను పోగొట్టుకుని ఇంకా బ్రతికి ఉన్నాను....'' అన్నాడు విజయ్.

''ఆంటీ కేమయింది? ఎలా పోయింది?'' అంది పద్మ.

''ఇనస్పెక్టర్ విజయ్‌కి భార్య కావడమే ఆమె చేసిన తప్పు. నామీద పగబట్టిన కొందరు దుష్టులామె నెత్తుకొని పోయారు. ఆమెకు మారుగా ఓ నరరూప రాక్షసుణ్ని

జైల్లోంచి విడిచిపెట్టాలన్నారు. లేకుంటే ఆమెను చంపేస్తామన్నారు. ఆమెను నాతో ఫోన్లో మాట్లాడ నిచ్చారు. అప్పుడామె నాతో—"నేను ఇనస్పెక్టర్ విజయ్ భార్యను. నాకు భయంలేదు. నేను ధైర్యంగా వున్నాను. ధైర్యానికి చావులేదని మీకు తెలుసు. నా కోసం మీరు నరరూప రాక్షసులను విడిచిపెట్టకండి ..." అని చెప్పింది. నేను ధైర్యం చిక్కబట్టుకున్నాను. నేరస్థుల ఆరాతీసి వాళ్ళను చుట్టుముట్టాను. ఆ కసితో వాళ్ళామెను తుపాకితో పేల్చారు. కొనప్రాణంతో ఆమె నాకు దక్కింది. చనిపోయేటప్పుడు కూడా ఆమె నాతో - 'ధైర్యానికి చావులేదు. మీరు ధైర్యం కోల్పోనంతకాలం నేను మీతోనే ఉన్నాననుకోండి....' అంది...." అంటూ విజయ్ కళ్ళు తుడుచుకున్నాడు.

"అంకుల్-యూ ఆర్ రియెల్లీ గ్రేట్!" అంది పద్మ అప్రయత్నంగా.

"గొప్పతనం నాదికాదు. నా భార్యది. ఆమె ప్రోత్సాహంతోనే నే నెన్నో సాహసకార్యాలు చేశాను. ఆమెను తల్చుకుంటూనే ఇప్పటికీ నా విద్యుక్తధర్మాన్ని నిర్వహిస్తున్నాను...." అన్నాడు విజయ్.

"అంకుల్—మీరు, ఆంటీ నా ధైర్యాన్ని మరింతగా పెంచారు. వస్తాను - వెలవు" అంది పద్మ.

5

పద్మ, సరోజ పిక్నిక్కి వెళ్ళారు. ఆ కార్యక్రమం జయప్రదంగా ముగిసింది. వెనక్కి వచ్చేసరికి రాత్రి తొమ్మిది కావచ్చింది.

వాళ్ళు మొత్తం పదిమందమ్మాయిలు. బస్సులో వెళ్ళి బస్సులో తిరిగొచ్చారు. దారిలో బస్సు చెడిపోవడంవల్ల

బాగా ఆలస్యమయింది. బస్స్టాండునించి అందరిదీ తలో దారీను....

అప్పుడు వాళ్ళముందు రెండు కార్లాగాయ్.

"హాయ్ గీతా!" అంటూ ఓ యువకుడు కార్లోంచి దిగి పలకరించాడు సరోజ స్నేహితురాండ్రలో ఒకామెను.

అంతే!

క్షణాలమీద గీత ఆ రెండు కార్లనూ తమకోసం ఏర్పాటు చేసింది. పద్మ, సరోజ మరో ముగ్గురితోపాటు ఓ కార్లో ఎక్కారు. పద్మ, సరోజ వెనుక సీట్లలో కూర్చు న్నారు.

కార్లో యువకుడు—ఒకొక్కరినే వాళ్ళ వాళ్ళింటి దగ్గిర డ్రాప్ చేశాడు. చివరికి కార్లో పద్మ, సరోజ మిగిలారు.

"ఊళ్ళోకే వచ్చాంగా....ఇక్కణ్ణించి మేమెలాగో ఇల్లు చేరుకోగలం...." అంది సరోజ.

"అయ్యో! అలాచేస్తే మాగీత వూరుకోదు. మిమ్మల్ని కూడా మీ యింటివద్ద దిగబెడతాను. అప్పుడే నాకు తృప్తిగా ఉంటుంది...." అన్నాడా యువకుడు మళ్ళీ కారు స్టార్టుచేస్తూ.

సరోజ మాట్లాడలేదు. పద్మ మాత్రం విండో సీట్లోంచి బైటకు చూస్తూ పిక్నిక్ అనుభవాలు నెమరు వేసుకుంటోంది.

నిజానికామె పిక్నిక్కి వెళ్ళవలసింది కాదు. సరోజ, స్నేహితురాండ్రు పిక్నిక్కి వెళ్ళాలనుకుంటే మొత్తం తొమ్మండుగురయ్యారు. ఎవరైనా వింటే నవగ్రహాల్లా అంటారంటే సరోజ కూడా పద్మను తీసుకొచ్చింది.

"మా యింటికి దారి ఇదికాదు-" అంది సరోజ ఉన్నట్లుండి. అప్పుడు పద్మ ఈ లోకంలోకి వచ్చింది.

ఉన్నట్లుండి కారు వేగం హెచ్చింది.

"ఏయ్ కారు ఆపు!" అంది పద్మ.

అప్పటికే కారు జనసంచారం లేని దారిలో పడింది. పద్మ కారాపమన్న పది నిమిషాలకి కారు ఓ బంగళాముందాగింది.

"ఏమిటది—ఎవరు నువ్వు?" అంది పద్మ.

"నన్నింకా గుర్తుపట్టలేదా? మీ కారణంగానే కదా ఇనస్పెక్టర్ విజయ్ మమ్మల్ని పట్టుకున్నాడు...." అన్నాడా యువకుడు. అప్పుడా అక్కచెల్లెళ్ళతణ్ని గుర్తించగలిగారు. ఈలోగా కారాగిన చప్పుడువిని బంగళాలోంచి బయటకు వచ్చారు కొందరు యువకులు. వాళ్ళందర్నీ అక్కచెల్లెళ్ళిద్దరూ వెంటనే గుర్తు పట్టేశారు.

పద్మ సరోజ కారుదిగి పారిపోవాలనుకున్నారు. కానీ ఒకరుకాదు....ఇద్దరుకాదు....మొత్తం ఆరుగురు యువకులు....

వాళ్ళు అక్కచెల్లెళ్ళిద్దర్నీ బంగళా లోపలకు నడిపించారు. వారిలో ఒక యువకుడు పద్మతో—"పాపా! తప్పుచేసింది నువ్వే కానీ—చేయించింది నీ అక్క! అందుకని శిక్ష ఆమెకే వేస్తున్నాం. ఆ శిక్ష ఎలాగుంటుందో నువ్వు చూద్దువుగాని...." అన్నాడు.

సరోజ చటుక్కున వంగి ఆ యువకుడి పాదాలపై పడిపోయి—"నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాటు జరగదు. మమ్మల్నిద్దర్నీ వదిలిపెట్టండి—" అంటూ ఏడ్వసాగింది.

"ఎందుకే అక్కా ఏడుస్తావు? తప్పుచేసింది వాళ్ళు.

వాళ్ళ తప్పుగురించి మనం పోలీసులకు చెబితే అది తప్పెందుకవుతుంది? నువ్వేం భయపడకు. నే నిప్పుడే ఇనస్పెక్టర్ విజయ్ ఇంటికి వెళ్ళి జరిగింది చెబుతాను. దాంతో వీళ్ళ ఆటకట్టవుతుంది..'' అంది పద్మ ధైర్యంగా.

''పాపా—వెళ్ళాలని నీకుంటేమాత్రం మేము నిన్ను వెళ్ళనిస్తామనుకున్నావా?'' అన్నాడో యువకుడు వెట కారంగా.

''ధైర్యవంతుల్ని ఎవ్వరూ ఆపలేరు....'' అంది పద్మ.

''ఓహ్-మరి ఈ కత్తికూడా ఆపలేదా?''

ఈ మాటన్నది ఒకడు కాదు. నలుగురు యువకులు. నలుగురి చేతుల్లోనూ తళతళ మెరిసే కత్తులున్నాయి.

వాళ్ళు నలుగురూ పద్మను చుట్టుముడితే ఇద్దరు సరోజను చెరో రెక్కా పట్టుకుని పైకి లేపారు.

''మీ చేతుల్లో ఆ కత్తులెందుకు?'' అంది పద్మ.

సరోజ ఏడుస్తున్నందువల్ల ఆమె తన స్వరాన్ని పెంచింది.

''పారిపోవడానికి ప్రయత్నిస్తే—చంపడానికి....''

''ధైర్యానికి చావులేదని మీకు తెలియదా?'' అంటూ పద్మ వారి నలుగురి మధ్యనుంచీ తప్పించుకుని పరుగెత్తింది.

6

ఎవరో తలుపు దబదబ బాదుతున్న చప్పుడై ఉలిక్కిపడి లేచాడు విజయ్ ఆరోజతడు ఏదో కేసు ఇన్వెస్టిగేట్ చేసి బాగా అలసిపోయి ఉన్నాడు. ఎనిమిదిన్నరకల్లా నిద్రపోయాడు.

విజయ్ బెడ్‌లైటు వెలుగులో వాచీ చూసుకుంటే టైము పదకొండు కావస్తూంది. తలుపు లింకా దబదబా

బాదుతున్నా రెవరో!

"ఎవరూ?" అంటూ విజయ్ వెళ్ళి తలుపుతీసి గుమ్మం అవతల ఉన్న పద్మను చూసి ఆశ్చర్యపోయాడు.

పద్మ అతడికి క్లుప్తంగా జరిగింది చెబుతోంది. ఆయాసంతో మధ్య మధ్య రొప్పుతోంది.

విజయ కళ్ళెర్రబడ్డాయి. అతడు వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి కొంత బలగాన్ని సరోజ ఉన్న బంగళాకు రమ్మన్నాడు. తను వెంటనే జీపులో బయల్దేరాడు పద్మను వెంటబెట్టుకుని.

అతడు బంగళా చేరుకునేసరికి లోపల దీపాలు దివ్యంగా వెలుగుతున్నాయి. అక్కడ హాల్లో అరుగురు యువకులు నేలమీద కూర్చున్నారు వలయాకారంలో. వారందరి ముందూ విస్కీ బాటిల్సున్నాయి. వారి మధ్య సరోజ నిలబడి ఉంది. ఆమెకు కన్నీళ్ళాగడంలేదు.

అలా నిలబడి ఏడుస్తోందామె.

వాళ్ళారుగురూ ఆమెను అసభ్యంగా వర్ణిస్తూ బట్టలు విప్పమని తిడుతున్నారు.

"యూ బాస్టర్డ్స్...." అన్నాడు విజయ్ ఆవేశం పట్టలేక.

అప్పుడా యువకుల దృష్టి విజయ్ పైకి మళ్ళింది.

తర్వాతేం జరిగిందో విజయ్‌కి తెలియదు. అతడు పూనకం వచ్చినవాడిలా ఆ ఆరుగుర్నీ ఇష్టం వచ్చినట్లు తన్నాడు. అతడి బల చాతుర్యాల ముందు - ఆ యువకుల సంఖ్యాబలం ఎందుకూ కొరగాలేదు.

ఆ అరుగురూ కదలలేని పరిస్థితి ఏర్పడిన సమయానికి మిగతా పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు.

"అరెస్ట్ దెమ్!" అన్నాడు విజయ్.

సరోజ జరుగుతున్న విశేషమంతా విచిత్రంగా చూస్తోంది. ఆమె ఆశ్చర్యంగా - "ఇన్స్పెక్టర్‌గారూ! మీ రిక్కడికి సమయాని కెలా వచ్చారు?" అంది.

"నీ చెల్లెలు పద్మ చెప్పింది."

"పద్మ చెప్పిందా? అంటే అది బ్రతికే ఉందా!" అంది సరోజ ఆశ్చర్యంగా.

"ధైర్యవంతు లెవరూ ఏమీ చేయలేరమ్మా - నీ కా అనుమాన మెందు కొచ్చింది?" అన్నాడు విజయ్.

"అంటే అన్ని కత్తిపోట్లు తిని కూడా అది బ్రతికే ఉందా? ఇన్స్పెక్టర్‌గారూ! మీరు వెంటనే దాన్ని హాస్పిటల్లో చేర్పించారా? డాక్టర్లు ప్రమాదం లేదన్నారా?" అంది సరోజ ఆత్రుతగా.

"కత్తిపోట్లేమిటమ్మా-మనిషి నిక్షేపంలా ఉంటేనూ!" అన్నాడు విజయ్.

"అదెలా సాధ్యం? వాళ్ళు నా కళ్ళ ముందే దాన్ని పొడిచి పక్క గదిలోకి ఈడ్చుకుపోయారు...." అంది సరోజ.

విజయ్ తెల్లబోయి - "పద్మా!" అన్నాడు. అక్కడ తనకి పద్మ కనబడలేదు. అతడు సరోజ చెప్పిన గదిలోకి వెళ్ళి చూస్తే అక్కడ పద్మ శరీరం రక్తసిక్తమై పడి ఉంది.

"పద్మా!" అని బిగ్గరగా అరిచాడు విజయ్.

పద్మ కదలడం లేదు.

అంటే తనింటికొచ్చి తన్ను లేపి తన కూడా వచ్చిం దెవరు? పద్మ ధైర్యం, సంకల్ప బలం - మరో మనిషి రూపం ధరించి తనకు విషయం చేరవేశాయా?

విజయ్ వంగి పద్మ నాడి పరిశీలించి - "ఇంకా నాడి కొట్టుకుంటోంది. అర్జంటుగా ఈమెను హాస్పిటల్‌కు తీసుకు వెళ్లాలి...." అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్ గారూ .... నా చెల్లి బ్రతుకుతుందా?" అంది సరోజ.

విజయ్‌కి జరిగిన విశేషమంతా అబ్బురంగా వుంది. కత్తిపోట్లు తిని కదలలేని స్థితిలో వున్న పద్మ తనకు సందేశాన్నెలా చేరవేసింది?

"ఇన్‌స్పెక్టర్‌గారూ....నా చెల్లి బ్రతుకుతుందా?" మళ్ళీ అంది సరోజ.

"ధైర్యానికి చావుండదమ్మా ...." అన్నాడు విజయ్ చటుక్కున. ఆ జవాబులోనే అతడి కెన్నో ప్రశ్నలకు సమాధానాలు స్ఫురించాయి. □

నెత్తిన గంగ!

తొణికిన స్వప్నం

ఫణిబాబు

రివ్వున వచ్చి కొమ్మపై వాలిందా పక్షి. తన నోటిలోని ఆహారాన్ని ముందుకు చాపింది. ఒకదాని వెంట ఒకటిగా తోసుకుని ముందుకు వచ్చాయి పిల్లలు. ఎర్రటి వాటి ముక్కులు ఎండలో మెరుస్తున్నాయి.

కిటికీలోనుండి కనిపిస్తోందా దృశ్యం. సృష్టిలోని మాతృత్వ తియ్యదనానికి ప్రబల నిదర్శనంలా వుందది. ఎన్నిసార్లు చూసినా మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది.

భారంగా నిట్టూర్చాను. ఏరి కోరి ఒక జమీందారుకు మూడవ భార్యగా వచ్చాను నేను. కేవలం డబ్బుకోసం. మనిషి బ్రతకడానికి డబ్బు కావాలి—అనే ఒకే ఒక సూత్రానికి కట్టుబడి ఇక్కడికి వచ్చాను. వచ్చాక తెలిసింది డబ్బే మనిషి బ్రతుకు కాదని.

అలాగని ఆయన నన్ను కష్టపెడుతున్నారని చెప్పను. ఆయనకు నేనంటే ఇష్టమే. కాని నాకంటే డబ్బు సంపాదన మరీ ఇష్టం. "కైవల్యా!" బిగ్గరగా పిలుస్తూ వచ్చారాయన.

ఉలిక్కిపడి తలెత్తాను. ఆయన కంఠస్వరమే అంత. పిలుపులా వుండదు. ఆకలిగావున్న పెద్దపులి పెద్దగా అరిచినట్లు వుంటుంది. "హల్లో బేబి! మెనీహేపీరిటర్న్స" నా ఎడమబుగ్గపై ముద్దుపెట్టుకుంటూ చెప్పారాయన.

"వచ్చి ఎంతసేపయ్యింది?" అడిగాను.

"ఇప్పుడే....ఇదిగో నీ బర్త్‌డే ప్రజెంట్." వజ్రాల హారాన్ని నా కళ్ళముందు ఆడిస్తూ చెప్పారు.

"మైగాడ్....ఇటీజ్ బ్యూటిఫుల్" అన్నాను సంభ్రమంగా.

చాలా బాగుందా వజ్రాలహారం. ఇప్పటి వరకు నా దగ్గిరవున్న అన్ని నగలకన్నా చాలా అందంగా వుంది. నా కళ్ళలో మెరుపు చూస్తూనే సంతృప్తిగా నిట్టూర్చారాయన.

"రాజస్థాన్‌లోని ఒక మాజీ సంస్థానాధీశుడికి చెందిన హారం ఇది. అతికష్టంపైన సంపాదించగలిగాను" చెప్పా

రాయన.

నా దృష్టి ఆయన మాటలపై లేదు. చేతిలోని వజ్రాల హారంపైనే వుంది. అయినా ఇప్పుడే కాదు. నేను ఎప్పుడూ ఆయన మాటలు సరిగ్గా వినిపించుకోను. అందుకు మా ఇద్దరిమధ్యా వున్న వయోభేదం ముఖ్యకారణం కావచ్చును.

బయటనుండి సెక్రటరీ పిలవడంతో వెళ్ళిపోయా రాయన.

దాదాపు ఆరడుగుల ఎత్తులో వుంటారాయన. బంగారపు రిమ్‌లెస్ కళ్ళజోడు. మెడలో వ్రేలాడుతున్న పైకి అమర్చిన డైమండ్ టైపిన్ను, మాచింగ్ కఫ్‌లింక్స్ ఎడమచేతికి బంగారపు వాచి చేతివ్రేళ్ళకు రత్నాలు పొదిగిన ఉంగరాలు, పిడికిలిలో దంతపు నగిషి పనిచేసిన హేండ్ స్టిక్. ఆయనను చూస్తూనే ఎవరైనా జమీందారుగా గుర్తిస్తారు.

ఆయన మూడవ భార్యగా ఆ ఇంట అడుగుపెట్టే టప్పుడే కాకి ముక్కుకు దొండపండులా వుంటానని అనేకమంది మా వెనుక అనుకోవడం నాకు తెలుసు. మే మెవరో తెలియని ప్రదేశాలలో తండ్రి కూతుళ్ళుగా మమ్మల్ని భ్రమించడం నాకు తెలుసు అలా అనుకోవడం కూడా సహజమే. ఎందుకంటే ఆయన వయస్సు యాభై అయిదు. నా వయస్సు పాతిక.

లేచి కిటికీ దగ్గరకు వెళ్ళాను. క్రింద పోర్టికోలో నిల్చుని నౌకర్లకు ఏదో చెప్తున్నారు. ఇంతలో డ్రైవర్ మా కారు తీసుకువచ్చి వినయంగా వెనుక డోర్ తీసి పట్టుకు నిలబడ్డాడు.

కారులో కూర్చోబోతూ పైకి చూసారు. గబగబా

చెయ్యి వూపాను. తల పంకిస్తూ కారులోనికి చేరిపోయా రాయన. కొద్ది క్షణాలలో కారు అక్కడినుండి బయటకు వెళ్ళిపోయింది.

మంచి వ్యవహారదక్షు డాయన. ఐశ్వర్యంలో మునిగి తేలుతున్నా ఇంకా ఇంకా సంపాదిస్తున్నారాయన. డబ్బు సంపాదించడంలో ఆయన పొందే ఆనందం మరెందులోను ఆయనకు కనబడదు. డబ్బు సంపాదించడంలో ఎంతో థ్రిల్ ఫీలవుతా రాయన.

అసలు ఆ డబ్బుకోసమే ఆయన్ని నేను పెళ్ళిచేసుకున్నాను. రాకెట్ వేగంతో డబ్బు ఖర్చుచేస్తూ రెండేళ్ళ కాలం హాపీగా గడిపివేశాను. కాని ఈమధ్యే....

హఠాత్తుగా తలుపు తెరుచుకుంది. తల త్రిప్పి చూసాను.

వినోద్ నిల్చునివున్నా డక్కడ. నన్ను చూస్తూనే రెండు చేతులు చాపాడు. సన్నని చిరునవ్వు నా పెదవులపైకి దూసుకువచ్చింది. పరుగున వెళ్ళి అతని బాహువులలో ఇమిడిపోయాను.

"హేపి బర్త్‌డే టు యూ బేబి!" నా కనురెప్పలపైన ముద్దుపెట్టుకుంటూ చెప్పాడు వినోద్.

పరవశంగా కనులు మూసుకున్నాను. ఆయన ఇచ్చిన బహుమతికన్నా వినోద్ బహుమతి ఎక్కువ ఆనందాన్ని ఇచ్చింది నాకు.

2

ఆ రెస్టారెంట్‌లోనికి ప్రవేశిస్తూనే చుట్టూ కలయ చూసాను.

కోలాహలంగా వుందక్కడ. ఏ మూల నుండో చక్కటి సంగీతం వినిపిస్తుంది. తినేవాళ్ళు తింటూ తాగేవాళ్ళు త్రాగుతూ చాలా హుషారుగా వున్నారు.

వెళ్ళి ఒక కార్నర్ సీటులో కూర్చున్నాను. నా తలలోని ఎర్ర గులాబీని తీసి బల్లపైవుంచాను. నన్ను కలుసుకోబోయే వ్యక్తికి అది గుర్తు. సరాసరి వచ్చి నాముందు కూర్చుంటాడు. మామూలు వ్యక్తులు ఎవరైనా వచ్చినా వెయిటర్స్ అక్కడ కూర్చోనివ్వరు. బేరర్‌తో డ్రింక్ తెప్పించుకుని మెల్లిగా సిప్‌చేస్తూ కాలం గడపసాగాను.

కాస్సేపటికి నావైపు వచ్చాడు ఆ వ్యక్తి. నా ఎదురుగా వున్న సీటులో కూర్చున్నాడు. అతన్ని గుర్తుపడుతూనే నా గుండె వేగం పెరిగి శరీరంలో రక్తం వేగంగా పరుగులు పెట్టసాగింది. అతని పేరు భరత్. ఒక ప్రొఫెషనల్ కిల్లర్.

"చెప్పండి మేడమ్! నేను మీకు చెయ్యవలసిన పని వివరంగా చెప్పండి." అడిగాడు.

ఒక్కక్షణం సందేహంగా చుట్టూ చూసాను. అది గమనించాడతను.

"ఈ రెస్టారెంట్ నాకు సంబంధించినదే మేడమ్! మన మాటలు ఎవ్వరూ వినరు. మీరు సంకోచించకుండా చెప్పండి."

"నా భర్తను హత్యచెయ్యాలి భరత్. కాని అది హత్యగా ఎవ్వరికీ తెలియకూడదు." చెప్పాను.

"ఈ హత్యచేస్తే నాకు వచ్చే డబ్బు ఎంత?" అడిగాడు భరత్.

"నీ ఇష్టం! పని అవగానే నీవు ఎంత అడిగినా ఇస్తాను."

నవ్వాడు భరత్. ఆ నవ్వులో హేళన స్పష్టంగా కనిపించింది నాకు.

"ఇచ్చే మొత్తం ముందే ఇవ్వాలి మేడమ్. హత్య జరిగాక మీకు ఈ జన్మలో కనిపించను."

హేండ్‌బాగ్‌లోనుండి వజ్రాలహారం తీసి టేబుల్‌పైన పడవేశాను. దానిని చూస్తూనే అతని కళ్ళు తళుక్కున మెరిసాయి.

"మీ భర్త అలవాట్లు చెప్పండి. ఆయన క్రమం తప్పకుండా చేసేపనులు కావాలి."

నాభర్త క్లబ్బులకు వెళ్ళడం గూర్చి చెప్పాను. స్విమ్మింగ్ టైమ్ చెప్పాను. అన్నింటికి అతను తల అడ్డం తిప్పాడు.

"ఇంకో చిన్న విషయం వుంది మిస్టర్ భరత్. మీకు పనికివస్తుందో రాదో?" అనుమానంగా చెప్పాను.

"ఫర్వాలేదు చెప్పండి."

"ప్రతీ నెల ఐదవ తారీఖున ఆయన బెంగుళూరు వెళ్తారు. ఉదయం ఐదుగంటల ఫ్లైట్‌కువెళ్ళి హోటల్ విక్రమ్‌లో ఐదవ నెంబర్ రూమ్‌లోనే దిగుతారు. ఆ బెంగుళూర్‌లో చేసే బిజినెస్‌లో ఐదు అంకె కలిసి వస్తుందని ఆయన నమ్మకం."

అది వింటూనే బల్లపై అరచేతితో చరిచాడు భరత్.

"ప్రతి నెలా ఐదవ తారీఖునే వెళ్తారా?"

"అటు సూర్యుడు ఇటు పొడిచినా వెళ్ళితీరుతారు." చెప్పాను.

"మీ భర్త టికెట్ తీసుకున్న ప్లెయిన్‌ని బ్లాస్ట్ చేసేస్తాను."

"మైగాడ్. విమానం పేల్చివేస్తావా? జరిగే పనేనా?" గొంతుక తడారిపోతుండగా అడిగాను.

"ఎందుకు జరగదూ? విమానాన్ని హైజాక్ చెయ్యడం

కంటే పేల్చివేయడం తేలిక. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీలో నాకు తెలిసి చాలా లోపాలు వున్నాయి. విమానంలోనికి టైం బాంబ్ పంపితే, ఆ చనిపోయిన ప్రయాణీకులలో మీ భర్త ఒకడవుతాడు. ఇది ఉగ్రవాదుల పనిగా అందరూ భావిస్తారు. కలలో కూడా మీ భర్తను మీరు హత్య చేయించారని ఎవ్వరూ నమ్మరు."

నాకు మతిపోయినట్లయ్యింది. ఏదో హారర్ పిక్చర్ చూస్తున్నట్లుంది.

"కాని చాలామంది చనిపోతారు కదూ!" అడిగాను.

విచిత్రంగా భుజాలు ఎగరవేసాడు భరత్.

ఒక్కక్షణం నాలోని స్త్రీత్వం నేను చేస్తున్నది తప్పని హెచ్చరించింది. ఆడవాళ్ళకు సహజంగావుండే ఇన్‌స్టింక్ట్ నేను చేస్తున్నది రాక్షసకృత్యమని హెచ్చరించింది. అంతలోనే ఐశ్వర్యం, వినోద్‌తో కలిసి గడపగలిగే సుందరమైన జీవితం నా కళ్ళముందు మెరిసాయి.

చటుక్కున లేచి నిల్చున్నాను. గుప్పెటమూసి బొటన వేలు పైకెత్తి భరత్‌కు చెప్పాను. "ఓకే! డన్ మిస్టర్ భరత్. పని సక్రమంగా జరిగితే మరో లక్ష నీ కిస్తాను."

3

సరిగ్గా అంతా అనుకున్నట్లే జరిగింది. విమానం బ్లాస్ట్ అయిన వార్త వింటూనే హాయిగా నిట్టూర్చాను. ఆయనపై కొద్దిగా జాలివేసింది. అయినా తప్పదు. నేను వినోద్ హాపీగా జీవించాలంటే ఆయన చనిపోక తప్పదు.

వినోద్....మావారి సెక్రటరీ. అంతకుముందు పని

చేసిన లావణ్య రిజైన్ చెయ్యడంతో వినోద్‌ను ఆ స్థానములో అప్పాయింట్ చేశారాయన. అదే మావారు చేసిన అతిపెద్ద పొరపాటు.

వినోద్ పురాణాల్లో వర్ణించబడే మన్మథుడు, నలకూబరుడు మొదలైనవాళ్ళకు దీటుగా వుంటాడు. వెడల్పయిన ఛాతి, వెన్నును ఆనుకున్నట్లుండే పొట్ట, బలమైన భుజాలు, ముచ్చటైన కనుముక్కు తీరు, చెక్కిన గ్రీకు శిల్పంలా వుంటాడు.

అతి త్వరలోనే మా ఇద్దరి అనుబంధం గాఢంగా పెనవేసుకుపోయింది. ఇక ఇప్పుడు వినోద్ నా ఊపిరిగా, ప్రాణంగా మారిపోయాడు.

అయితే అక్కడితో నేను సంతృప్తి చెందలేదు. వినోద్‌ను శాశ్వతంగా నావాణ్ణి చేసుకోవాలి. కాని డబ్బు లేని జీవితం ఊహించడానిక్కూడా భయమేసింది.

ఆయనకు విడాకులిచ్చి వినోద్‌ను పెళ్ళిచేసుకోవడం నాకు పెద్ద కష్టంకాదు.

కాని అందువల్ల ఈ అంతులేని ఐశ్వర్యాన్ని నేను కోల్పోతాను. ఈ సంపదతోపాటు వినోద్‌నుకూడా నా సొంతం చేసుకోవాలి. అందుకే ఇదంతా ప్లాన్డుగా చేసాను.

నా ఆలోచనలు వినోద్‌కు కూడా చెప్పలేదు. వినోద్ స్వతహాగా పిరికిమనిషి. నాతో ప్రేమలో పడటానికీ అతనికి చాలా సమయం పట్టింది. హత్యలు చెయ్యమంటే భయపడి జ్వరం తెచ్చేసుకుంటాడు. అంచేత నాకు నేనుగా నా ఆలోచనలు ఆచరణలో పెట్టి విజయం సాధించాను.

ఇక ఇప్పటినుండి అష్టఐశ్వర్యాలలో మునిగి తేలుతూ

వినోద్ ప్రేమలో తన్మయత్వం చెందుతూ హాయిగా బ్రతుకుతాను.

కాలింగ్‌బెల్ శబ్దం వినరావడంతో ఆలోచనల నుండి బయటపడ్డాను. వినోద్ వచ్చివుంటాడు. గబగబా వెళ్ళి తలుపుతీసాను.

అంతే! నా ఊపిరి స్థంభించిపోయింది. చూడరాని దృశ్యం ఏదో చూస్తున్నట్లు నా కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

గుమ్మంలో ఆయన నిలబడివున్నారు. స్థాణువులా నిలబడిన నన్ను తప్పుకుని లోపలకు వచ్చారు.

"మీరు బెంగుళూరు వెళ్ళలేదా?" మెల్లిగా గొంతు పెగల్చుకుని అడిగాను.

"వెళ్ళలేదు కైవల్యా! వెళదామని బయలుదేరిన నేను మైల్డ్‌గా హార్ట్ ఎటాక్ రావడంతో మన హాస్పిటల్‌లో వుండిపోయాను. ముఖ్యమైన బిజినెస్ డీల్ కావడంతో అదే ఫ్లైట్‌లో వినోద్‌ను పంపాను" ఒక్కక్షణం ఆగారాయన. ఆ తర్వాత బాధగా చెప్పారు.

"ఆ విమానాన్ని ఉగ్రవాదులు కూల్చివేసారట. ఒక్కరుకూడా బ్రతకలేదు. పూర్ ఫెలో! వినోద్ అన్యాయంగా చచ్చిపోయాడు."

నా కళ్ళముందు ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. నా కాళ్ళక్రింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది. అమాంతం వెనుకకు విరుచుకు పడిపోయాను.

"కైవల్యా! మైగాడ్! ఏమయ్యింది?" ఆయన కంఠం సుదూరతీరాలలో ఎక్కడో వినబడుతోంది. నా గుండె కొట్టుకోవడం మానేసింది. □



భాగ్య నగరంలో....

స్తోమాజిగూడ ఏరియాలో వుంటున్న అపార్టుమెంట్ అది! పేరు 'గరుడాద్రి'.

ఆ అపార్ట్‌మెంట్ లాస్ట్‌ఫ్లోర్‌లో '22'వ ఫ్లాట్‌లో ఇటీలే ఓ నవయువ జంట దిగింది, కాపుర ముండడానికి.

'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా వుంటుందా జంట. ఆ అపార్టుమెంట్ కంతటికి ఆ జంట ఓ ప్రత్యేక ఆకర్షణ. ఆ జంట నామధేయాలు ఇవి!

సునీల్ ...వయసు 30.

సుజాత ....వయసు 25.

సునీల్ భాగ్యనగరం శివార్లలో వుంటున్న ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో ఇంజనీరు. అతనిది గుంటూరు. ఈమధ్యే రెండులక్షల భారీ కట్నంతో సుజాతను తన భార్యగా తెచ్చుకొన్నాడు. సుజాత తల్లిదండ్రులు అతనికి దూరపు చుట్టాలు. వారిది గుంటూరుకు దగ్గరలోనే వున్న ఓ పల్లె.

ఇరువురి తండ్రులు పొగాకు వ్యాపారస్థులు.

కాబట్టి వారికి వీరికి జోడి కుదిరింది.

సుజాత చదివింది తక్కువే అయినా నవనాగరికత గురించి నేర్చుకొన్నది చాల ఎక్కువ!

'అందానికి అందం—డబ్బుకు డబ్బు' అంటూ తన కొలిగ్స్, తన భార్య అందాన్ని, ఆమె తెచ్చిన కట్నాన్ని ప్రస్తావనకు తెచ్చి పొగుడుతున్నప్పుడల్లా మురిసిపోతూ వుంటాడు సునీల్.

తాను పనిచేస్తున్న ఫ్యాక్టరీకి దగ్గర్లోనే నివాసముండ డానికి ఇల్లు చవగ్గా లభించినా, 'నగరం మధ్యలో వుంటేనే అందం — ఆనందం' అన్న తలంపుతో నెలకు అద్దె నిమిత్తం వెయ్యిరూపాయలు ఖర్చుపెట్టటానికి సిద్ధమై ఆ అపార్టుమెంట్‌లోకి చేరాడు సతీసమేతంగా!

సునీల్, రోజూ. వుదయం పదింటికి తన మోటర్‌బైక్ మీద ఫ్యాక్టరీకి వెళ్ళి తిరిగి సాయంకాలం ఆరింటికి గూడు చేరుకుంటాడు. ఇక అప్పట్నుంచి కబుర్లు.... షికార్లు....

సరదాలు....

సుజాత, ఉదయం భర్త ఉద్యోగానికి వెళ్ళిపోగానే, బోర్ కొట్టకుండా వుండేందుకు అప్పట్నుంచి సాయంకాలం వరకు తన అభిమాన రచయి(త్రు)తల పుస్తకాలు తెగ చదివేస్తూ కాలం గడిపేస్తూ వుంటుంది.

ప్రస్తుతం కూడ అదే పనిలో నిమగ్నమయి వుంది సుజాత.

'తెలుగు పడుచు' వారపత్రికలో తన అభిమాన రచయిత వ్రాసిన 'నయవంచకి' సీరియల్‌ను ఎంతో శ్రద్ధాసక్తులతో చదువుతూ వుంది.

ఆమె చదివే సీరియల్‌లో చివరి సన్నివేశం....

'పరిమళ—ఆరోజు మార్కెట్‌లో విడుదలయిన తన అభిమాన రచయిత కొంటెకోనంగి సూరిబాబు వ్రాసిన 'చీకట్లో చిరుహాసం' పుస్తకం కొని అత్రంగా చదివేస్తుంది. నవల్లోని కథ మంచి సస్పెన్స్‌లో సాగుతుండగా, ఆమె గుండె ఉద్వేగంతో ఎగిసిపడుతుండగా, బయట కాలింగ్ బెల్ మ్రోగింది....

"ఈ వేళప్పుడు ఎవరొస్తారు?" అని విసుక్కుంటూ.... వెళ్ళి తలుపుతీసింది పరిమళ!

అంతే!

గుమ్మం ఆవల నిల్చొన్న వ్యక్తినిచూసి ఆ గది ప్రతిధ్వనించేలా, తన స్వరపేటిక తెగిపడేలా అరుస్తూ, స్పృహ తప్పింది పరిమళ.

ఆ ఆగంతకుని పెదాలపై విషపు నవ్వు!

కళ్ళల్లో అగ్నికణాలు! మెల్లిగా ముందుకు వొంగాడు. అతని చేతుల్లో తళతళ మెరుస్తున్న పొడుగాటి కత్తి!

(మిగతా భాగం వచ్చేవారం)

అంతవరకు చదివేసిన సుజాత....తన గుండెల్లో చిన్న అదురు పుట్టగా, ఓ వేడి నిట్టూర్పు వొదిలి ఆ పేజి త్రిప్పి పక్క పేజి చూడబోయింది.

కాలింగ్ బెల్ మ్రోగింది.

ఇందాక తాను చదివిన సీరియల్లో మల్లే!

పరిమళ పాత్రలా కాలింగ్ బెల్ నొక్కిన వ్యక్తిపై విసుక్కోలేదు కాని ఆలోచనలో పడింది. కాలింగ్ బెల్ నొక్కిన వ్యక్తిగురించి.

"ఈ వేళప్పుడు ఎవరొచ్చి వుంటారు?" అనుకుంటూ గోడగడియారం వంక చూసింది. టైం....మధ్యాహ్నం రెండవుతూ వుంది

'బహుశ(—పాలపాకెట్స్ తెచ్చే కుర్రాడు అయి వుండొచ్చు! అనుకుంటూ పట్టుతప్పిన తన నైటీ గుండీలు సర్దుకొని చేతిలోవున్న పుస్తకాన్ని పక్కపైన్నే ఓ మూల విసిరివేసి పక్కదిగి వెళ్ళి తలుపు తెరిచింది.

అంతే!!

పరిమళ పాత్రలాగే సుజాత నోటకూడ భయంకరమైన చావుకేక బయటికి తన్నుకురాబోయింది ...కాని రాలేదు.. అప్పటికే గుమ్మం ఆవలవున్న వ్యక్తి చేతులు ఆమె నోటిని చుట్టేశాయి!?

2

"సార్!"

ప్రొడక్షన్ మిషన్‌లోని ఓ పార్ట్‌కు సంబంధించిన సాంకేతిక లోపాన్ని గురించి ఆలోచిస్తూండిపోయిన సుశీల్ ఆ పిలుపు విని తలెత్తి చూశాడు.

ఎదురుగా అటెండర్ ఆదెయ్య.

ఏమిటన్నట్టు చూశాడు సుశీల్ అతనివంక.

"మీకు ఫోన్ సార్!"

తాను సీరియస్‌గా ఆలోచిస్తున్నప్పుడు మధ్యలో ఎవరైనా వచ్చి తన ఆలోచనల్ని తారుమారు చేస్తే, వారిపై ఎక్కడలేని చికాకు పుట్టుకొస్తుంది సునీల్‌కు.

"ఎక్కడ్నుంచి?" చికాగ్గానే ప్రశ్నించాడు.

"మీరుంటున్న అపార్టుమెంట్ నుంచి."

"ఎవరు చేశారు?"

"తెలియదు సార్....మీతో అర్జెంటుగా మాట్లాడాలట. ఎవరో లేడీ ఫోన్ చేసింది లైన్‌లో వుండమని చెప్పొచ్చాను."

ఆదెయ్య జవాబు విన్న సునీల్‌కు తన భార్య సుజాత గుర్తొచ్చింది. ఏమీతోచక తానే చేసివుంటుంది అనుకొంటూ అప్పటిదాకా వుంచుకొన్న చికాకును చిరునవ్వు మాటున దాచేసి వెళ్ళి ఫోన్ అందుకొని చెప్పాడు.

"హలో! హౌ ఆర్ యూ డార్లింగ్?"

"నేను మీ భార్యను కానండీ?"

సునీల్‌లో....ఒక్కమారుగా ఉలికిపాటు.

"సారి .. మీరు?"

"మీరుండే అపార్టుమెంట్‌లోనే వుంటున్నాను. నా పేరు కామాక్షి. మీ భార్యకు సీరియెస్‌గా వుంది. మీరు వెంటనే రావాలి!"

"సీరియసా? ఏమయ్యింది?" అదురుతున్న గుండెతో అడిగాడు.

సమాధానం లేదు.

ఫోన్ పెట్టేసిన చప్పుడు!

ఆఘమేఘాలమీద తానుంటున్న అపార్టుమెంట్ చేరుకున్నాడు సునీల్.

తమ ఫ్లాట్ బయట గుమికూడిన జనం! వారిని అదుపులో వుంచలేక సతమతమవుతున్నారు పోలీసులు.... పోలీసులను చూడగానే సునీల్‌కు, జరగరానిదేదో జరిగిపోయినట్లనిపించింది. అందరివంకా కలయజూస్తూ గాద్గదిక స్వరంతో ప్రశ్నించాడు.

"ఏం జరిగింది?"

ఒకరి ముఖాలు మరొకరు చూసుకొన్నారే తప్ప, ఎవ్వరూ జవాబివ్వలేదు. జరిగిందేమిటో చెప్పలేదు. ఎవ్వరి జవాబు ఆశించకుండా ఒక ఉదుటున గుమ్మం దాటి తన ఫ్లాట్‌లోపలికి వెళ్ళాడు.

ఫ్లాట్ అంతా చెల్లాచెదురుగా పడివున్న వస్తువులు.... బెడ్‌రూమ్‌లో....ఫోమ్ బెడ్‌పై చలనరహితంగా పడివున్న తన భార్య సుజాత....ఆమె వొంటిపై రక్తపు మరకలు....అస్తవ్యస్తంగా చెదిరి వున్న దుస్తులు .... శవాన్ని....శవం చుట్టూవున్న పరిసర ప్రాంతాన్ని నిశితంగా తదేక దృష్టితో గమనిస్తోన్న పోలీసు ఇన్‌స్పెక్టర్....అతని పక్కనేవున్న ఫింగర్‌ప్రింట్స్ ఎక్స్‌పర్ట్....

ఈ దృశ్యాన్నంతా చూసిన సునీల్‌కు తన మెదడు మొద్దుబారిపోతున్నట్లనిపించింది. కళ్ళకు మైకం కమ్ముకొచ్చింది. నిల్చున్నవాడలానే స్పృహతప్పి నేలపైపడ్డాడు.

3

సునీల్ స్పృహలోకి రావడానికి ఓ అరగంట పట్టింది.

సుజాత శవాన్ని పోస్టుమార్టంకోసం పంపి ఇంటరాగేషన్ చెయ్యడం ప్రారంభించాడు ఇన్‌స్పెక్టర్.

హతురాలయిన సుజాతను మొదట చూసిన వ్యక్తి రోజూ పాల ప్యాకెట్స్ తెచ్చే కుర్రాడు.

"నీ పేరేమిటి?"

"రాంబాబు సార్" నమ్రతగా వొదిగి జవాబిచ్చాడు పదిహేనేళ్ళ వయసున్న ఆ కుర్రాడు.

"శవాన్ని ఎప్పుడు చూశావు?"

"ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం పాల పాకెట్స్ తెచ్చియిస్తుంటాను సార్. ఉదయం కూడా ఇచ్చివెళ్లాను. మధ్యాహ్నంకూడా వచ్చాను. తలుపు తట్టాను. సమాధానం రాలేదు. బిగ్గరగా పిలిచాను. అయినా జవాబు లేదు. నాకెందుకో అనుమానం వేసి తలుపుతోశాను. తెరుచుకుంది. లోపలికివెళ్ళి చూశాను. అమ్మగారు మంచంమీద పడున్నారు. నాకు భయంవేసింది. గట్టిగా కేకలు వేసుకుంటూ వెళ్ళి కామాక్షమ్మగారికి చెప్పాను. ఆ అమ్మగారు అందర్ని తోడుతెచ్చుకొని వచ్చి చూసి....ఈ అయ్యగారికి ఫోన్ చేశారు" తన రెండు కళ్ళను గట్టిగా మూసుకొని భారంగా కణతలు ఒద్దుకొంటున్న సునీల్‌వంక చూస్తూ చెప్పాడా కుర్రాడు.

"నువ్వు రోజూ ఎన్నింటికి పాలు తెస్తావు?" ఆ కుర్రాడివంక పరిశీలనగా చూస్తూ అడిగాడు ఇన్‌స్పెక్టర్ శాయిరాం.

"ఉదయం.........ఏడింటికండి: మధ్యాహ్నం రెండింటికి."

"మరి యీ రోజు మధ్యాహ్నం యెన్నింటికి పాలు తెచ్చావు?"

"మధ్యాహ్నం మూడింటికండి!"

"ఓ గంట ఎందుకు ఆలస్యంగా వచ్చావు?" అతని వంక అనుమానంగా చూస్తూ అడిగాడు ఇన్‌స్పెక్టర్ శాయిరాం.

"పాలు లేటుగా వచ్చాయండి."

"నిజం చెబుతున్నావా?" సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

ఆ కుర్రాడు ఇన్‌స్పెక్టర్ వాడిచూపులకు బెదిరిపోతూ, సన్నగా వొణికిపోతూ....చెప్పాడు.

"నిజమే సార్!"

ఇన్‌స్పెక్టర్ శాయిరాం వెంటనే ఆ అపార్టుమెంట్‌లో వున్న ఫోన్ దగ్గిరికి వెళ్ళి పాలడైరీకి ఫోన్ చేశాడు.

ఆ కుర్రాడు చెప్పిన విషయం గురించి అడిగాడు.

"నిజమే సార్....ఈరోజు ప్యాకింగ్ మిషన్ కాస్త ట్రబుల్ ఇచ్చింది."

అవతలి నుంచి రెస్పాన్స్!

చిన్నగా తల పంకించాడు శాయిరాం.

సునీల్‌ను తన వెంట స్టేషన్‌కు తీసుకెళ్ళి రిపోర్టు వ్రాయించుకొని అడిగాడు.

"మీ కెవరిమీదయినా అనుమానం వుందా?"

లేదన్నట్టుగా తలూపాడు సునీల్.

"మీ భార్య తలిదండ్రులను పిలిపించండి! వారివల్ల ఏవైనా విషయాలు తెలియవచ్చు....పోస్టుమార్టం రిపోర్టు రేపు అందుతుంది" ఆలోచనలో పడుతూ అన్నాడు శాయిరాం.

"అలాగే" అంటూ తలూపి అతనివద్ద నుంచి శెలవు తీసుకొని....తన తల్లిదండ్రులకు, అత్తమామలకు టెలిగ్రామ్స్ ఇచ్చాడు.

మరునాటి ఉదయానికి అందరూ దారి పొడువునా ఏడుస్తూ ఉస్మానియా హాస్పిటల్‌కు చేరుకున్నారు.

ఉదయం పదింటి ప్రాంతాన సుజాత శవం పోస్టుమార్టం చెయ్యబడి, రిపోర్టు సాయంకాలానికి అందింది.

అందులో....

హతురాల్ని. హంతకుడు పైశాచికంగా గొంతునులిమి చంపాడు ఆమెను చంపిన తీరునుబట్టి హంతకుడికి ఆమెపై వ్యక్తిగత ద్వేషం వున్నట్టు తెలుస్తుంది. హతురాలు రేప్ చెయ్యబడలేదు.

శవాన్ని తమ వూరికి తరలించుకుపోతుండగా సుజాత తలిదండ్రులను ఉద్దేశించి ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ శాయిరాం.

"మీమీద గాని, లేక మీ అమ్మాయిపైనగాని ఎవరికైనా పగా, ద్వేషంలాంటివి వున్నాయా?"

వారు కాసేవు ఆలోచించి చెప్పారు.

"లేవండి!"

హంతకుడ్ని పట్టుకోవడానికి ఫర్‌దర్‌గా ఎలా మూవ్ అవ్వాలి? అన్న ఆలోచనతో తన మస్తిష్కాన్ని నిమగ్నం చేశాడు ఇన్‌స్పెక్టర్ శాయిరాం.

4

తన భార్య దిన, వార కర్మలు పూర్తిచేసి ఓ పది రోజుల తర్వాత తిరిగి భాగ్యనగరం చేరుకొన్న సునీల్ ఇన్‌స్పెక్టర్ శాయిరాంను కలుసుకుని అడిగాడు నీర్సంగా.

"హంతకుని గురించి వివరాలు ఏమైనా తెలిశాయా సార్?"

ఓమారు అతని వాలకాన్ని గమనించాడు శాయిరాం. పెరిగిన గడ్డం, చిక్కిన శరీరం....

"పదిరోజులకే మనిషి సగమైపోయాడు" అనుకుంటూ చెప్పాడు.

"హంతకుడు ఎవరో తెలిసింది."

"తెలిసిందా?" సునీల్ కనుబొమలు పయికి లేచాయి.

ఉద్వేగంగా ప్రశ్నించాడు....అతను ప్రశ్నించిన తీరులో ఆవేశం వుంది.

"ఈ ఉత్తరం చదవండి! ఆ హంతకు డెవరో తెలుస్తుంది" అంటూ టేబుల్ డ్రాయర్‌లోనుంచి ఓ ఉత్తరం తీసి సునీల్ చేతికి అందించాడు. ఆత్రంగా ఉత్తరం విప్పి చదవటం మొదలుపెట్టాడు సునీల్.

"ఇన్‌స్పెక్టర్‌గారికి,

ఈ నెల పదవ తారీకున మధ్యాహ్నం రెండు గంటలప్పుడు గరుడాద్రి అపార్ట్‌మెంట్‌లో ఓ హత్య జరిగింది. దాన్ని మీరు ఇన్‌వెస్టిగేట్ చేస్తున్నారు. ఆ హత్యకు సంబంధించిన ఓ ఆధారం ఈ ఉత్తరం....ఆ హత్య చేసింది... ఎవరో కాదు నేనే! అంటే ఈ ఉత్తరం వ్రాస్తున్న వ్యక్తిని.

ప్రేమన్నది ఓ అపూర్వ వరం. అది చేజారితే, విఫలమైతే—

కొంతమంది—పిచ్చివాళ్ళు అవుతారు.

మరికొంతమంది—ఆత్మహత్యకు పూనుకొంటారు.

ఇంకొంతమంది—రాక్షసులవుతారు.

నేను మూడోరకానికి చెందినవాడ్ని!

నేను, సుజాత ఎంతగానో ప్రేమించుకొన్నాం! పెళ్ళి కూడా చేసుకోవాలని నిర్ణయించుకొన్నాం. ఈ విషయం తెలిసి ఆమె తల్లిదండ్రులు నన్ను బెదిరించారు. నేను బెదరలేదు. ఫలితంగా నాకున్న చరాస్థి, స్థిరాస్థి అయిన ఒకే ఒక పాకను నేలమట్టం చేసి నన్ను చంపడానికి ప్రయత్నించారు.

రహస్యంగా సుజాతను కలుసుకుని ఈ విషయం చెప్పి

ఎటయినా వెళ్ళిపోదాం! అని చెప్పాను. ఆమె ఒప్పుకో లేదు. పైగా 'నన్ను మరిచిపో' అంటూ నాపట్ల వున్న ప్రేమను త్యజించి, నన్ను కాదని తన తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాన్ని చేసుకొంది.

నా గుండెల్లో బాధ చెలరేగింది. అది బాధ కాదు సార్ బడబాగ్ని....రగిలిన హృదయాలకే తెలుస్తుంది ఆ అగ్ని చెలరేగే వ్యధ ఎలాంటిదో! ఆ వ్యధలో నుంచే చివరకో నిర్ణయం పుట్టుకొచ్చింది. నాకు దక్కని సుజాత మరె వ్వరికీ దక్కరాదని. ఆమెను చంపేసి నేనూ చచ్చిపోవా లని. ఆ నిర్ణయంతోనే ఈ వూరు వచ్చాను....సుజాత ఎక్కడుంటున్నది తెలుసుకొని అదను చూసి చంపేశాను. ఇప్పుడు నేను చనిపోతున్నాను.

ఇది మీకు పిచ్చిపనిగా తోచవచ్చు. ఫికిల్ మైండెడ్ లవర్స్ మెంటాలిటీస్ అన్నీ ఉలాగే వుంటాయి. వారి బ్రతుకులు ఇలా అర్థవంతంగా కడతేరి పోవలసిందే! ఈ ఉత్తరం మీకు చేరేలోపు నా శవం హుసేన్‌సాగర్‌లో తేలుతూ వుంటుంది.

ఇట్లు

ఓ ఫికిల్‌మైండెడ్ లవర్."

ఉత్తరం చదవడం పూర్తి చేసిన సుశీల్‌కు తన అత్తా మామ తనకు రెండు లక్షల కట్నం ఎందుకిచ్చారో, హంతకుడి గురించి తమకు చూచాయిగా తెలిసున్నా పోలీ సులకు ఎందుకు చెప్పలేదో, తమ కూతురు చనిపోయి వారం తిరక్క ముందే తమ రెండో కూతుర్ని తనకిచ్చి పట్టబెట్టడానికి ఎందుకు ఆరాటపడుతున్నారో స్పష్టంగా బోధ కడింది. □

ఫాలనేత్రం

వి.యస్.రావ్
సీరియల్

(గత సంచిక తరువాయి)

18

"ఒకటో తాకీదు డ్రామా జరుగుతుంది!" గణపతి నవ్వుతూ అన్నాడు.

గోవిందరావు మొహం చాట సయిజుకి సాగింది.

"నిజంగా? హీరో దొరికాడా? ఎవరు?"

"తన గురించి ఎవ్వరికీ తెలియజేయకూడదన్న షరతు విధించాడతను...." గణపతి మెల్లిగా అన్నాడు. గోవింద రావు కనుబొమలు ప్రశ్నార్థకంగా పైకి లేచాయి.

"ఇంతవరకూ భారీ ఎత్తున అలాంటి పనులు చేయలేదతను. మనలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఇరుక్కున్నాడు. అవసరం అతన్ని పురిగొల్పింది, గోవిందరావుగారూ, నేను ఎలాగా ఇందులో పూర్తిగా దిగాను. జరగబోయే దాన్ని గురించీ, జరిపించే వ్యక్తి గురించీ మీకు ఎంత తక్కువ తెలిస్తే అంత మంచిది. ఉత్తరోత్రా రిస్క్ వుండదు."

"కండిషన్లన్నింటికీ వొప్పుకున్నాడా?" గోవిందరావు అడ్డొస్తూ అడిగాడు.

"కష్టపడి వొప్పించాను. మన వాటా మనకి ఇచ్చేస్తాడు; లక్ష తక్కువగా. గాయాలు తగలడం మూలంగా మనకి లభించే కాంపెన్సేషన్ని మినహాయించాలన్న షరతు విధించాడతను. తతిమ్మా షరతులన్నీ వోకే."

"కాలాంతకుళ్ళా వున్నాడు. అలాంటి వ్యక్తిని నమ్మలేం. గాయాల సీను తీసేద్దామనిపిస్తోంది...." గోవిందరావు సాలోచనగా అన్నాడు.

గణపతి గతుక్కుమన్నాడు. క్షణంలో తెప్పరిల్లి చిన్నగా నవ్వాడు.

"ఆ విషయం గురించి క్షుణ్ణంగా ఆలోచించాను. మన నిజాయితీని చాటే సాక్ష్యాలుగా గాయాలు బాగా రాణిస్తాయన్న మీ అభిప్రాయం నిజమే అనిపిస్తోంది. దాన్ని ఉంచడానికే నిశ్చయించాను...."

"మనవాటాలెలా వసూలు చేస్తారు?" గోవిందరావు

ప్రశ్నించాడు.

"అన్నీ నిశ్చయించాను. మన వాటా పైకాన్ని-రెండు లక్షలు - రైల్వేక్లోక్ రూమ్‌లో, సూట్ కేసులో వదిలేస్తా డతను. రసీదు మీ అడ్రసుకి, ఇంటికి పోస్ట్ చేయబడు తుంది. తరవాత మీరు తీసుకుంటారు. తరవాత ఇద్దరం" గణపతి వాక్యాన్ని నవ్వుతూ పూర్తి చేశాడు.

గోవిందరావు మొహం విప్పారింది. "అతన్ని నమ్మొచ్చా?" అనుమానంగా ప్రశ్నించాడతను.

"అతన్ని రకరకాలుగా పరీక్షించాను. వాటాల కీచు లాటల్లోనే చాలామంది చట్టానికి దొరికి బలయిపోయారని అతని నమ్మకం. మోసం చేస్తే మన మూలంగా కష్టా లొస్తాయని చూచాయగా అతని బుర్రలోకి ఎక్కించాను. అతను మోసం చేయడు!" గణపతి నొక్కి చెప్పాడు.

"వెరీగుడ్!....గాయాలు...."

"భయపడకండి. లోతుగా పెద్దగా తగలాలన్న కండి షన్ లేదుగా! కౌంటర్లో టెల్లర్ డ్యూటీలో వున్న మీరు, సమయం చూసి ఎడమచేతిని అడ్డం పెడతారు. చాకుతో గాయం చేసి, ముల్లైతో అతను పారిపోతాడు. ఈలోగా నాకూ గాయం ఏర్పాటు చేయబడుతుంది...."

"వాటాలు ఎగ్గొట్టడం కోసం మనల్ని శాశ్వతంగా సాగనంపే ప్రయత్నం చేస్తాడేమో ఆలోచించారా? తెగించిన ఘటాల్ని నమ్మలేం. ఆలోచిస్తూంటే అనుమానా లొస్తున్నాయి!" గోవిందరావు యిబ్బందిగా అడిగాడు.

గణపతి క్షణకాలం అతన్ని సానుభూతితో చూశాడు. చిన్నగా నవ్వాడు. "గోవిందరావుగారూ, అతను దొంగ. హంతకుడు కాడు! అతని అనుచరులూ అంతే. ఆయు ధాలు చూపించి, బెదిరించి పని సాధిస్తారు. ఎవరేనా తిరగ

బడితే. తమ ప్రాణాలకి ముప్పు వాటిల్లితే వాళ్ళ ప్రాణాలు తీయొచ్చు మన ప్లాను ప్రకారం జరిగితే, అందాకా రాదు. అంతా మన ప్లాను ప్రకారమే జరుగుతుంది. పైగా ఎంతో కొంత రిస్క్ తీసుకోకపోతే, మనం ఊబిలోంచి బయిటపడలేం! మనిద్దరం వున్న ఊబితో పోలిస్తే తీసుకో బోయే రిస్క్ చాలా తక్కువ."

గోవిందరావు మొహం మెల్లిగా చిరునవ్వుతో విక సించింది.

"యూ ఆర్ కెరెక్ట్! ఆ మాత్రం రిస్క్ తీసుకో వచ్చు. ప్రాణభయం లేదన్న గ్యారంటీ కావాలి మనకు."

"ఆ గ్యారెంటీ నేనిస్తాను!" గణపతి ఉద్రేకంతో అన్నాడు.

గోవిందరావు తల ముందుకీ వెనక్కీ వాలింది. "మీ గ్యారెంటీ చాలు! తతిమ్మా వివరాలు...."

"అన్నీ వివరించాను. అవసరాన్నిబట్టి మళ్ళీ అతన్ని కలుసుకుంటాను."

"ఆ రోజు కౌంటర్లో నేనుండేలా చూడాలి." గోవింద రావు సాలోచనగా అన్నాడు.

"చూస్తాను. అదంతా నాకు వదలండి!" గణపతి పైకి లేచాడు.

గోవిందరావు నవ్వుతూ మంచం కిందనుంచి విస్కీ బుడ్డి యివతలకి లాగాడు! "విజయం కోసం తాగుదాం! కూచోండి!"

"అయామ్‌సారీ. ఇవాళ మా ఆవిడ పుట్టిన రోజు.... బాధ పడుతుంది; బాధ పెడుతుంది! మళ్ళీ ఇక్కడ కల్సు కుంటాంగా! మీరు కానివ్వండి. గుడ్ నైట్" అంటూ గణపతి తలుపువేపు నడిచాడు.

గోవిందరావు గ్లాసులోకి పోసిన విస్కీని ఒక్క గుక్కలో తాగేసి. సిగరెట్ వెలిగించాడు.

త్వరలో క్లోక్‌రూమ్‌లోంచి రెండు లక్షలున్న బ్రీఫ్ కేసు తన చేతుల్లోకి రాబోతోంది. గణపతి అమాయకత్వం నటిస్తున్నాడు. బుర్రని వేడెక్కించి, ఐడియా యిచ్చి, పథకం వేసిన తనకీ. అతనికీ సమానమైన వాటాలు అన్యాయం! లక్షయాభై వేలు తను తీసేసుకుంటాడు. యాభై వేలు గణపతికి ముట్టజెప్తాడు. అతను పడే శ్రమకి అది ఎక్కువే! బ్రీఫ్‌కేసులో లక్షే వుందనీ, దొంగాడు మోసం చేశాడనీ అతనితో చెప్తాడు. అలాంటి దొంగను పట్టినందుకు అతన్ని దెప్పుతాడు. రెండు లక్షలున్నట్టు ఋజువు చేయలేడు గనుక గణపతి కిక్కురు మనకుండా పడుంటాడు!

తన తెలివితేటలకి మురిసిపోతూ గోవిందరావు గ్లాసులోకి ధారాళంగా విస్కీ పోశాడు.

19

తాళంచెవి తెరిచి గణపతి ఇంట్లో ప్రవేశించాడు.

వారం రోజుల పైగా తను చాలా బిజీగా వుంటాడు. వేళకి రాకపోతే అనూరాధ వెయ్యి ప్రశ్న లేస్తుంది. తన మొహం చూసి లోపలి ఆలోచనల్ని చదివే ప్రయత్నం చేస్తుంది. అడ్వెంచర్ జరిగే సమయంలో ఆమె దూరంగా వుండటం మంచిదన్న ఉద్దేశంతో ఆమెని బలవంతంగా ఇన్‌స్పెక్షన్ సాకుతో పుట్టింటికి పంపేశాడతను.

లుంగీ కట్టుకుని గణపతి మంచం మీద వాలాడు. తను సాగించిన పరిశోధన అతన్ని ఆనందంతో, సంతృప్తితో నింపేసింది. నిటలాక్షరావూ, నక్షత్రకమూర్తీ ఒక్కరే అని తెలిశాక, ఆనాడు తను కాపుసేసి, హోటల్లోంచి

ఇవతలకి వస్తున్న నక్షత్రకమూర్తి ఫోటో తీసుకున్నందుకు అతనెంతో సంతోషించాడు.

రెండు రోజులు శలవు పెట్టేశాడు. తను ముందు పని చేసిన ఊళ్ళలో, తనని వదలకుండా అంటిపెట్టుకుని నిటలాక్షరావు బ్లాక్ మెయిల్ సాగించిన ఊళ్ళల్లో బ్యాంక్స్ అన్నింటినీ తిరిగాడు. తన పలుకుబడిని ఉపయోగించి, ఆ ఫోటోలోని వ్యక్తి ఎక్కడా లాకర్స్ అద్దెకు తీసుకోలేదని తెలుసుకున్నాడు. బ్యాంక్ లాకర్స్‌లో, ఫోటోలూ, తన కథా భద్రం చేయబడ్డాయని నిటలాక్షరావు ఊరికే బెదిరించాడు.

చివర్న ఎందుకేనా మంచిదని అతను ఈ ఊళ్ళో బ్యాంక్స్‌లో కూడా వాకబు చేశాడు. నిటలాక్షరావు చెప్పిన లాకర్ల కథ బుకాయింపే! అయితే బాంక్ ఆఫ్ ఇండియాలో, క్లర్కు నిటలాక్షరావుని పోల్చుకున్నాడు. నాలుగేళ్ళ క్రితల ఆ బాంకులో అతను సేవింగ్స్ ఎకౌంట్ ఓపెన్ చేశాడు; సుబోధ్ కుమార్ పేరుతో. బ్యాంకు రికార్డుల్ని పరిశీలించి చూశాడతను. మినిమమ్ బాలెన్స్ మాత్రం వుంది ఆ ఎకౌంట్‌లో! అయితే సుబోధ్ కుమార్ ఉరఫ్ నక్షత్రకమూర్తి-ఉరఫ్ నిటలాక్షరావు చిరునామా దొరికిందతనికి. ఆనందంతో అతని హృదయం ఎగిరి గంతేసింది.

తన వేషం మార్చుకుని, చాలా జాగర్తగా ఆ అడ్రెస్‌కి వెళ్ళి వోపిగ్గా పరిశోధించాడతను. పెద్ద కాంపౌండులోపలున్న పాత బంగళా. తాళం వేయబడింది. ఇరుగుపొరుగు వాళ్ళని విచారించి, దాదాపుగా ఏడాదిపొడవునా ఆ బంగళా తాళం వేయబడే వుంటుందని కనుక్కున్నాడు. సుబోధ్ కుమార్ అనే వ్యక్తి మరో పేటలో వున్న వోనర్‌కి

టంచన్‌గా అద్దె చెల్లిస్తున్నాడు. ఎప్పుడో వోసారి, ఆ ఇంట్లో లైట్లు వెలుగుతూ వుంటాయన్నా దొంకతను.... నిటలాక్షరావు, సుబోధ్‌కుమార్ పేరుతో ఆ ఇంటిని ఎప్పుడోసారి ఉపయోగిస్తున్నాడు!

ఆలోచిస్తూంటే అతను చెప్పిన 'బ్యాంక్ లాకర్' ఆ ఇల్లే అనిపిస్తోందతనికి! అది తనకి అన్నివిధాలా మంచిది. నిటలాక్షరావు 'గూడు' ఎక్కడుందో తెలుసుకోడం తనకి ఎంతో ఉపయోగిస్తూంది. అనుకున్నదంతా అనుకున్న విధంగా జరిగాక, తను ఆ యింటిని గాలించాలి. అంగీకరించిన విధంగా ఎవిడెన్స్‌ని అతను తనకి అందజేశాక, ఆ ఎవిడెన్స్ నకళ్ళు అతనిదగ్గిర లేవని తనుతేల్చుకోవాలి! లేకపోతే, మళ్ళీ అంగుళం, అంగుళం చొప్పున తను మునిగిపోతూనే వుంటాడు!

గణపతి తన ఆలోచనలకి ఆనందిస్తూ మంచంమీద లేచి, కూచున్నాడు. ఉషారుగా సిగరెట్ వెలిగించాడు. నిటలాక్షరావులాంటి గుంటనక్కల్ని గుడ్డిగా నమ్మడానికి లేదు! అతని ప్లాన్స్‌ని ముందే ఊహించి, ఎత్తుకి పై ఎత్తు వేసి, అతన్ని చిత్తుచేసి తనని తాను రక్షించుకోవాలి! రెండురోజుల్లో కనుక్కున్న విషయాల ఆధారంతో తను ఎత్తుకు పై ఎత్తు వేస్తాడు; నిటలాక్షరావుని చిత్తు చేస్తాడు!

20

ఒకటో తారీఖు!

ఉదయం తొమ్మిదీయాభై నిమిషాలయ్యింది. లోపల్నుంచీ పైకి తన్నుకొస్తూ తన శరీరాన్ని కొద్దిగా వణికిస్తున్న ఉద్రేకాన్ని అదుపులో పెట్టే ప్రయత్నం చేస్తూ,

గణపతి కుర్చీలో వెనక్కి వాలాడు. అప్పటికే హాజరైన గోవిందరావు తనని ఒకసారి కల్సుకుని, నోరు మెదప కుండా కళ్ళతో పలకరించి, హెచ్చరించి వెళ్ళిపోయాడు. సిబ్బంది అంతా తమ సీట్లలో సర్దుకుంటున్నారు.

గణపతి ఉలిక్కిపడి, మోగడం ప్రారంభించిన టెలి ఫోన్ రిసీవర్ని చటుక్కున అందుకున్నాడు. ఎవరు టెలి ఫోన్ చేస్తున్నారో తనకి తెలుసు. ఎందుకు చేస్తున్నారో తనకి తెలుసు! "హలో ...." అన్నాడతను మెల్లగా.

"... ... ."

"ఓహ్.... వాట్? అయామ్ సారీ.... మరేం ఫర్వా లేదుగా?.... వోకే.... ఫర్వాలేదు. నేను మేనేజ్ చేస్తాను. జాగ్రత్తగా చూసుకోండి? టేక్ కేరాఫ్ హర్!"

".. ... ."

"ఇట్సాల్‌రైట్! దాన్నిగురించి మరిచిపోండి. తరవాత ఎలావుందో చెప్పండి!"

తృప్తికరంగా నవ్వుకుంటూ అతను రిసీవర్ని పెట్టేసి, కాలింగ్‌బెల్ నొక్కాడు. అటెండర్ రాగానే గోవింద రావుని తీసుకురమ్మన్నాడు. నిమిషంలో గోవిందరావు వచ్చాడు.

"గోవిందరావుగారూ, ఇవాళ పేమెంట్స్‌లో వుండా ల్సిన రంగనాథం డ్యూటీకి రావట్లేదు. అతని భార్యకేదో చిన్న యాక్సిడెంటు అయిందట. పేమెంట్సు మీరు చూసు కోండి. రిజిస్టర్లో రాస్తాను" అన్నాడు గణపతి.

గోవిందరావు ఆశ్చర్యంగా క్షణకాలం చూశాడు. "మిసెస్ రంగనాథంకి ఏమయ్యిందీ?"

"చిన్న ప్రమాదం అన్నాడు ఫోన్లో. మరేం కంగారు పడక్కర్లేదనుకుంటాను.... కౌంటర్ ...."

"వోకే.... నేను చూసుకుంటాను...." గోవిందరావు మెల్లిగా అన్నాడు. అతని కళ్ళు నవ్వుతున్నాయి.

"ఇవాళ పేమెంట్సు అధికంగా వుంటాయనుకుంటా. జాగ్రత్తగా చూసుకోండి ..." గణపతి అన్నాడు అతన్ని చూస్తూ.

గోవిందరావు తలాడించి వెళ్ళిపోయాడు.

గడియారం పదిగంటలు కొట్టింది. డైరెక్టుగా తను పాల్గొనకపోయినా, గణపతి గుండెలో రైళ్ళు పరుగెడు తున్నాయి. స్ప్లిట్ సెకెండ్ టైమింగ్‌తో అంతా జరిగేలా ప్లాన్ చేయబడింది. లోపల్నించి ఏదో కంఠం అంతా సవ్యంగా జరుగుతుందని గంటకొట్టినట్టు చెప్తోందతనికి. కుర్చీలోంచి లేచి తలుపు తెరిచి, తొంగిచూశాడతను.

కౌంటర్లో అంతా సిద్ధం చేస్తున్నాడు గోవిందరావు. త్వరలో ఆతిధ్యం స్వీకరించబోయే ప్రముఖ వ్యక్తికోసం విస్తర్లో జాగ్రత్తగా వడ్డిస్తున్న వ్యక్తిలా ఏకాగ్రతతో పని చేసుకుపోతున్నాడతను. తనలో నవ్వుకుంటూ గణపతి మెయిన్ ఎంట్రన్స్‌వేపు చూశాడు. వజ్రవేలు కాకీ యూని ఫామ్‌లో నిలబడ్డాడు. నేలమీద మోపబడిన తుపాకీని అతని ఎడమచెయ్యి నిర్లక్ష్యంగా పట్టుకుంది.

గణపతి మళ్ళీ కుర్చీలో కూచున్నాడు. ఇంకా ఏడు నిమిషాలుంది; మొదటిసీను ప్రారంభం కావడానికి. రెండోసీను తను నిర్ణయించిన టైమ్‌కి ప్రారంభం అవు తుందా? దానిమీదే తన అదృష్టం ఆధారపడి వుంది. ఆలో చిస్తూ ముళ్ళమీద కూచున్నాడతను....

* * *

బ్యాంక్ దగ్గిరగా మలుపులో పాత కారు ఆగింది.

ఇద్దరు యువకులు కిందికి దిగి, బ్యాంకువేపు చకచకా

నడిచారు. వాళ్ళిద్దరూ బాంక్ కాంపౌండ్‌లో ప్రవేశించాక, కారు కదిలింది. గేటుకి కొంచెం ముందుగా ఆగింది.

వెనకసీట్లో కూచున్న నిటలాక్షరావు ముందుకి వొంగి డ్రైవర్ చెవిలో ఏదో చెప్పాడు. అతను గంగిరెద్దులా బుర్ర ఆడించాడు. నిటలాక్షరావు దిగాడు. కొద్దిగా పెరిగిన గెడ్డం. రిమ్‌లెస్ అద్దాలు. పొమేడ్ రాసి నున్నగా మెత్తగా వెనక్కి దువ్విన క్రాపు. వయిట్ పాంటు. వయిట్ స్వెట్టర్. డిస్కో-రిథమ్ విజిల్ వేసుకుంటూ బ్యాంక్‌లోపలికి నడిచాడు. సన్నటి పొడుగాటి వ్యక్తి, ఆల్సేషియన్ డాగ్‌లా అతన్ని అనుసరించాడు.

నిటలాక్షరావు కౌంటర్‌కి కొంచెం దూరంలోకి ఆగి, అట్టే జనంలేని బ్యాంకుని చిరునవ్వుతో చూశాడు. తన వాళ్ళు ముందు చెప్పిన విధంగా ఎవరి స్థానాల్లో వాళ్ళున్నారు. అతను జేబులోంచి సిగరెట్ తీసి పెదాల మధ్య ఇరికించాడు. అతని కళ్ళు డేగకళ్ళలా అటూ యిటూ చూశాయి. ఉన్నట్టుండి అతని చేతిలోని లైటర్ వెలిగింది.

ఆ తరవాత సంఘటనలు చకచకా జరిగిపోయాయి. తలుపు దగ్గిర నుంచున్న పొడుగాటివ్యక్తి చేతిలో ప్రత్యక్షమైన రివాల్వర్ పిడి, గార్డు నెత్తిమీద సుత్తిలా దిగింది. కూలిపోతున్న గార్డుని పట్టుకుని గోడవారగా పడేశాడతను. ఎవరో అరిచారు. నిటలాక్షరావు చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమైంది.

"ఎవ్వరూ కదలకండి!" బిగ్గరగా అరిచాడతను. పది పన్నెండు తలలు అతనివైపు చూశాయి.

కౌంటర్లముందు జనంలో కలిసి నించున్న వ్యక్తి కొంచెం దూరంగా జరిగాడు. "అందరూ బోర్లా పడు

కోండి! పడుకోకపోతే ప్రాణాలు పోతాయ్! బొంగురుగా అరిచాడతను. అయిదారుగురు వ్యక్తులు కంగారుగా చూస్తూ బోర్లాపడుకున్నారు.

ఈలోగా. కౌంటర్ల పక్కనున్న సన్మైకా డోర్ని తోసుకుంటూ లోపలికెళ్ళిన మూడో వ్యక్తి. బ్యాంకు సిబ్బందిని రివాల్వర్‌తో అదుపుచేశాడు. ఒక నిమిషంలో ఆరుగురు ఉద్యోగులూ గోడవైపు తిరిగి చేతుల్ని తలలపైన గోడకి ఆనించి, రాతిబొమ్మల్లా నిలబడ్డారు.

"కదలిన బుర్ర రామకీర్తన పాడుతుంది!" వాళ్ళను కంట్రోల్ చేస్తున్న వ్యక్తి హెచ్చరించాడు. తలుపుముందు పొడుగాటి వ్యక్తి కాపలా కాస్తున్నాడు.

నిటలాక్షరావు కౌంటర్ వైపు చూశాడు. 'పేమెంట్స్' వెనక కూచున్న వ్యక్తిని వోరగా చూశాడు. తల నెరిసిన వ్యక్తి తననే చూస్తున్నాడు

గలభావిని, తన గదిలోంచి గణపతి పరుగెట్టుకొచ్చాడు. రివాల్వర్స్ పట్టుకున్న వ్యక్తుల్ని చూసి తటాలున ఆగి, విగ్రహంలా నిలబడ్డాడు. నిటలాక్షరావు చిరునవ్వుతో కౌంటర్ముందు నుంచి తీసుకున్న నోట్లను బాగ్‌లో దోపుకోడానికి వణికే చేతుల్తో ప్రయత్నిస్తున్న యాభైయేళ్ళ స్త్రీని చూశాడు.

"మామ్మా, వెళ్ళి అక్కడ బోర్లా పడుకో!" అన్నాడు నవ్వుతూ.

ముసలామె కంగారుగా చూసింది.

నిటలాక్షరావు ఊహించనివిధంగా తలుపువేపు గంతేసి, పరుగెట్టే ప్రయత్నంచేసింది.

అతను తటాలున పక్కకి తిరిగాడు. రెప్పపాటులో ఆతని చేతిలోని రివాల్వర్ పేలింది.

ఆమె బోర్లా పడిపోయింది. చెవిలోంచీ కారుతున్న రక్తం ఆమె తలచుట్టూ మడుగుకట్టుతోంది

రివాల్వర్ షాట్ విన్నాక. కార్లోంచీ మరోవ్యక్తి దిగాడు. అతని చేతిలో పెట్రోల్ కాన్ వుంది. జోరుగా నడుస్తూ అతను బాంకులోకి దూరాడు. బాంకులోపలికి వెళ్ళబోయిన ముగ్గురు వ్యక్తులు వెనుదిరిగి పరుగెడుతున్నారు....

నిటలాక్షరావు కౌంటర్ మీదికి ఎగిరి అటువేపు దూకాడు. కటకటాలు తోస్తూ, కాష్‌వున్న పంజరంలోకి దూరబోయాడు.

గణపతి మెరుపులా కదిలాడు. అతని చేతులు నిటలాక్షరావుని పట్టుకోబోయాయి.

నిటలాక్షరావు తటాలున వెనక్కి తిరిగాడు. అంతసేపూ ఖాళీగావున్న అతని ఎడమచేతిలో ఇప్పుడు పదునైన కత్తి ప్రత్యక్షమైంది. రెప్పపాటులో కత్తి గణపతి ముంజేతిలో లోతుగా దిగింది.

గణపతి అసంకల్పితంగా కెవ్వుమన్నాడు.

కత్తిని లాగేసి నిటలాక్షరావు అతన్ని నవ్వుతూ చూశాడు.

గణపతి కళ్ళు ఎందుకో మెరుస్తున్నాయి. గాయాన్ని కప్పిన ఆతని వేళ్ళ సందుల్లోంచీ రక్తం కారిపోతోంది.

"మేనేజర్, ఈసారి నువ్వు కదిలితే, కత్తి బదులు బుల్లెట్ నీలోపలికి దూరుతుంది!" అంటూ నిటలాక్షరావు కేజ్‌లోకి దూరాడు.

పెట్రోల్ కాన్‌తో వచ్చిన అయిదో వ్యక్తి రివాల్వర్‌ని గణపతి కణతకి ఆనించాడు.

కాష్ కేజ్‌లోవున్న గోవిందరావు తటాలున తిరిగి, నిట

లాక్షరావు మీదికి విజృంభించాడు. తనూ గాయపడాలని అతనికి తెలుసు! నిటలాక్షరావు అతన్ని తోస్తూ చిరునవ్వు నవ్వి. కన్నుగీటాడు. అతని ఎడమచెయ్యి పాముపడగలా దూసుకెళ్ళింది. పదునైన కత్తి ఎర్రగా మెరుస్తూ అతని చాతీ ఎడమభాగం లోపలికంటా చొచ్చుకుపోయింది.

చేతికి గుచ్చుకుంటుందనుకున్న కత్తి ఛాతీలో దిగినందుకు, చివరిక్షణాల్లో గోవిందరావు ఆశ్చర్యంతో చూశాడు. నిటలాక్షరావు మొహంమీద చిరునవ్వు మాయంకాలేదు. కత్తిని పట్టుకున్న అతని చెయ్యి అటూ, ఇటూ కదిలింది; కత్తి గోవిందరావు హృదయాన్ని కర్కశంగా కెలికింది. నిటలాక్షరావు కత్తిని బలంగా లాగాడు.

నిర్జీవంగా నేలకూలుతున్న గోవిందరావు ఛాతీమించీ రక్తం పిచికారితో కొట్టినట్టు పైకి చిమ్మింది. రక్తం తన మీదికి పడకుండా నిటలాక్షరావు జరిగాడు. గోవిందరావు శరీరాన్ని మూలకి బోర్లా తోశాడు.

గడగడ వణికిపోతూ, గణపతి రెప్ప వేయకుండా చూస్తున్నాడు.

కౌంటర్లోవున్న నోట్లన్నింటినీ పెద్ద కాన్వాస్ బాగ్‌లోకి తోసుకుని, నిటలాక్షరావు అతని ముందుకు దూకాడు.

"మేనేజర్, స్ట్రాంగ్‌రూమ్ తెరువు!" బిగ్గరగా అరిచాడతను.

"నో!" గణపతి అరిచాడు. తన నాటకం సహజంగా వుండాలి!

"తాళం తెరుస్తావో, తలలోకి తూటాని ఆహ్వానిస్తావో తేల్చుకో! ఒకటి.... రెండు.... మూడు ..."

"ఓకే.... తెరుస్తాను...." గణపతి కంఠం నిజంగానే వణికింది.

రెండు నిమిషాల్లో స్ట్రాంగ్‌రూమ్‌లో వున్న నోట్ల కట్టలు. నిటలాక్షరావు సంచీలోకి వెళ్ళాయి. పెట్రోల్ కాన్‌ని కిందపెట్టి. అయిదోవ్యక్తి నిటలాక్షరావు చేతిలోని సంచీని అందుకుని బైటికి పరుగెత్తాడు. నిటలాక్షరావు టైమ్ చూసుకున్నాడు. బైట కారు కదిలిన చప్పుడు లీలగా వినిపించింది. అతని మొహంమ్మీద చిరునవ్వు మెరిసింది. గణపతి శరీరం వణుకుతోంది.

"రికార్డ్‌రూమ్।" నిటలాక్షరావు నవ్వుతూ అన్నాడు. గణపతి ఉలిక్కిపడ్డాడు. జరిగిన సంఘటనల్తో అతని బుర్ర దాదాపు మొద్దుబారిపోయింది. తెప్పరిల్లి ఇవతలికి నడిచాడు.

"రికార్డ్‌రూమ్ వొద్దు" ఇంకా గోడకి అతుక్కునే వున్న ఎంప్లాయీస్‌కి వినిపించేలా అన్నాడు.

"ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ దాడిచేశాం! చెప్పిందిచేస్తే మీకెవ్వరికీ అపాయం రాదు! కమాన్, రికార్డ్‌రూమ్ తెరు!" నిటలాక్షరావు అరిచాడు.

క్షణంలో ఇద్దరూ పక్కనే వున్న రికార్డ్‌రూమ్‌లో వున్నారు. రాక్స్‌మీద వున్న రికార్డ్ దొంతరల్ని గణపతి సాభిప్రాయంగా చూశాడు. కాన్‌లోని పెట్రోల్ని రాక్ మీదికి పూర్తిగా చల్లేశాడు నిటలాక్షరావు. ఖాళీ కాన్‌ని రాక్‌లో ఇరికించాడు.

గణపతివైపు నవ్వుతూ జేబులోంచీ కవర్నితీసి అతనికి అందించాడు. వణికే చేత్తో అందుకుని, లోపలున్న నెగిటివ్స్‌నీ. ఫోటోల్నీ చూశాడతను. నిటలాక్షరావు మాట నిలబెట్టుకున్నాడు. పెట్రోల్తో తడిసిన రికార్డ్ దొంతరమీద కవర్ని జాగ్రత్తగా పెట్టాడతను.

ఇద్దరూ దూరంగా జరిగారు. ఉండలా చుట్టిన కాగి

తాన్ని లైటర్తో వెలిగించి, నిటలాక్షరావు దాన్ని బంతిలా రాక్ కిందికి విసిరాడు. గుప్పున మంటలు లేచాయి.

"గుడ్‌గాడ్!" గణపతి తన డైలాగ్‌ని బిగ్గరగా ఉచ్ఛరించాడు. అతని దృష్టి ఫోటోలున్న కవర్‌మీదే వుంది. కవర్ మంటల్లో చిక్కుకుంది. మాడి మసి అయిపోయింది! గతం బూడిదయింది!

ఏదో చప్పుడు వినిపించి, అతను వెనుదిరిగాడు. నిటలాక్షరావు కౌంటర్‌మీంచీ అటువైపుకి గెంతుతున్నాడు. గణపతి కదిలాడు. తమమీద రివాల్వర్ గురి యిప్పుడు లేదని తెలుసుకున్న ఉద్యోగులు గోలగా అరుస్తున్నారు. గణపతి వాళ్ళని పట్టించుకోలేదు.

ఇప్పటిదాకా, నిటలాక్షరావూ, తనూ తయారుచేసిన పథకం అమలుజరిగింది. ఇప్పుడు తన ప్లాన్ జరగాలి! అప్రయత్నంగా, కంగారుగా అతను రిస్ట్‌వాచీ చూసుకున్నాడు. దోపిడీ ప్రారంభమై కొన్ని గంటలు గడిచినట్టనిపిస్తోందతనికి. కానీ అయిదు నిమిషాలే గడిచాయని అతని వాచీ చెప్తోంది.

గణపతి కౌంటర్ మీదుగా పైకెగిరాడు. రక్తం మడుగులో పడున్న స్త్రీ శవాన్ని దాటుకుంటూ, తెలివిలేకుండా శవంలా పడున్న గార్డుని సమీపించాడు. అతని చేతిలో రైఫిల్ లేదు. గార్డుని పక్కకితిప్పి, అతని పాంటు జేబులోకి చేతిని పోనిచ్చాడు గణపతి. జేబులోవున్న రివాల్వర్‌ని అతని వేళ్ళు ఉద్రేకంతో చుట్టేశాయి. చెప్పుల్ని వదిలేసి, లేడిలా తలుపువైపు గెంతేశాడు. అతనిలో ఆలోచనలు ఆదుర్దాగా సాగుతున్నాయి. ప్లాన్ చేసిన విధంగా వాళ్ళు వస్తారా....

రోడ్లో గోలగా ఎవరో నినాదాలు చేస్తున్నారు! వాళ్ళ

వచ్చారు! సరిగ్గా తను రమ్మన్న టైముకే! థాంక్‌గాడ్!
గణపతి ఉద్రేకంతో ముందుకి చూశాడు. కాంపౌండులో నిటలాక్షరావు జోరుగా నడుస్తున్నాడు. అతని చేతిలో ఇప్పుడు రివాల్వర్ లేదు. గేటు అవతల డోర్ తెరిచిన నీలం కారు రెడీగావుంది. గెట్ అవే కార్! డబ్బుతో మొదటికారు వెళ్ళిపోయినట్టుంది....

క్షణంలో. కారుకీ గేటుకీ మధ్య పాతికమందికి పైగా యువకులు గోలగా నినాదాలు చేస్తూ వచ్చేశారు.

"ష్యూరిటీ అడక్కుండా, గ్రాడ్యుయేట్ యువకులకి లోన్లు ఇవ్వాలి!" అరుస్తున్నాయి వాళ్ళ కంఠాలు. నిటలాక్షరావు తటాలున ఆగాడు. కారుకీ తనకీ మధ్య గోడలా వున్న యువకుల్ని చేతుల్తో తోసుకుంటూ దూరసాగేడు. తనకి అయిదడుగుల దూరంలో వస్తున్న గణపతిని అతను చూడలేదు....

గణపతి యువకుల గుంపులోంచీ గాలిలా దూసుకెళ్లాడు. అతని చేతిలోని రివాల్వర్‌ని చూసిన యువకులు చెల్లాచెదురుగా పరుగెడుతూ అరుస్తున్నాడు.

నిటలాక్షరావు కారు వెనక సీటులో దూరబోతూ తల తిప్పాడు. అతని మొహానికి రెండంగుళాల దూరంలో వున్న రివాల్వర్ ట్రిగర్ని గణపతి చూపుడువేలు నొక్కింది. రివాల్వర్‌కి ఎదురుగావున్న తలని నిటలాక్షరావు పక్కకి తిప్పడంవల్ల, కణత పక్కకిజరిగి, నుదురు ఎదురుగా తిరిగింది. తూటా అతని రెండు కళ్ళమధ్యా దూరింది. అదేక్షణంలో కారు కదిలింది. నిటలాక్షరావు శరీరం నిర్జీవంగా రోడ్డుమీద వెల్లకిలా పడ్డాడు. గణపతి అతన్ని ఉద్రేకంతో, అసహ్యంతో చూశాడు రివాల్వర్‌ని నిటలాక్షరావు గుండెకి గురిచేశాడు. ట్రిగ్గర్ నొక్క

బోతూ, ఆగి అతని మొహంలోకి చూశాడు.

నవ్వుతూ, పళ్ళికిలిస్తూ తన జీవితాన్ని నరకంగా మార్చిన రాక్షసుడు శవంగా మారి, నిస్సహాయంగా తన కాళ్ళదగ్గర పడున్నాడు! నుదురుమీద గాయం మూడో కన్నులా అవుపిస్తూ అతని పేరుని సార్థకం చేస్తూంది! ట్రిగ్గర్ నొక్కకుండా గణపతి కిందికి వంగాడు. నిట లాక్షరావు పాంటు జేబుల్ని తడిమాడు. ఒక జేబులో రివాల్వర్ వుంది. రెండో జేబు ఖాళీ. కాలితో శవాన్ని కొద్దిగా పక్కకి తోశాడతను. అతని ఎడమచేతి వేళ్ళు నిటలాక్షరావు బాక్ పాకెట్‌లోకి దూరాయి. చల్లగా, గట్టిగా తగిలిన తాళంచెవిని ఇవతలికిలాగి, వేళ్ళమధ్య దాచుకున్నాడతను.

ఎవరిచెయ్యో అతని మోచేతిని తాకింది. ఉలిక్కిపడి గణపతి తలతిప్పి చూశాడు. బాంక్ ఉద్యోగి మధు సూదన్ అతన్ని కంగారుగా చూస్తూన్నాడు.

"సార్ ... మీకేమయ్యిందో అని భయపడ్డాం. థాంక్ గాడ్! సార్ కంగ్రాట్స్! వాణ్ని చంపారు! మన ఫోన్ పనిచేయడం లేదు. పదండి. పక్కషాపులోంచీ పోలీసు లకి ఫోన్‌చేద్దాం...." అన్నాడతను, గణపతి భుజంమీద చెయ్యివేస్తూ.

గణపతి హిప్నాటిక్ లోకంలోంచీ, భూమ్మీదికి దిగాడు. చుట్టూ గోలగావుంది. జనం గుండ్రంగా తమ చుట్టూచేరి ఉద్రేకంతో అరుస్తూ ఏమిటేమిటో చెప్పు కుంటున్నారు. రక్తం కారుతున్న తన చేతిని మెల్లిగా పాంటుజేబులోకి దోపుకున్నాడతను. తాళంచెవి జేబులోకి జారింది.

"మేనేజర్‌గారు దూసుకొచ్చారు. సరైన క్షణంలో

వాణ్ణి పేల్చేశారు! ఆయన ప్రాణాలకి తెగించి సమయ స్ఫూర్తితో ప్రవర్తించాడు!" ఎవరో వ్యక్తి ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు. గణపతి లోపల్లోపలే తృప్తిగా నవ్వుకున్నాడు. తను అప్పుడే 'ఆదర్శ పురుషుడు' అయి పోతున్నాడు! అతనికి తటాలున గోవిందరావు గుర్తొచ్చాడు....

21

తనముందు కుర్చీల్లో కూచున్న యువతినీ, యువకుడినీ గణపతి చిరునవ్వుతో చూశాడు.

"వెల్‌కమ్ టు మై బ్యాంక్!" అన్నాడతను. యువతీ, యువకుడూ చిరునవ్వు నవ్వారు.

గణపతి వాళ్ళని విచారంతో చూశాడు. "మిస్టర్ మోహన్, మీ నాన్నగారు ఎంతో చిత్తశుద్ధితో పనిచేశారు. బ్యాంకుని దోచుకోడానికి వచ్చిన ఆ రాక్షసుడిని ధైర్యంగా ఎదిరించి, బలై పోయారు. అయామ్ సారీ. గోవిందరావు గారి ఆత్మకు శాంతి చేకూరాలని రోజూ నేను ప్రార్థిస్తున్నా. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇన్సెంటివ్ మూలంగా మీకీ ఉద్యోగం లభించింది. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన గోవిందరావుగారి పుత్రుడుగా మీరు గర్వించాలి...."

"థాంక్యూసార్," మోహన్ మెల్లిగా అన్నాడు.

గణపతి తన చూపుల్ని యువతివేపు తిప్పాడు.

"మిస్ వింధ్యా, భయంతో మీ అమ్మగారు పారిపోయే ప్రయత్నంచేసి, దొంగ బుల్లెట్‌కి బలై పోయారు. నా సానుభూతి మీకెప్పుడూ వుంటుంది. అందుకే మరో ఊళ్ళో కాకుండా మీకు ఇక్కడే అపాయింట్‌మెంట్ వేయించాను. లక్షరూపాయల పారితోషికం గానీ, ఉద్యోగం కానీ మీ

ఇద్దరికీ జరిగిన నష్టాన్ని భర్తీ చేయలేవు. గతాన్ని మరిచి పోండి. చక్కగా డ్యూటీచేస్తూ వృద్ధికి రండి!" అంటూ గణపతి బెల్‌నొక్కాడు. అటెండర్ లోపలికి వచ్చాడు.

"మధుసూదన్‌గార్ని రమ్మను" గణపతి ఉత్తరు విచ్చాడు. కాసేపట్లో మధుసూదన్ లోపలికి వచ్చాడు. గణపతి అతన్ని కూచోమన్నాడు.

"మిస్టర్ మధుసూదన్, మోహన్, వింధ్య ఈరోజే డ్యూటీలో జాయిన్ అవుతున్నారు...."

"తెలుసు!" మధుసూదన్ నవ్వుతూ అన్నాడు.

"నెలరోజులు వీళ్ళకి అన్ని కౌంటర్లలోనూ ట్రెయినింగ్ ఇవ్వండి. ఈ నెలరోజులూ మీ డ్యూటీ అదే!"

"విత్ ప్లెషర్!" అంటూ మధుసూదన్ లేచాడు. వాళ్ళిద్దరివైపూ నవ్వుతూ చూశాడు. వింధ్య కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"వెళ్ళండి. మధుసూదన్‌గారు బాంకింగ్ ఎక్స్‌పర్ట్. ఆయనదగ్గర అంతా నేర్చుకోండి!" గణపతి నవ్వుతూ అన్నాడు.

మోహన్, వింధ్యా లేచారు.

* * *

సాయంత్రం అయిదు కావొస్తోంది.

మోహన్ బ్యాంక్ గేటు ముందు నిలబడ్డాడు. వింధ్య ఫుట్‌పాత్ మీద నడిచిపోతోంది. సన్నగా పొడుగ్గా వున్న ఆమె నడకలో ఏదో ఆకర్షణ వుంది. బ్యాంక్ దోపిడీలో తను తండ్రిని పోగొట్టుకున్నాడు. ఆమె తల్లిని పోగొట్టు కుంది. ఇప్పుడు తనకి తల్లిమాత్రం వుంది. ఆమెకి తల్లీ, తండ్రీ ఇద్దరూ లేరు. ఆమెకి లక్షరూపాయలూ, ఉద్యోగం

ఇప్పించిన ఆమె తల్లి దుర్మరణం ఆమెని ఏకాకిగా చేసింది... మోహన్ సానుభూతితో నిట్టూర్చాడు మలుపు తిరిగి, వింధ్య అతని చూపుల్లో అదృశ్యమైంది.

"హలో మిస్టర్ మోహన్!"

మోహన్ వెనుదిరిగి చూశాడు. పొట్టిగా, లావుగావున్న బ్యాంకు ఉద్యోగి తనవేపు వస్తున్నాడు ఉదయం అందరూ తనకి పరిచయం చేయబడ్డారు. అతను రంగనాధం అయ్యుండాలి....

"కమాన్, కాఫీ తాగుదాం!" రంగనాధం ఉషారుగా అన్నాడు.

"థాంక్స్. ఇంటికెళ్తాను. అమ్మ చూస్తూవుంటుంది" మోహన్ చిరునవ్వుతో అన్నాడు.

"అమ్మ కాఫీ ఇంటికెళ్ళాక తాగండి! కమాన్...." అంటూ రంగనాధం అతని భుజం మీద చెయ్యివేసి లాగాడు.

కొంచెం దూరంలోవున్న హోటల్ ఇంపాలాలో ప్రవేశించారిద్దరూ. రంగనాధం కాఫీ ఆర్డరిచ్చి, ఎదురుగా కూచున్న మోహన్ని అదోలా చూశాడు.

"మిస్టర్ మోహన్, మీ నాన్నగారు మా అందరితో కుర్రాడిలా కలిసి కేరింతలు కొట్టూండేవారు. అయామ్ సారీ... ఉయ్ మిస్ హిమ్...."

"థాంక్స్...."

"మోహన్, నిజం చెప్పాలంటే అయామ్ లక్కీ. నాకు బదులుగా నాన్నగారు మరణించారు!"

మోహన్ ఆశ్చర్యంగా చూశాడు. అతని కనుబొమలు ప్రశ్నార్థకంగా ముడిపడ్డాయి. రంగనాధం అతన్ని తదేకంగా చూశాడు.

"ఆరోజు కౌంటర్ డ్యూటీ నాది. కానీ, నా భార్యకి జరిగిన చిన్న ప్రమాదం కారణంగా నేను హాజరు కాలేక పోయాను. నా బదులు మీ నాన్నగారు పేమెంట్స్‌లో కూచున్నారు...." అర్థమైందా అన్నట్టు చూశాడతను మోహన్ వైపు. మోహన్ అలాగే చూస్తున్నాడు.

"మా ఆవిడకి జరిగిన ప్రమాదం నాకు అదృష్టమైంది; అదే మీ నాన్నగారికి దురదృష్టంగా పరిణమించింది. మిస్టర్ మోహన్, నేను క్షేమంగా వున్నందుకు ఆనంది స్తున్నాకూడా, మీ నాన్నగారి దుర్మరణానికి నిజంగా విచా రిస్తున్నాను!" రంగనాథం ఆవేశంతో అన్నాడు.

మోహన్ అతన్ని కృతజ్ఞతతో చూశాడు. "ఒకరి అదృష్టం మరొకరికి దురదృష్టంగా పరిణమిస్తుందని ఈ సంఘటన రుజువుచేస్తోంది. మా నాన్న బతికుంటే ఇంకా పైకి చదివేవాణ్ని. ఇప్పుడు ఉద్యోగం చేయాల్సివచ్చింది! మీ సానుభూతికి థాంక్స్. అన్నట్టు మీ ఆవిడ ఎలా వున్నారు? ఆవిడకేమైంది?" మోహన్ సభ్యతగా అడిగాడు.

"బాగానే వుంది. ఆరోజు ఉదయం నేను స్టేషన్ కెళ్ళాను. తిరిగి వచ్చేసరికి, సుజాత తలమీద గాయంతో స్పృహలేకుండా పడుంది. తలచుట్టూ రక్తం మడుగు కట్టింది. హాస్పిటల్‌కి వెళ్ళేక, అరగంటకి ఆమె కోలు కుంది. నాలుగు సూచర్స్ వేశారు...."

"సారీ. గాయం ఎలా తగిలింది? ఆవిడ జారిపడ్డారా?" మోహన్ కాఫీ చప్పరిస్తూ అడిగాడు.

రంగనాథం తలని అడ్డంగా ఆడించాడు. "ఎవడో దొంగలా ఇంట్లో ప్రవేశించాడు. స్టోర్‌రూమ్‌లో ఏదో కిందపడ్డ చప్పుడైంది. ఏమిటో చూద్దామని సుజాత లోపలి

కెళ్ళింది. వెనకనుంచీ ఆమె తలమీద బలంగా దెబ్బ తగిలింది. కిందపడిపోతూ ఆమె వెనక్కి తిరిగింది. మొహానికి, చిల్లులున్న జేబురుమాలు అడ్డంగా కట్టుకున్న పొడుగాటి వ్యక్తి ఆమెకి కనిపించాడు. ఆమె భయపడిపోయింది. ఆ షాక్, తలమీది దెబ్బకు సహాయపడింది. ఆమె స్పృహతప్పి పడిపోయింది. ఇదంతా, తెలివొచ్చాక ఆమె నాకు చెప్పింది...."

"ఏవేనా వస్తువులూ, గట్రా పోయాయా!" మోహన్ క్యూరియాసిటీతో ప్రశ్నించాడు.

"అదే ఆశ్చర్యం. పూచికపుల్ల పోలేదు. ఆమె మెడలో నెక్లెస్‌కూడా అలాగే వుంది! మరో విచిత్రం ఏమిటంటే, పొద్దుటే నేను కూరలు పట్టాడానికి మార్కెట్ కెళ్ళాను. ఎవరో సుజాతకి ఫోన్‌చేశారు. నా ప్రాణమిత్రుడనీ, రైలుదిగి, స్టేషన్‌లో ఉన్నాననీ ఫోన్‌చేసిన వ్యక్తి అన్నాడు. ఆమె అడిగినా పేరు చెప్పలేదు. 'ప్రాణమిత్రుడు' అని చెప్తే మీ ఆయనకు అర్థమవుతుంది. మాట్లాడి, అరగంటలో మరో ట్రెయిన్‌కి ఢిల్లీ వెళ్ళాలి. త్వరగా రమ్మనండి! అన్నాడా వ్యక్తి. నా ప్రాణమిత్రుడు సుబ్బారావు అయివుంటాడనుకుని స్టేషన్‌కి వెళ్ళాను. అక్కడ నాకు తెలిసిన వ్యక్తి ఎవరూ లేరు! అరగంటపాటు చూసి తిరిగొచ్చాను. వచ్చేసరికి సుజాత స్పృహలేకుండా పడుంది! ఆ ఫోన్‌కాల్‌కీ, సుజాతమీద జరిగిన దౌర్జన్యానికీ సంబంధం వుందా అని ఆరోజునుంచీ ఆలోచిస్తున్నా...." రంగనాథం నవ్వుతూ అన్నాడు.

ఇద్దరూ లేచి హోటల్లోంచీ ఇవతలికి వచ్చారు. రంగనాథం కథ మోహన్ని ఆశ్చర్యంతో నింపింది. "పోలీసులకి ఫిర్యాదు చేశారా?"

"చేశాను. ప్రాణాలు తీశారు; ప్రశ్నల్తో! స్టోర్ రూమ్‌లో పడున్న శ్పానర్ ఉపయోగించి సుజాతను గాయ పరిచాడని వాళ్ళన్నారు. దానిమీద వేలిముద్రలుకూడా తీశారు. ఏమీ లాభం లేకపోయింది;" రంగనాధం చిరు నవ్వుతో అన్నాడు. "మీరు ఎటువేపు వెళ్ళాలి?"

మోహన్ కుడివేపు రోడ్డు చూపించాడు. "వోకే; మోహన్. సీ యూ టుమారో!" అంటూ రంగనాధం బ్యాంకుముందు ఆపిన స్కూటర్‌వేపు అడుగులేశాడు.

రంగనాధం చెప్పిన విషయాలు అతని తలలో గిర్రున తిరుగుతున్నాయి.

మిసెస్ రంగనాధంకి ఆవాళ గాయం తగలకుండా వుంటే, తనతండ్రి దుర్మరణం పాలయ్యేవాడు కాడు! తను ఆశయాల్ని చంపుకుని బ్యాంకు గుమాస్తా అయ్యేవాడు కాడు! డబ్బుకోసమూ, నగలకోసమూ కాక, మరెందుకు రంగనాధం భార్యమీద దాడిజరిగింది? ఆశ్చర్యంగా ఆలో చిస్తూ మోహన్ ఇంటివేపు నడవసాగేడు. భార్యను గాయ పరచడానికి, రంగనాధంని ఎవరో స్టేషన్‌కి పంపించాడు! అతను డ్యూటీకి హాజరుకాకుండా ఉండటానికి, ఎవరేనా - అతని భార్య హాస్పిటల్‌కి వెళ్ళేలా చేశారా?

అర్థంలేని తన అనుమానానికి నవ్వుకుంటూ మోహన్ తన ఇల్లున్న సందులోకి తిరిగాడు....

22

అనూరాధ అతని పక్కనే కూచుని, బ్యాండేజీవున్న అతని ఎడమచేతిని రెండు చేతుల్తో పట్టుకుంది. ఆమె వేళ్ళు ప్రేమతో వణుకుతున్నాయి. తలెత్తి అతని మొహం లోకి చూసింది. తడిగావున్న ఆమె పెద్దపెద్ద కళ్ళు

జ్యోతుల్లా వున్నాయి.

"పేపర్లో చూసి, నాన్న చెప్పేదాకా నాకు తెలీదు. ఎందుకంత సాహసం చేశారు?" అనూరాధ కంఠం వణికింది.

"విధి!" అన్నాడతను క్లుప్తంగా.

"బ్యాంకుల్ని దోచేవాళ్ళు తెగించిన ఘటాలు. ఇంకెప్పుడూ ఇలాంటి సాహసాలు చేయకండి. గోవిందరావు అనే ఉద్యోగి, సాహసంచేసి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. మీరే చూశారుగా! మీది మొండిధైర్యం! ఆ దొంగని వెంటాడి, రివాల్వర్‌తో కాల్చి చంపేశారు...."

గణపతి సగర్వంగా నవ్వాడు. "నీ భర్తని పత్రికలూ, పోలీసులూ ఆకాశాని కెత్తేశారు. చూశావుగా!"

అనూరాధ అతన్ని కన్నీళ్ళతో చూసింది, "గోవిందరావుని ఇంకా పైకెత్తేశారు. నాకు అవన్నీ అక్కర్లేదు. పేరు ప్రఖ్యాతులూ, యాభై వేల పారితోషికాలూ మీ తరువాతనే!"

గణపతి చిరునవ్వుతో ఆమెని దగ్గిరగా లాక్కున్నాడు. అనూరాధ తన చెంపని అతని ఛాతీమీద అన్చి, నిట్టూర్చింది. ఆమె ప్రేమ అతన్ని కదిలించేస్తోంది. తను బ్రహ్మాండంగా ప్లానువేసి, తన గతానికి రీ ఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ సమాధి కట్టేశాడు! ఇంక ధైర్యంగా ఆమెని ప్రేమించగలడు. ఇంతకాలం తను అనుసరించిన ఫామిలీ ప్లానింగ్ విధానానికి గుడ్‌బై చెప్పి, అనూరాధకి బాబునీ, పాపనీ ఇవ్వగలడు, ధైర్యంగా!

దోపిడీ జరిగినరోజు అతనికి గుర్తొస్తోంది. పోలీసులు తనని ఆఘమేఘాలమీద హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. ట్రీట్

మెంటు అయ్యాక తన స్టేట్‌మెంటు రికార్డ్ చేశారు. మంచం మీద కూచుని తను చెప్తున్నంతసేపూ రిపోర్టర్ల ఫ్లాష్‌లు వెలుగుతూనే వున్నాయి.

ఎలాగో ఆ రాత్రి డాక్టర్లని వొప్పించి, తను బయట పడ్డాడు. రాత్రి పన్నెండు దాటాక నిటలాక్షరావు గూటికి రహస్యంగా వెళ్ళాడు. తను జేబులో పడేసుకున్న తాళం చెవి ఆ ఇంటిదే! లోపలికి ప్రవేశించి, పెన్‌టార్చి సహాయంతో గంటపాటు ఇల్లంతా గాలించాడు. వంటగది పక్కనున్న స్టోర్‌రూమ్‌ని నిటలాక్షరావు డార్క్‌రూమ్‌గా వాడుతున్నాడని తనకి అర్థమైంది.

ఆ గదిలోవున్న రెండు బీరువాల తాళాలు పగలేసి, అరగంటపాటు తను వెతుకుతూ వుండిపోయాడు. తన శ్రమ ఫలించింది! తన అనుమానం నిజమైంది! మరో సెట్ నెగటివ్‌లూ, ఫోటోలూ—తనవి—రెండో బీరువాలో రహస్యంగా అమర్చిన అరలో తనకి దొరికాయి! ఇంకా ఎందరివో ఫోటోలు—స్త్రీ పురుషుల్ని రకరకాల భంగిమల్లో చూపించే అశ్లీల ఛాయాచిత్రాలు నిటలాక్షరావు డార్క్‌రూమ్‌లో వున్నాయి!

బీరువాల్లోని కాగితాల్నీ, ఫైళ్ళనీ, ఫోటోల్నీ, నెగటివ్‌స్‌నీ—అన్నింటినీ కుప్పగా వేసుకూర్చుని, జాగ్రత్తగా కొంచెం కొంచెంగా దహనం చేసేశాడు తను. తనకి సంబంధించినవి మొదట బూడిద అయ్యాయి. తనకి తెలీకుండా ఇతర ఫోటోల్లో తనవి కలిసి వుండొచ్చన్న ఆలోచనతో తను అన్నింటినీ బూడిదగా మార్చేశాడు! ఏమీ ఎరగనివాడిలా తిరిగొచ్చాడు.

తను ఆ రోజే వెళ్ళడం మంచిదైంది. రెండోరోజు, నిటలాక్షరావు శవాన్ని పోలీసులు పోల్చారు; ఎవరి

సాయంత్రోనో. మూడోరోజు సుబోధ్‌కుమార్ ఇంటిని పోలీసులు దువ్వేశారు. బూడిదతప్ప ఇంకేం దొరకలేదు, వాళ్ళకి!

"ఏమి టాలోచిస్తున్నారు....?" అనూరాధ ప్రశ్నించింది.

ఉలిక్కిపడి గణపతి చిన్నగా నవ్వాడు. "నా సాహసానికి లభించిన బహుమతితో నీకు ఏ నగలు కొందామా అని ఆలోచిస్తున్నా!"

"నాకు నిజమైన విలువైన నగ మీరే!" అనూరాధ కంఠం వణికింది. "ఇంకెప్పుడూ ఇలా తెగించనని నాకు మాట ఇవ్వండి!"

గణపతి చేతులు ఆమె చుట్టూ బిగుసుకున్నాయి. అనూరాధ ప్రేమ రాయిని మనిషిగా మారుస్తుంది! ఆమెని సున్నితంగా ఎత్తుకుని, బెడ్‌రూమ్‌లోకి మోసుకుపోయాడతను....

23

మోహన్ బ్యాంకులోంచి ఇవతలికి నడిచాడు. 'రొటీన్ పెన్‌పుషింగ్'తో అతనికి తలనొప్పి వచ్చేసింది. నుదురుకు పట్టిన చెమటని రుమాలుతో అద్దుకుంటూ పేవ్‌మెంటుమీద నడవసాగేడు. ఇల్లు చేరేసరికి అరగంట పడుతుంది. పక్కనే వున్న డిస్కో టీస్టాల్‌లోకి దూరాడతను. స్ట్రాంగ్ టీ ఆర్డరిచ్చి, రెడ్‌విల్స్ సిగరెట్ వెలిగించాడు.

"ఉద్యోగం రాకపోయినా, ఆ రోజు బ్యాంకు దోపిడీ సమయంలో గాయపడున్నా బాగుండేదిరా. యాభై వేలు దక్కేది? ఎంచక్కా ఏదో వ్యాపారం ప్రారంభించి వుండొచ్చు!"

మోహన్ ఉలిక్కిపడి యెదురుగా చూశాడు. నలుగురు యువకులు టేబుల్ చుట్టూ కూచుని బిగ్గరగా నవ్వు తున్నారు.

"గాయమే అయ్యేదో, కాయమే మాయమయ్యేదో ఎవరికి తెలుసు! ఇలా బతకనీ బ్రదర్!" రెండో యువ కుడు నవ్వుతూ అన్నాడు.

"అదికాదు, వసంత్! అవాళ మనం గుంపుగా రావడం చేత ఆ గూండాగాడికి కారెక్కి ఉడాయించే అవకాశం లేకుండాపోయింది. బాంక్ మేనేజర్ హీరోలా దూసుకెళ్ళి వాణ్ణి కాల్చిపారేశాడు! నిజం చెప్పుకోవాలంటే మనం పరోక్షంగా అందుకు సాయపడ్డాం. మనకీ ఎంతో కొంత పారితోషికం రావాలి!" మరో యువకుడు నవ్వుతూ అన్నాడు. మోహన్ అప్రయత్నంగా వాళ్ళ మాటలు వింటున్నాడు.

వసంత్ అనబడే యువకుడు—మొదటిసారి మాట్లాడి నతను—చిన్నగా నవ్వి, సిగరెట్ వెలిగించాడు. "ఆ విషయం నాకు తెలీదుగానీ మనం మరో అయిదు నిమి షాలు ముందుగా వెళ్ళివుంటే, దోపిడీ జరిగే సమయానికి లోపల వుండేవాళ్ళం. గాయాల ఛాన్స్ తగిలి వుండే దేమో!"

మరో యువకుడు నవ్వాడు. "కరెక్టు! ఆ ఛాన్స్ తీసు కుని వుండొచ్చు; కానీ, నువ్వు సరిగ్గా పదీ పదకొండుకి గేటు ముందుకి వెళ్ళాలన్నావ్. అందుకే ఆలస్యమైంది; అమృతం విషమైంది.

వసంత్ అతన్ని విసుగ్గా చూశాడు. "నాకేం తెలుసు? అతను సరిగ్గా ఆ టైముకి గేటుముందు నినాదాలు చేస్తూ అడ్డంపడమన్నాడు. అదే సమయానికి తనిఖీ ఆఫీసర్లూ,

ఛెయిర్మన్ ఇవతలికి వస్తారన్నాడు. మన పని జరుగుతుం దన్నాడు!"

"వోకే, బ్రదర్. టికెట్స్ దొరకవ్. కమాన్!" అంటూ మరో యువకుడు లేచాడు. మోహన్ వాళ్ళనే చూస్తున్నాడు నలుగురూ నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

వాళ్ళ సంభాషణ మోహన్‌లో ఆలోచనల్ని రేపు తోంది. చల్లారిపోతున్న టీని తాగేసి. చిల్లరపడేసి అతను ఇవతలికి నడిచాడు. నలుగురు యువకులూ కొంచెం దూరంలో నడుస్తున్నారు. ఆనాలోచితంగా వాళ్ళని వెంబ డించాడతను. మలుపుతిరిగి వాళ్ళు నర్తకి థియేటర్ వేపు నడుస్తున్నారు. కాసేపట్లో మోహన్ 'నర్తకి' ముందు ఆగాడు. నలుగురూ టిక్కెట్లు కొని లోపలికి వెళ్ళి పోయారు.

మోహన్ నడవసాగేడు. దోపిడి జరిగినరోజు పాతిక మంది యువకులు ఏవో నినాదాలు చేస్తూ బ్యాంకు గేటుకి అడ్డంగా వచ్చారని తను పేపర్లలో చదివాడు. అదే రోజు, అదే టైముకి వాళ్ళని రమ్మని ఎవరో చెప్పారు. ఎవరు? ఎందుకు?

వాళ్ళు సమయానికి రావడంవల్ల గూండా చనిపోయా డని అనుకోవచ్చు. దోపిడీ చేసినవ్యక్తి చనిపోయాడుగానీ దోపిడీ అయిన పైకం దొరకలేదు! ఎవరో వ్యక్తి, బాంకుకి తనిఖీ అధికారులూ, ఛైర్మన్ వస్తారని వాళ్ళకి చెప్పాడు. కానీ ఆరోజు వాళ్ళెవరూ రాలేదు! దోపిడీ జరి గాక, వాళ్ళంతా ఆలస్యంగా బాంకుని తనిఖీచేసి, పోయిన మొత్తం లెక్కతెచ్చారు. ప్రాణాలర్పించినవాళ్ళకీ, గాయ పడినవాళ్ళకీ పారితోషికాలు ఏర్పాటుచేశారు!

యువకులతో ఎవరో ఎందుకు అబద్ధం చెప్పారు?

సరిగ్గా సమయానికి వాళ్ళని గేటుముందు హాజరుకమ్మని ఎందుకన్నాడు? దోపిడిదొంగల్ని అటకాయించడానికా? అందుకే అయితే, దోపిడీ జరుగుతుందని అతనికి ముందే తెలిసివుండాలి! తెలిసివుంటే, అటకాయించడానికి తగిన వాళ్ళని ఎందుకు అతను రమ్మనలేదు? కనీసం బ్యాంక్ మేనేజర్‌కి దోపిడీ గురించి ఎందుకు తెలియజేయలేదు? అలా జరిగివుంటే తన తండ్రి దారుణంగా హత్య చేయ బడేవాడు కాడు!

ఆలోచనల్తో గుమ్మంలో అడుగుపెట్టిన మోహన్ తటాలున ఆగాడు. అతని తల్లి సోఫావెనుక నిలబడింది. ఆమె మొహంలో విచారం, భయం ఉలితో చెక్కినట్లు కనిపిస్తున్నాయి. ఆమె ఎదురుగా సిల్కుజుబ్బాలో వున్న అపరిచిత వ్యక్తి కూచున్నాడు. ఇద్దరూ తననే చూస్తు న్నారు. మోహన్ లోపలికి నడిచాడు.

"బాబూ! ఈయన లక్ష్మీకాంతంగారు........మా అబ్బాయి...." అంది సావిత్రమ్మ. మోహన్ అతనికి నమస్కారం చేశాడు. తల్లి ముందున్న సోఫాలో కూచుని లక్ష్మీకాంతంగార్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

లక్ష్మీకాంతం రెండు బంగారుపళ్ళు చూపిస్తూ నవ్వాడు "అదే అమ్మగారితో చెప్పాను. గోవిందరావు గారు నాకు లక్షా పన్నెండువేల పైచిలుకు ఇవ్వాలి...."

మోహన్ అదిరిపడి, నమ్మలేనట్టు చూశాడు. అతని చూపులు తల్లివైపు తిరిగాయి. ఆమె మొహంలో విపరీత మైన బాధ వ్యక్తమవుతోంది. మోహన్ చూపులు తిప్పు కున్నాడు. "నేను....నమ్మలేకుండా వున్నాను...."

లక్ష్మీకాంతం చిన్నగా నవ్వాడు. "అమ్మగారు కూడా అదే అన్నారు. గోవిందరావుగారు మీకు చెప్పి వుంటా

రనుకున్నాను. పైగా, ఆయన గతించాక, అబద్ధాలాడేంత దుర్మార్గుడ్ని కాను. ఇంటి మీద ఆయన అప్పు ఎ తీసుకున్నారు...."

"అమ్మా, నాన్నకి అంత అవసరం ఏమొచ్చింది?" మోహన్ ప్రశ్నించాడు.

సావిత్రమ్మ పంటితో కింది పెదవిని కొరుక్కుంటూ నిస్సహాయంగా తల అడ్డంగా ఆడించింది.

"నేను....చెప్పగలననుకుంటాను...." లక్ష్మీకాంతం మెల్లగా అన్నాడు. మోహన్ అతన్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

లక్ష్మీకాంతం చిన్నగా దగ్గాడు. "చనిపోయినవాళ్ళని గురించి చెడ్డగా చెప్పకూడదంటారు....మీ నాన్నగారు రేస్‌హార్సెస్ మీదా, మట్కా మీదా డబ్బులు విపరీతంగా ఖర్చు చేశారు...."

"షటప్!" గద్దిస్తూ మోహన్ లేచి నిలబడ్డాడు. "గెటౌట్!"

లక్ష్మీకాంతం దెబ్బ తిన్నట్టు చూశాడు. "మీరు నన్ను అపార్థం చేసుకుంటారని నాకు తెలుసు. మీ నాన్నగారు నాతో స్నేహంగా వుండేవారు. ఆయనకి ఆ రెండు వ్యసనాలూ వుండేవి. ఆ పాడు అలవాట్లు మానుకొమ్మని చాలాసార్లు చెప్పాను. ఆల్‌రైట్....నిజం చెప్పి మీకు కోపం తెప్పించాను. అయామ్ సారీ. నాన్నగారి దుర్మరణం మూలంగా మీకు లక్ష వచ్చింది. మీరిస్తే, లక్షా తీసుకుని పైచిలుకు మరిచిపోయి, డాక్యుమెంట్ మీకు వాపసు చేస్తాను. లేదంటే...." వాక్యం పూర్తి చేయకుండా వదిలేశాడతను.

మోహన్ బలహీనంగా కూచున్నాడు. ఏ పత్రమో

ఆధారం లేకుండా లక్ష్మీకాంతం మాట్లాడడు. "ఆ పైకం మీరు ఎప్పుడిచ్చారు?" అడిగా డతను.

"పదేళ్ళుగా అప్పుడప్పుడూ ఇస్తూనే వున్నా. అప్పు పెద్ద మొత్తానికి ఎదిగినప్పుడు నాన్నగారు ఇల్లు తనఖా పెట్టారు."

"లక్ష్మీకాంతంగారూ, మీ అడ్రెసు ఇచ్చి వెళ్ళండి, వారం రోజుల్లో మిమ్మల్ని కలుసుకుంటాను" మోహన్ అన్నాడు.

అడ్రెస్ ఇచ్చి లక్ష్మీకాంతం వెళ్ళిపోయాడు. మోహన్ తల్లి వయిపు తిరిగాడు! ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"అమ్మా, అతను చెప్పింది నిజమేనా?" మోహన్ విచారంగా ప్రశ్నించాడు.

సావిత్రమ్మ నీరసంగా కదిలి సోఫాలో చతికిలబడింది. చీర చెంగుతో కళ్ళద్దుకుంది. "గుర్రప్పందాల పిచ్చి వుండేది. అంత విపరీతంగా వుందనీ, ఇంత పైకం తగ లేశారనీ నాకు తెలీదు...."

"ఇదంతా నాకెందుకు చెప్పలేదు?" మోహన్ కోపంగా అడిగాడు.

"ఇదంతా నీకు తెలీకూడదనే ఆయన, నిన్ను మామ గారింట్లో, వేరేచోట చదవేశారనుకుంటాను" అందామె డొంకతిరుగుడుగా.

"ఇప్పుడేం చేద్దాం?" మోహన్ మెల్లిగా అడిగాడు.

"నాన్నగారు పోతూ ఆ లక్షా సంపాయించారుగా! ఆయన చేసిన అప్పు తీర్చేయ్ నాన్నా ..." అందామె కళ్ళు తుడుచుకుంటూ.

మోహన్ అమ్మవయిపు నిదానించి చూశాడు. అవును. తను నాన్నని నిందించడానికి లేదు. అప్పుని తన

తలకు కట్టి వెళ్ళకుండా, సంపాయించి యిచ్చి వెళ్ళి పోయాడు బతికి చేసిన అప్పుని నాన్న మరణించి తీర్చేస్తున్నాడు.

నిట్టూరుస్తూ లేచి, మోహన్ బాత్‌రూమ్ వేపు నడిచాడు. కొడుకు వెళ్ళిన వయిపోసారి చూసి, గోడకి వేళ్ళాడుతున్న భర్త ఫోటోని కన్నీళ్ళతో చూసింది సావిత్రమ్మ.

*　　　　*　　　　*

మోహన్ హెడ్‌లైన్స్ చూసి, పేపర్ని తిరగేశాడు. పేజీ మధ్యలో 'తురుపు' శీర్షిక అతని దృష్టిని ఆకర్షించింది. అప్రయత్నంగా చదవడం ప్రారంభించాడు. వ్యంగ్యంగా వున్న వనమాలి రచన అతనికి నవ్వు తెప్పిస్తోంది. పూర్తిగా చదివేసి, పేజీ తిరగేయబోతూ చటుక్కున ఆగాడతను. అతని కళ్ళు సెటైర్ 'తురుపు' మీదే నిలిచాయి. కానీ అతని కళ్ళకి అక్షరాలు కనిపించడం లేదు.

బాంకు దోపిడీలు జరిగే సందర్భంలో చనిపోతే లక్ష రూపాయల నష్టపరిహారం, కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి ఉద్యోగం, ఉచిత విద్య, గాయపడితే యాభై వేల నష్టపరిహారం - ఇచ్చే ప్రభుత్వ ప్రతిపాదనని తెలివిగా ఉపయోగించుకుని తెలివిగా దోపిడీ ప్రయత్నం యేర్పాటు చేసి, గాయపడి యాభై వేల నష్టపరిహారం కొట్టేయడానికి ప్రయత్నించి ఫెయిలయ్యే ఒక బ్యాంకు ఉద్యోగి గురించి వ్యంగ్యంగా రాసిన స్కెచ్ అది. అడ్డదారి తొక్కి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్‌సెన్‌టివ్‌ని తురుపులా వాడుకునే తప్పుడు ప్రయత్నం మీద వ్యంగ్య చిత్రణ అది!

మోహన్ మెదడులో మెరుపులా ఏదో మెరిసింది.

అతని చేతుల్లోంచి పేపర్ కిందికి జారి పడింది. స్కెచ్ రచయిత వనమాలి తమాషాగా ఊహించి రాసిన విధంగా తన తండ్రిని బలి తీసుకున్న బ్యాంక్ దోపిడీ రూపొందించ బడిందా? కథలో దోపిడీ జరగదు. జరిగించే ప్రయత్నం మాత్రం జరిగింది. ఇక్కడ నిజంగా దోపిడీ జరిగింది. డబ్బు పోయింది. రెండు ప్రాణాలు పోయాయి. ఇద్దరు కుటుంబ సభ్యులకి ఉద్యోగాలూ, పారితోషికా లొచ్చాయి.

"బాబూ, కాఫీ ఇంద...."

తల్లి కంఠం విని మోహన్ ఆలోచనల్లోంచి కిందికి దిగాడు. యాంత్రికంగా కాఫీకప్పు అందుకున్నాడు. తల్లిని తదేకంగా చూశాడు.

"అమ్మా.... చనిపోయే ముందు ... నాన్న యెలా ప్రవర్తించాడు?"

సావిత్రమ్మ అర్థం కానట్టు చూసింది. మోహన్ ఆమె కళ్ళల్లోకి చూశాడు. "త్వరలో తనకి డబ్బు రాబోతోం దన్న భావాన్ని నాన్న వ్యక్తం చేశాడా?" ప్రశ్నించా డతను.

"ఎందుకలా అడుగుతున్నావు నాయనా?" సావిత్రమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

"నాన్నలాంటి తెలివయిన పెద్దవాళ్ళకి ముందుగా జరగబోయేవి చూచాయగా తెలుస్తూంటాయమ్మా!" మోహన్ నవ్వుతూ అన్నాడు. తల్లితో అబద్ధమాడాల్సి వచ్చినందుకు లోపల్లోపల విచారించాడతను.

ఆమె చిన్నగా నవ్వింది. "అదంతా నాకు తెలీదయ్యా! కానీ నాన్నగారితో, ఆయన ప్రవర్తనతో పాతికేళ్ళ అను భవం నాది. ఏదయినా డబ్బు వచ్చేముందే, తను అను కున్నది జరిగేముందూ ఆయన కులాసాగా అవుపించేవారు.

సాధారణంగా ఆర్థిక ఇబ్బందులతో వుండే ఆయనలో ఇలాంటి తృప్తికరమైన మార్పుని తరచుగా చూశాను. ఈమధ్య కూడా ఆయనలో 'ఇంకేం, కష్టాలు గట్టెక్కుతాయి!' అన్న ధోరణి చూచాయగా అవుపించింది."

"నిజంగా?" మోహన్ నివ్వెరపోతూ అన్నాడు.

"నువ్వలా అంటే, నాకూ నిజమేననిపిస్తోందిరా! తనకి త్వరలో ఏదో లాభం చేకూరుతుందని నాన్నగారికి అంతర్గతంగా తెలిసినట్టుంది! మరో విషయం కూడా నేను గమనించాను. ఈమధ్య ఆయన అన్యమనస్కంగా ఏదో లోకంలో వుండేవారు. పలకరిస్తే వులిక్కిపడేవారు. ఆ సమయంలో ఆయన కళ్ళల్లో ఏదో భయం లాంటిది కనిపించేది. తనకి అపాయం సంభవిస్తుందనీ, ఆదాయం వస్తుందనీ ఆయనకి లోపల్లోపల అనిపిస్తూ వుండి వుండాలి. దాన్నే వేదాంతాలు మూడో కన్ను అంటే-ఫాల నేత్రం అన్నారు!" సావిత్రమ్మ ఉద్వేగంతో అంది. భర్త అంతశ్శక్తికి గర్విస్తూన్న ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మోహన్ కంగారుగా చూశాడు. తల్లి కంగారు పడుతుందని బలవంతాన చిరునవ్వు నవ్వాడు. ఫాలనేత్రం! తను తమాషాకి అన్నమాటని అమ్మ నిజంగా నమ్మేసింది.

"అమ్మా, అన్నం పెట్టెయ్. ఆకలవుతోంది," అన్నాడతను విషయం మారుస్తూ.

24

అతనికోసం ఎదురుచూస్తూ మోహన్ పేవ్‌మెంట్ మీదున్న చెట్టుకి జార్లాబడి నించున్నాడు.

తను అనవసరంగా సందేహాల్లో చిక్కుకు పోతున్నాడనిపిస్తూందతనికి. అందరూ దాదాపుగా మరిచిపోతున్న

విషయాన్ని, తనకి పరోక్షంగా మేలుచేసిన విషయాన్ని నిర్విరామంగా తలలో కెలుకుతున్నాడు! ఏదో, ఎందుకో తనని శాంతిమయంగా వుండనివ్వట్లేదు. తనలోంచీ ఏదో, దేన్నో అదృశ్య పదార్థాన్ని చూస్తూంది; మసగ్గా అవుపించే ఆ పదార్థాన్ని స్పష్టంగా చూడ్డానికి ప్రయత్నిస్తూంది. మూడోకన్నా? ఫాలనేత్రమా? నవ్వుకుంటూ అతను సిగరెట్ పీకని గిరాటేశాడు.

మోహన్ కళ్ళు మెరిశాయి. అతను పేవ్‌మెంటమ్మట నడిచి వస్తున్నాడు.

మోహన్ అతన్ని సమీపించాడు.

"మిస్టర్ వసంత్ ...."

అతను మోహన్‌ని ఆశ్చర్యంగా చూశాడు. అతని కళ్ళు ప్రశ్నల్ని రువ్వుతున్నాయి. "మీరు ....?"

"నే నెవరో మీకు తెలీదు. నాలుగు రోజులుగా మీతో మాట్లాడాలనుకుంటున్నా ...." మోహన్ నవ్వుతూ అన్నాడు.

వసంత్ కళ్ళు చిట్లించాడు. "ఏ విషయం గురించి?"

"చెప్తాను. వాళ్ళంతా వేడెక్కిపోయింది. ఏసీలో కూచుని ఐస్‌క్రీమ్ తింటూ మాట్లాడుకుందాం ." అన్నాడు మోహన్ పక్కనేవున్న హోటల్ ఎస్కిమోను చూపిస్తూ.

వసంత్ తటపటాయించాడు. "మిస్టర్ వసంత్, నేను ఈ వూరివాణ్నే ...."

"మీ పేరు?"

"మోహన్‌కుమార్."

"ఏం చేస్తున్నారు?" వసంత్ ప్రశ్నించాడు.

"అన్నీ చెప్తాను. లోపల కూచుందాం!" అంటూ

మోహన్ వసంత్ చేతిని చొరవగా పట్టుకుని, అతని కళ్ళలోకి నవ్వుతూ చూశాడు. వసంత్ కదిలాడు. కాసే పట్లో ఇద్దరూ హోటల్లో ఏసీ రూమ్‌లో కూచున్నారు. రూమ్‌లో తామిద్దరు తప్ప మరెవరూ లేనందుకు సంతో షిస్తూ మోహన్ ఐస్‌క్రీమ్ ఆర్డరిచ్చాడు. వసంత్ అతన్ని కళ్ళతో ప్రశ్నిస్తున్నాడు.

"మిస్టర్ వసంత్, నాలుగురోజుల క్రితం టీస్టాల్‌లో మీరూ, మీ మిత్రులూ మాట్లాడుకుంటుంటే విన్నాను."

వసంత్ అర్థంకానట్టు చూశాడు.

"మీరూ, మీ మిత్రబృందం ఒకటో తారీఖున ఏవో నినాదాలుచేస్తూ బ్యాంక్ ముందుకి వెళ్ళారు...."

"మీరెవరు?" వసంత్ అడ్డొస్తూ అడిగాడు.

"బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నా. ఆ రోజు దోపిడీలో మరణించిన గోవిందరావుగారు మా నాన్నగారు...."

వసంత్ కనుబొమలు పైకి లేచాయి. "ఓహో....మీ నాన్నగారు పోయాక మీకు ఉద్యోగం, లక్ష రూపాయలూ వచ్చాయి! కదూ?"

"అవును."

"మీరు అదృష్టవంతులు!" వసంత్ నవ్వుతూ అన్నాడు.

"మిస్టర్ వసంత్, తండ్రి హత్యచేయబడటం అదృష్టం కాదు!" మోహన్ మెల్లిగా అన్నాడు.

"ఓహ్....అయామ్ సారీ...." వసంత్ సిగ్గుపడుతూ అన్నాడు. సర్వర్ ఐస్‌క్రీమ్స్ పెట్టి వెళ్ళిపోయాడు.

"ఆరోజు నినాదాలతో ప్రదర్శన ఇమ్మని మీకు ఎవరో చెప్పారు. ఆ వ్యక్తి ఎవరు?" మోహన్ ప్రశ్నించాడు.

"ఎందుకు?" వసంత్ అనుమానిస్తూ అడిగాడు.

మోహన్ నిట్టూర్చాడు "అతనితో నాకు పనుంది...."

వసంత్ విచారంగా చూశాడు. "ఇవాళ మీరు నన్ను కల్సుకున్నట్టే, ఆరోజు ఆ వ్యక్తి నన్ను హోటల్లో కల్సుకున్నాడు. తరవాత మళ్ళీ అతను నాకు కనిపించలేదు."

"అతను ఎలా వుంటాడు?"

"పైజమా జుబ్బా వేసుకున్నాడు. గెడ్డం బాగా మాసింది. నల్లకళ్ళద్దాలు ధరించాడతను. ముక్కు కొస మీద కుంకుడుకాయ సైజులో పులిపిరికాయ వుంది...."

"అతను మారువేషంలో వున్నట్టు మీకు అనుమానం వేసిందా?" మోహన్ అడ్డుతగిలాడు.

వసంత్ ఆశ్చర్యంగా చూశాడు. "అప్పట్లో అనిపించ లేదు. ఈమధ్య అతను కనిపించకపోయేసరికి నాకూ అనుమానం వేస్తూంది...."

"అతనేం చెప్పాడు?" మోహన్ ప్రశ్నించాడు.

"మాలాంటి యువకులకి ఉద్యోగాలు కల్పించని ప్రభుత్వాన్ని ఎడాపెడా తిట్టాడు. యువకులు ధైర్యంగా తిరగబడాలనీ, తమకి కావల్సింది లాక్కోవాలనీ అన్నాడు. ఒకటో తారీఖున బ్యాంక్ ఇన్స్పెక్షన్ జరుగుతుందనీ, ఛెయిర్మన్ వగైరా సీనియర్స్ వస్తారనీ, నిరుద్యోగులందరికీ సెక్యూరిటీ అడక్కుండా అప్పులు ఇవ్వాలని గొడవ చేయమనీ అతను ఆవేశంతో చెప్పాడు. పాతికమంది వుంటే చాలన్నాడు. యువకుల్ని సమీకరించడం కష్టమన్నాను. అతను రెండు వంద రూపాయల నోట్లు ఇచ్చాడు. ఖర్చులకి ఉంచుకొమ్మన్నాడు. ప్రదర్శనవల్ల మాకు లాభం జరుగుతుందన్నాడు. తరవాత కూడా మరో రెండువందలు ఇస్తానన్నాడు....యువకులు నిరుద్యోగులుగా వుండటం దేశానికి మంచిదికాదన్నాడు. నిజమే

అనిపించింది. ప్రదర్శన జరిపాం....”

“అతను ఎవరో మీరు అడగలేదా?”

“అడిగాను. అతను చెప్పలేదు. యువకులలో చైతన్యాన్ని పెంపొందించడమే తన ఆశయం అన్నాడు. ప్రదర్శన జరిగాక, పరిచయం పెంచుకుందాం అన్నాడు!”

ఇద్దరూ ఐస్‌క్రీమ్ తినడం ప్రారంభించారు. మోహన్ తలెత్తి వసంత్‌వైపు సూటిగా చూశాడు.

“మిస్టర్ వసంత్, కళ్ళద్దాలూ, గెడ్డం తీసేస్తే అతన్ని మీరు పోల్చగలరా?”

“పోల్చలేననుకుంటా....” వసంత్ అనుమానిస్తూ అన్నాడు. మోహన్ అతనికి సిగరెట్ ఇచ్చి తనొకటి వెలిగించాడు.

“ఒకవేళ అది ఆ వ్యక్తి అసలు రూపమే అయితే, అతన్ని మీరు పోల్చగలరు. అతను మీకు ఎక్కడేనా తారసిల్లొచ్చు. నాకు వెంటనే తెలియజేస్తారా?” మోహన్ ప్రశ్నించాడు.

“ఓ యస్!” వసంత్ నవ్వుతూ అన్నాడు.

ఏదో ఆలోచన తట్టి మోహన్ జేబులోంచి ఫోటో తీశాడు. “ఈ ఫోటోలోని వ్యక్తి అతను అయ్యుండొచ్చా?”

వసంత్ ఫోటోని కాసేపు పరిశీలనగా చూశాడు. అతని తల అడ్డంగా ఊగింది. “గెడ్డం మీసాలూ, పులిపిరి కాయా, కళ్ళద్దాలూ—ఇవన్నీ తగిలించినా కూడా ఇతను అతను కాలేడు!”

“థాంక్యూ,” అంటూ మోహన్ తన తండ్రి ఫోటోను జేబులో పడేసుకున్నాడు. వసంత్ అతన్ని చిరునవ్వుతో చూశాడు.

"అతనికి ఇంత వయసు కాలేదు. ఆరోగ్యంగా, బలంగా దృఢంగా వున్నాడతను...." వసంత్ మెల్లిగా అన్నాడు.

మోహన్ జేబులోంచీ పర్స్ తీశాడు. "వసంత్; నెలరోజుల క్రితందాకా నేనూ మీలాగే, నిరుద్యోగి యువకుణ్ణి. మీద్వారా ప్రదర్శన జరిపిన వ్యక్తి నాకు కావాలి. అతను కనిపిస్తే ఈ నంబర్‌కి ఫోన్ చెయ్యండి." అంటూ ఒక కాగితాన్ని అతనికి అందించాడు. పర్స్‌లోంచీ రెండు వందరూపాయ నోట్లు తీసి, వసంత్‌వేపు చాపాడు. వసంత్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు.

"మిస్టర్ వసంత్, అపార్థం చేసుకోకండి. అతన్ని నాకు చూపించే ప్రయత్నం చేయండి. నాకు డబ్బొచ్చిందని మీకు తెలుసు. ఇది ఖర్చులకి ఉంచుకోండి...."

వసంత్ తటపటాయించాడు. మోహన్ చిన్నగా నవ్వాడు.

"కమాన్, తీసుకోండి. అయితే నేను మిమ్మల్నికల్సికున్నట్టు, ఎవ్వరికీ—మీ మిత్రులకు కూడా చెప్పకండి."

వసంత్ నోట్లు అందుకున్నాడు. చిన్నగా నవ్వాడు. "మీకు ఉపయోగపడగలననే నమ్మకంతో తీసుకుంటున్నా. అప్లికేషన్స్ పెట్టి, ఇంటర్వ్యూలకి వెళ్ళడంతోనే ఉన్నది కాస్త ఊడ్చుకుపోయింది...."

"అయామ్ సారీ....తీసుకోండి. ఇదంతా రహస్యంగా...." మోహన్ అడ్డొస్తూ అన్నాడు.

"ఎవ్వరికీ చెప్పను. చెప్తే, ఇందులో ఫ్రెండ్సందరికీ వాటాలు పంచాలి!" వసంత్ నవ్వుతూ అన్నాడు. మోహన్ పకపక నవ్వాడు. (ఇంకా వుంది)

గోవిందరావు-కథా!

జొన్నలగడ్డ రామలక్ష్మి



నేనొక నిరుద్యోగిని. ఉద్యోగం కోసం ఏడాదినుంచి కాళ్ళరిగేలా తిరుగుతున్నాను.

నాకో అన్నయ్యున్నాడు. దూరప్రాంతాల ఉంటున్నాడు. తనకు వచ్చే జీతంలోంచి అతి కష్టంమీద ఓ వందరూపా

యలు నాన్నకు పంపిస్తున్నాడు.

నాకో చెల్లెలుంది. ఇంటర్మీడియేట్ చదువుతోంది. అది చాలా అందంగా ఉంటుంది. దానికి ఎన్నికైన సంబంధం చూసి పెళ్ళిచేయాలని నాన్న ఆశ. అందుకోసం చాలా కష్టపడి డబ్బు పోగుచేస్తున్నాడు. తను జబ్బుపడ్డా డాక్టరు దగ్గరకు వెళ్ళకుండా, తనకు ప్రాణంమీదకు వచ్చే అవసరం కలిగినా వాడకుండా ఆయన వేరే పదివేలు పోగేశాడు. ఆ డబ్బు కేవలం చెల్లెలి పెళ్ళికోసం!

ఒకళ్ళిద్దరు నన్ను అయిదేసివేలు ధరావతు కడితే ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. నాన్న నాతో — "నిన్ను బియ్యేదాకా చదివించాను. నా యింట్లో ఉన్నంతకాలం తిండిపెడతాను. నీ ఉద్యోగానికి నావల్ల పైసా సాయం కూడా లభించదు. నీ బ్రతుకేదో నీది—" అని ఖచ్చితంగా చెప్పేశాడు. కానీ బయటకు అప్లికేషన్సు పెట్టాలంటే డబ్బిస్తాడు పాపం. నా తిండిఖర్చేకాక నిత్యం ఉతికిన బట్టలు వేసుకునేందుకు, షేవింగ్ వగైరాలకు—ఇంట్లో లోటులేదు.

ఆ కారణంగా బయటకు వెడితే చూసేవాళ్ళకు నేను చాలా దర్జాగా కనబడతాను. అదే నా ప్రాణాలమీదకు తెస్తుందని నే నూహించలేదు.

ఒకరోజున బజార్లో కనబడ్డాడో యువకుడు. అతడికి పద్దెనిమిదేళ్ళుంటాయేమో—అంతే!

మాసిన బట్టలు కట్టుకున్నాడు. అతడి కళ్ళలో పుట్టెడు దిగులు....

"నమస్కారం!" అన్నాడతడు.

ఎవరా అన్నట్లు చూశాను.

"నన్ను గోవిందరావంటారండి—అందరూ గోవిందా

అని పిలుస్తారు. మీరూ అలాగే పిలవచ్చు...." అన్నా డతడు చనువుగా.

"నాకు నిన్ను పిలవాల్సిన అవసరమేమిటి?" అన్నా నాశ్చర్యంగా.

"నన్ను పిలిస్తే పుణ్యం, పురుషార్థమూ—" అన్నా డతడు.

నేను చిరాగ్గా చూశానతడివంక. పరిచయం లేనివారితో నేను చనువుగా ఉండను. పరిచయం లేనివారు నాతో చనువుగా ఉంటే చిరాకు.

అతడు వెంటనే "సార్—అసలు విషయం చెప్పే స్తాను. మా అమ్మ, నాన్న యాక్సిడెంటుకు గురై హాస్పి టల్లో ఉన్నారు. ఇద్దరూ ప్రమాదస్థితిలో ఉన్నారు. ఆపరే షన్ చేయకపోతే వాళ్ళు బ్రతకడం కష్టంట. డాక్టరేమో ఆపరేషనుకి వెయ్యిరూపాయలు కావాలంటున్నాడు...." అన్నాడు.

ఇదేదో అడుక్కునే బాపతని అర్థమయింది నాకు. అందుకే ఆలోచించకుండా "అయితే నేనేం చేయను?" అన్నాను.

"మీరేం చేయక్కర్లేదు సార్! నాకు డబ్బుకాదు కావలసింది—మీ సాయం....చాలా చిన్న సాయం...." అన్నాడు గోవిందరావు.

"హాస్పిటల్లో డాక్టర్లెవరూ నాకు తెలియదు..."

"డాక్టర్లెవరూ మాటవిని సాయం చెయ్యరుసార్. వాళ్ళకు డబ్బుకావాలి...." అన్నాడు గోవిందరావు.

అయితే నేనేం చేయాలి?"

"నా కథ పూర్తిగా వింటే నా బాధ అర్థమవుతుంది సార్...."

నేనూ ఖాళీగానే ఉన్నాను కాబట్టి అతడి కథ విన సాగాను.

గోవిందరావు చాలా పేద కుటుంబంలో పుట్టాడు. తలి దండ్రుల కతడు తొమ్మిదో సంతానం. అతణ్ణి తలి దండ్రులు విశ్వనాథం దంపతులకు దత్తత యిచ్చారు. విశ్వనాథం దంపతులకు పెళ్ళై పదేళ్ళయినా సంతానం లేదు. గోవిందరావును పెంచుకుని ఏడాది తిరక్కుండానే వాళ్ళకో కొడుకుపుట్టాడు. ఆ తర్వాత మరో అయిదేళ్ళలో మరో ముగ్గురు పిల్లలు కలిగారు. గోవిందరావు పాదం మంచిదని అంతా మెచ్చుకున్నారు. కానీ గోవిందరావుకు కష్టాలారంభమయ్యాయి.

అయిదేళ్ళ వయసులో వాడా యింట ప్రవేశించాడు. పదేళ్ళ వయసొచ్చేసరికి వాడికా యింట్లో అంతా పరాయి వాళ్ళైపోయారు. పెంపుడుతల్లి వాడిని నానా మాటలూ అనేది. కొట్టేది. వాడేం చేసినా తప్పుపట్టేది.

గోవిందరావు దీనికి తట్టుకోలేక కన్న తలిదండ్రుల దగ్గరికి పారిపోయాడు. వాళ్ళతణ్ణి తరిమికొట్టారు.

"మా బ్రతుకే మాకు నరకంలా ఉంది. ఇక్కడున్నా నీకు చాకిరీ తప్పదు. చీవాట్లు తప్పవు. దెబ్బలు తప్పవు. అక్కడైతే నీకు కడుపునిండా తిండి ఉంటుంది. ఇక్కడదీ ఉండదు. వెళ్ళు....అక్కడికే పో...." అన్నాడు తండ్రి.

అంటే గోవిందరావా యింట్లో పనివాడిలా బ్రతకాలి. తిండికోసం ఆత్మాభిమానం చంపుకుని అక్కడుండాలి.

గోవిందరావు బాగా ఆలోచించి తిండికోసమే అయితే వాళ్ళింట్లోనే ఎందుకు పనిచేయాలో అనుకుని ఇంట్లోంచి బైటకు వచ్చేశాడు.

అప్పుడు వాడుపడ్డ కష్టా లన్నీ యిన్నీ కాదు.

మూటలు మోశాడు. కప్పులు కడిగాడు. రాళ్ళు కొట్టాడు.

ఎంత కష్టపడ్డా ఎక్కడా వాడికి గౌరవం లభించలేదు. కడుపునిండా తిండి దొరకలేదు.

ఈలోగా ఓ గూండా వాడిని పట్టుకున్నాడు. వాడు గోవిందరావు సంపాదనలో వాటా అడిగాడు.

"నేను నీకెందుకు డబ్బులివ్వాలి?" అన్నాడు గోవింద రావు.

"నీకెవ్వరూ లేరుగా—నేను నీకు పెద్దన్నను...." అన్నాడా గూండా.

"నాకెవ్వరూ వద్దు ఒక్కణ్నే ఉంటాను...."

"ఉంటానంటే కుదరదు. నీకు నా రక్షణ అవసరం" అన్నాడా గూండా.

"ఎందుకు?"

"నువ్వింకా బాగా కుర్రాడివి. ఎవరైనా నీ కాళ్ళూ, చేతులూ విరిచేసో, కళ్ళు పొడిచేసో నిన్ను బిచ్చగాణ్ణి చేయవచ్చు. అప్పుడు నువ్వు పూర్తిగా వేరొకరిమీద ఆధారపడాల్సొంటుంది...."

గోవిందరావు హడలిపోయాడు.

"అన్నా - నన్ను రక్షించు...." అన్నాడు.

"రక్షిస్తాను — డబ్బులివ్వు మరి...." అన్నాడు గూండా.

గోవిందరావు గూండాకు డబ్బులివ్వసాగాడు. కొన్నాళ్ళు గడిచేక గూండా గోవిందరావుతో—"ఒరేయ్ నువ్విచ్చే డబ్బులు నాకు చాలడంలేదు. కనీసం రోజుకి పదిరూపాయ లైనా ఇస్తే తప్ప నిన్ను రక్షించలేనేమో!" అన్నాడు.

"నా సంపాదనే రోజుకి పదిరూపాయలు లేదు. నీకెక్కణ్ణించి తెచ్చిచ్చేది?" అన్నాడు గోవిందరావు.

"జేబులు కట్ చేయకూడదూ - రోజుకి ఒకోసారి వెయ్యి రూపాయలు కూడా దొరకొచ్చు...." అన్నాడు గూండా.

"నేను దొంగతనాలు చేయను . ." అన్నాను.

"జేబు దొంగతనమంటే నేరమేం కాదు. కష్టమూ కాదు... " అంటూ గూండా వాడిని ప్రోత్సహించాడు.

గోవిందరావుకు భయంవేసింది. తను పతనం కావాలని ఇంట్లోంచి బైటకురాలేదు. గొప్పవాడు కావాలనుకున్నాడు. గౌరవంగా బ్రతకాలనుకున్నాడు.

ఇప్పుడు దొంగతనాలకు దిగితే నలుగురూ ఏమనుకుంటారు?

విశ్వనాధం మంచిపనే చేశాడు - ఓ దొంగ వెధవ నింట్లోంచి గెంటేశాడు - అనుకుంటారు.

లేనివాళ్ళవి లేకి బుద్ధులు - అనుకుంటారు.

గోవిందరావు మనసు దొంగతనం వైపుకూడా లాగుతోంది. ఈ ప్రపంచంలో గొప్పవాళ్ళందరూ ఏదోవిధంగా సాటివాణ్ణి దోచి డబ్బు సంపాదిస్తున్నారని అంతా అంటారు. మంచిగా ఉండేవాళ్ళు సామాన్యులుగా మిగిలి పోతున్నారు.

ఒక రోజు గోవిందరావు దొంగతనానికి సిద్ధపడ్డాడు. ఆ సమయంలో అతణ్ని పోలీసులు పట్టుకున్నారు.

విధం చెడ్డా ఫలం దక్కలేదని గోవిందరావు బాధ పడ్డాడు.

"అయినా ఇంకా దొంగతనం చేయకుండానే చేయబోతున్నట్లు పోలీసులెలా గుర్తించారా?" అని అతడి

కాశ్చర్యం కూడా కలిగింది. తనేమో పోలీసులకు తెలిసిన దొంగ కాదు. తన్ను వాళ్లెలా అనుమానించారో?

పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టరతడి వంక తీక్షణంగా చూసి - "నువ్విల్లు వదిలి ఎందుకు పారిపోయావ్? నీ పెంపుడు తండ్రి ఫిర్యాదు చేశాడు" అన్నాడు.

అప్పుడు గోవిందరావుకు కలిగిన ఆశ్చర్య మింతా అంతా కాదు.

పెంపుడు తండ్రి విశ్వనాథం అతడి కోసం అన్వేషిస్తున్నాడు. ఎందుకో?

ఆ ప్రశ్నకు సమాధానం తొందరగానే లభించింది.

నాలుగు రోజుల క్రితం ఓ స్కూలుబస్సుకు యాక్సిడెంటయింది. అందులో విశ్వనాథం పిల్లలు నలుగురూ వున్నారు. వాళ్ళకు బాగా గాయాలయ్యాయి.

గోవిందరావు నలక్ష్యం చేయడంవల్లనే పిల్లలు ప్రమాదానికి గురయినట్లు చాలామంది భావించారు.

విశ్వనాథం వెంటనే గోవిందరావుకయి అన్వేషణ ప్రారంభించాడు. ఆయన నలుగురికీ చెప్పకున్నదేమంటే- ఇంత కాలం గోవిందరావు తలిదండ్రుల దగ్గర ఉన్నాడనుకుంటున్నానని!

గోవిందరావు విశ్వనాథం ఇంట్లో ప్రవేశించాడు మళ్ళీ.

"ఎందుకు పారిపోయావురా?" అంది పెంపుడు తల్లి.

గోవిందరావు బయటి ప్రపంచాన్ని చూశాడు. అయిన వాళ్ళు లేనివాళ్ళ కక్కడ రక్షణ లేదు. వాడిక విశ్వనాథం ఇల్లు పదలకూడదనుకున్నాడు. వాడి పెంపుడు తలిదండ్రులు కూడా వాడి నిప్పుడు బాగా చూసుకుంటున్నారు.

గోవిందరావు ప్రయివేట్‌గా మెట్రిక్ కట్టి పాస

య్యాడు. ఇంటర్మీడియేట్‌లో చేరి అదీ పాసయ్యాడు. తర్వాత చదువుకోవాలని లేదనీ - ఏదైనా వ్యాపారం చేస్తాననీ అన్నాడు.

"వ్యాపారం చేయాలంటే రెండు ముఖ్యసూత్రాలు తెలుసుకోవాలి. ఒకటి - అందులోని మెలకువలు నేర్చుకోవడం. రెండు పెట్టుబడిగా ఒకరి ధనం కాక స్వంత డబ్బునే వాడడం. అప్పుడే పెట్టుబడి విలువ తెలుస్తుంది" అన్నాడు విశ్వనాథం. ఆయన గోవిందరావునో పెద్ద డిపార్టుమెంటల్ స్టోర్‌లో పనికి కుదిర్చాడు. గోవిందరావక్కడే పని చేస్తూ వ్యాపారంలో మెలకువలు నేర్చుకుంటున్నాడు.

ఇలా ఉండగా అక్కడ విశ్వనాథానికేదో తెలియని జబ్బుచేసి మంచాన పడ్డాడు, ఆ స్థితిలో వ్యవహారాలు చూడ్డానికాయన బావమరిది కుటుంబంతో సహా వచ్చి అక్కడే మకాం పెట్టాడు. విశ్వనాథం కుటుంబానికి కష్టాలు ప్రారంభమయ్యాయి. అక్కగారిని మంచి మాటలతో మోసం చేస్తున్నాడు విశ్వనాథం బావమరిది. తమ్ముడు గదా అని విశ్వనాథం భార్య అతణ్ణి నమ్మింది.

విశ్వనాథం భార్య మోసపోతోందని గోవిందరావు గ్రహించాడు. తనే ఆ విషయం ఆమెకు చెప్పాలనుకున్నాడు. అయితే విశ్వనాథం బావమరిది గోవిందరావుకంటే తెలివయినవాడు. అతడు తను కాజేసే డబ్బును - గోవిందరావు కాజేసినట్లుగా విశ్వనాథం భార్యలో అనుమానం రేకెత్తించాడు.

క్రమంగా విశ్వనాథం బావమరిది ఎత్తు ఫలించింది. విశ్వనాథం భార్య గోవిందరావు నేమీ అనలేకపోయేది కానీ అతణ్ని దగ్గరకు రానిచ్చేది కాదు. అతడి మాటలు

వినేది కాదు.

ఈలోగా విశ్వనాథం బావమరిది ఇంకో పెద్ద పథకం వేశాడు. ఫలితంగా ఒక రోజున డిపార్టుమెంటల్ స్టోర్‌లో దొంగతనం చేసినట్లు అతడి మీద తప్పుడు నేరం ఆపాదించబడింది. ఉద్యోగం ఊడింది.

గోవిందరావు తలెత్తుకోలేకపోయాడు.

తప్పు చేసినట్లు అతడి మీద నేరం ఆపాదించబడింది కాబట్టి - ఇంట్లో అంతా అతణ్ని చిన్నచూపు చూడడమే కాక సూటీపోటీ మాటలనసాగారు. గోవిందరావు అన్నీ సహించాడు. విశ్వనాథానికి ఆరోగ్యం చేకూరితే మళ్ళీ అన్నీ చక్కబడతాయని అతడి ఆశ. కానీ విశ్వనాథం బావమరిది విశ్వనాథానికి సరయిన వైద్యం చేయించడం లేదు. విశ్వనాథం పూర్తి అసహాయ దశలో వున్నాడు.

ఇలాంటి సమయంలో విశ్వనాథం దంపతులకు ఆక్సిడెంటయింది. ఇద్దరూ హాస్పిటల్లో ఉన్నారు. విశ్వనాథం బావమరిది వాళ్ళను గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పుడు భారమంతా దేవుడి మీదే వుంది.

విశ్వనాథం దంపతులు చనిపోతే - విశ్వనాథం బావమరిది వాళ్ళ ఆస్తిని మొత్తం గుటకాయస్వాహా చేసి విశ్వనాథం పిల్లలను కష్టాలకు గురి చేస్తాడు. విశ్వనాథం బ్రతకాలంటే వెయ్యి రూపాయలు కావాలి.

"ఎంతో ఆస్తి ఉండీ - వెయ్యి రూపాయల కోసం విశ్వనాథం దిక్కులేని చావు చచ్చేలా వున్నాడు. ఆయన నాకు కన్నతండ్రి కాకపోయినా - నాలో కృతజ్ఞత ఉంది. నేను ఈనాడీ మాత్రంగానయినా ఉంటే అందుకాయనే కారణం. ఆయన్ను నేనెలాగైనా బ్రతికించుకోవాలి" అన్నాడు గోవిందరావు.

"అందుకు నేనేం సాయం చేస్తాను?" అన్నాను.

"చాలా సింపుల్ సార్! మనిద్దరం అప్పలస్వామి కిళ్ళీకొట్టు దగ్గరకు వెడదాం! అక్కడ నేను అప్పలస్వామిని పిలుస్తాను. మీరేమో అతడు చూస్తూండగా మీ పర్సు నాకిచ్చి - ఇది అమ్మగారి కివ్వడం మరిచిపోయాను. నువ్వింటికెళ్ళి ఇచ్చేసొచ్చేయ్ అనండి. నేనా పర్సు తీసుకుని వెళ్ళిపోతాను. అప్పుడు అప్పలస్వామి ఆశ్చర్యపోతాడు. నా నమ్మకాన్ని గురించి అతడివద్ద పొగడండి. సందు చివర మిమ్మల్ని నేను కలుసుకుంటాను ..." అన్నాడు గోవిందరావు.

"ఒకవేళ పర్సు తీసుకుని గోవిందరావు వెళ్ళిపోతే?" ఈ సందేహం నా మనసులో కలిగింది. కానీ పైకి అనడానికి మొహమాటపడ్డాను. గోవిందరావు చూడ్డానికి చాలా పెద్దమనిషి తరహాగా ఉన్నాడు. మర్యాదస్థుడిలా కనబడుతున్నాడు.

గోవిందరావు నా మనసులో భావం చదివినట్లున్నాడు. "సార్! మనం హాస్పిటల్‌కి ఫోన్‌చేసి కనుక్కుదాం. విశ్వనాధంగారి పరిస్థితెలాగుందోనని నా మనసు తల్లడిల్లిపోతోంది...." అన్నాడు గోవిందరావు.

ఇందులో నా క్కలిగే నష్టమేం లేదు కదా అని వెంటనే అంగీకరించాను.

ఇద్దరం పక్కనేవున్న హోటల్లోకి వెళ్ళాం. గోవిందరావే డబ్బిచ్చి ఏదో నెంబరు తిప్పాడు—"గవర్నమెంటు హాస్పిటలేనా?" అన్నాడు. అవతల్నించి సమాధానం వచ్చిందో ఏమో—ఫోన్ నాకిచ్చి—"సార్! నాకు సరిగా వినబడ్డంలేదు. విశ్వనాధంగారి గురించి తమరే అడగండి" అన్నాడు.

రిసీవర్ అందుకున్నాను. అవతల్నించి ఎవరో—
"హలో - జనరల్ హాస్పిటల్ ....జనరల్ హాస్పిటల్ ...."
అంటున్నారు.

నేను విశ్వనాధం పరిస్థితిని గురించి అడిగాను.

"అలాగే ఉంది. ఆపరేషన్ చేయాలి. అయినవాళ్ళెవరూ పూనుకోవడంలేదు. సాయంత్రం దాటితే ప్రమాదం కూడా ...." అందవతలి గొంతు.

నేను గోవిందరావుకి విషయం చెప్పాను.

గోవిందరావు కళ్ళు తుడుచుకుని-"నాన్నా! సాయంత్రంలోగా నీ కోసం వెయ్యిరూపాయలు పోగుచేసే బాధ్యత నాది ...." అన్నాడు.

ఫోన్లో అవతల క్లిక్‌మన్న శబ్దము వినిపించడంవల్ల నేను రిసీవర్ పెట్టేశాను.

ఇద్దరం హోటల్లోంచి బయటకు వచ్చాం.

"సార్—మనమిప్పుడు వెంటనే అప్పలస్వామి కిళ్ళీకొట్టు దగ్గిరకు వెడదాం—" అన్నాడు గోవిందరావు.

"అందువల్ల ప్రయోజనం?"

"అప్పలస్వామి కిళ్ళీకొట్టుమీద బాగా సంపాదిస్తున్నాడు సార్! వాడు నాకు వెయ్యిరూపాయలు అప్పుగా ఇస్తానన్నాడు. నాకుద్యోగం కూడా ఇప్పిస్తాడు. నెల నెలా జీతంలోంచి రెండు వందలు విరగ్గోసుకునే ఏర్పాటు చేస్తాడు. నా ఉద్యోగానికి చదువక్కర్లేదు. నమ్మకం కావాలి. డిపార్టుమెంటల్ స్టోర్లో నామీద దొంగతనం నేరం మోపబడినట్లు అప్పలస్వామికి తెలుసు. ఆ నేరం అన్యాయంగా నామీద మోపబడిందని వాడికి చెప్పాను. నమ్మడం లేదు. మీరు నాకు పర్సిస్తే నేను మారిపోయినట్లు అప్పలస్వామి గ్రహిస్తాడు ...."

"నేనెవరో అప్పలస్వామికి తెలియదుగా—నువ్వు ముందుగా చెప్పి ఏర్పాటు చేసుకున్నావని ఊహించలేదా?" అన్నాను.

"అప్పలస్వామికి మీరు తెలియకపోవడమేమిటి?" అన్నా డతడు.

"అప్పలస్వామి అనే పేరు నేనెప్పుడూ వినలేదు...." అన్నాడు.

"అదేంటి బాబూ—అప్పలస్వామి అస్తమానూ మీ గురించి నాకు చెబుతూంటాడూ!" అన్నాడు గోవింద రావు.

"అసలు నేనెవరో నీకెలా తెలుసు!" అన్నానను మానంగా.

"మీరెవరో నాకేం తెలుసు బాబూ? చాలాసార్లు మిమ్మల్ని అప్పలస్వామి కొట్టువద్ద చూశాను. ఎవరని అడిగితే కిళ్ళీకొట్టు పెట్టుకునేందుకు మీ నాన్నగారు తనకు చాలా సాయం చేశారని చెప్పాడు. మీరేమో దానగుణంలో తండ్రిని మించిన కొడుకన్నాడు. మీ వినయవిధేయతల గురించి ఎంతో మెచ్చుకున్నాడు...."

నాకు తెలిసి ఏ కిళ్ళీకొట్టువాడితోనూ నాకు పరిచయం లేదు. అప్పలస్వామి పేరుగల వాళ్ళెవరితోనూ పరిచయ మున్న గుర్తులేదు. అదే గోవిందరావుకు చెప్పాను.

"అరే—చాలా ఆశ్చర్యంగా ఉందే....అయితే మీకు సునీతమ్మగారు కూడా తెలియదా?" అన్నాడు గోవింద రావు.

"సునీత ఎవరు?"

"పక్కవీధిలో ఉంది వాళ్ళిల్లు. మీరు, సునీ తమ్మ కలిసి తిరగడం చాలాసార్లు చూశాను. ఆమెకు

నేను చాలాసార్లు బజారుకు సాయంగా వెళ్లాను. మీ గురించడిగితే మీ రిద్దరూ ప్రేమించుకున్నట్లు చెప్పింది—....”

“నీ మాటలు వింటూంటే నువ్వు మోసగాడివని చాలా అనుమానం కలుగుతోంది. నా కే సునీతా తెలియదు—” అన్నాను.

“నన్ను నిర్లక్ష్యం చేసినా, అగౌరవపర్చినా—నా పెంపుడు తండ్రి ఆపదలో ఉన్నాడని అప్పలస్వామివంటి దుష్టుడి దగ్గిర అప్పు తీసుకుని ఆయన్ను కాపాడాలనుకుంటున్న నన్ను మీరు మోసగాడని అనుమానించారు. సరే మిమ్మల్ని సాయమడగడం నా పొరపాటు. కానీ మీరు పొరపాటుపడ్డారని నేను రుజువు చేయాలి. రండి.... పక్క వీధిలో సునీతమ్మ ఇంటికి వెడదాం. ఆమె మిమ్మల్ని గుర్తుపట్టకపోతే—మీరు నాతో అప్పలస్వామి కిళ్ళీకొట్టుదగ్గరకు రానవసరంలేదు....” అన్నాడు గోవిందరావు.

ఇదేదో తమాషాగా ఉందనిపించింది.

ఇద్దరం పక్కవీధిలోకి వెళ్లాం. గోవిందరావు నన్నో ఇంటి ఆవరణలో తీసుకుని వెళ్ళాడు. అక్కడ నుంచి పూలతోట వుంది. తోటలో ఓ అమ్మాయి పూలు కోసుకుంటోంది.

“సునీతమ్మా—ఎవరొచ్చారో చూడు....” అన్నాడు గోవిందరావు.

ఆ అమ్మాయి వెనక్కు తిరిగి నన్ను చూసి—“అరే! రాజూ నువ్వా? ఎన్నడూ లేనిది మా యింటి ఆవరణలో అడుగుపెట్టావేమిటి?” అంటూ ఒక్క ఉదుటున నన్ను సమీపించి బలంగా కౌగలించుకుంది.

ఒక్క-క్షణం నాకు ప్రపంచం తెలియలేదు. ఆమె చాలా అందంగానూ, ఆకర్షణీయంగానూ ఉంది. చనువుతో కూడిన ఆమె బిగికౌగిలి ఒక్కసారి నన్నే లోకాలకో తీసుకుని వెళ్ళిపోయింది. విడిపించుకోవాలని కూడా నాకు తోచలేదు.

ఆమె నన్ను తనే వదిలిపెట్టి—"ఏమిటీ—మాట్లాడవు? రెండురోజుల్నించి కనిపించడంలేదు. నా మీద కోపం వచ్చిందా? నీ కోసం నెహ్రూపార్కులో చూశాను-తెలుసా?" అంది.

నేను తమాయించుకుని—"నా పేరు రాజు కాదు. మిమ్మల్ని చూడడం ఇదే మొదటిసారి—" అన్నాను.

"నువ్వు రాజువి కాదూ?...." అందామె ఆశ్చర్యంగా.

"కాదు. మీ రంటున్న ఆ రాజెవరో నాకు తెలియదు...."

ఆమెకు నా మాటలమీద నమ్మకం కుదరడానికి కాసేపు పట్టింది. అప్పుడామె ఎంతో సిగ్గుపడి-"అచ్చం రాజులాగే ఉంటే పొరబడ్డాను. నన్ను మన్నించండి" అంది.

ఆమె సిగ్గుకూడా ఎంతో అందంగా ఉంది. ఆమె నాకిచ్చిన అపురూపమైన కానుకకు - నేను రాజును కాలేకపోయినందుకు బాధగా ఉంది. నేనామెను మన్నించాలా?

"అయినా గోవిందరావేడీ? నాతో ఇలా ఆడుకోవడం తప్పని తెలియదూ?" అందామె.

నేను వెనక్కి తిరిగి చూశాను. గోవిందరావు లేడక్కడ.

"రాజును చూస్తే నాకు వళ్ళు తెలియదు. గోవింద

రావు సిగ్గుతో పారిపోయేుంటాడు...." అంటూ సిగ్గు పడిందామె.

"సెలవు...." అంటూ అక్కణ్నించి కదిలాను.

"మరెప్పుడైనా మాయింటికి రండి. మిమ్మల్ని మా బావకు చూపిస్తాను....వచ్చే నెలలోనే మాపెళ్ళి...." అని ...."బావంటే రాజు. మీరు నిజంగా రాజు కాదు కదా!" అందామె.

"నమ్మకం కుదరకపోతే మా యింటికి రండి...." అన్నాను నవ్వుతూ.

"లేదు లెండి – బావ మాటకూ మీ మాటకూ కొద్దిగా తేడా ఉంది. అదీకాక పెళ్ళయ్యేదాకా ఈయింట్లో అడుగు పెట్టనని బావ ప్రతిజ్ఞ పట్టాడు. అందుకే మీరొస్తే ఆశ్చర్య పోయాను...." అందామె.

జరిగిన అనుభూతి నన్నింకా వదలడంలేదు. అందుకే నా వళ్ళింకా జల్లుమంటోంది. ఆమెను కూడా ఆ అనుభూతి వదలనంటోందేమో—ఆమె కళ్ళలోని సిగ్గులు తొలగిపోవడం లేదు.

ఆమెను విడిచి వెళ్ళాలంటే కష్టమనిపించింది. అతి కష్టంమీద ఆ యింటి ఆవరణలోంచి బైటపడ్డాను. ఆ తర్వాత ఎటు నడుస్తున్నానో నాకు తెలియలేదు కాసేపు. తెలిసేక గోవిందరావు గుర్తుకొచ్చాడు. ఆ వెంటనే....

కిళ్ళీకొట్టు అప్పలస్వామి ... పర్సు....

పాపం—అతడు నిజమే చెప్పాడు. అతడికి నేను పర్సునిచ్చి సాయపడాల్సింది. ఇంతమందికి తెలిసిన ఆ వ్యక్తి నన్ను మోసం చేస్తాడా అనుకుంటూ అప్రయత్నంగా జేబులో చేయిపెట్టి ఉలిక్కిపడ్డాను.

జేబులో పర్సులేదు, ఏమయింది?

ఒక్క ఉదుటున వెనక్కుతిరిగి మళ్ళీ ఆ యింటికి వెళ్ళాను. తోటలో సునీత కనబడలేదు నాకు. పర్సుగానీ అక్కడ పడిందేమోనని వెతికాను. కనపడలేదు.

ఒకవేళ పర్సు పడిపోతే ఆమె తర్వాత చూసి ఇంట్లో దాచిందేమోనన్న ఉద్దేశ్యంతో తోటలోంచి ఇంటి గుమ్మం దగ్గరకు వెళ్ళాను. అందుకు కొన్ని మెట్లెక్కి పక్కకు తిరగాల్సి వచ్చింది.

అప్పుడు నేను చూశాను - ఇంటికి పెద్ద తాళం!

అప్పటి కప్పుడు యింటికి తాళమెలా పడింది?

నేను జాప్యం చేయలేదు. చుట్టుపక్కల వాకబు చేశాను. ఆ యింట్లోవాళ్ళు రెండ్రోజులుగా ఊళ్ళో లేరు. ఇంకో నాలుగురోజులదాకా రారు. ఆ యింటాయనకు ముగ్గురు కొడుకులు. అందరూ పెద్దవాళ్ళు. ఆ యింట్లో పెళ్ళికాని ఆడపిల్లలు లేరుట.

అంటే నేను మోసపోయానా?

నా పర్సుకోసం గోవిందరావు, సునీత కలిసి ఇంత పెద్ద నాటకమాడారా?

ఎందుకో ఇదంతా పర్సుకోసం నాటకమంటే నమ్మ శక్యంగాలేదు. అందుకే నేను ఆ వెంటనే ఉమాపతి ఇంటికి వెళ్లాను.

ఉమాపతి రచయిత. నాకంటే పదేళ్ళు పెద్దవాడు. మానవ మన స్తత్వాన్ని కాచి వడపోస్తాడు. అందువల్ల నేమో ఆలోచనల్లో అతడు నా కంటే పాతికేళ్ళు పెద్ద.

జరిగినదంతా ఉమాపతికి చెప్పుకుని...."ఇదేమిటంటావ్? నేను మోసపోయానా?" అనడిగాడు.

"నువ్వు మోసపోయావు. గోవిందరావు నీపై రక

రకాల ప్రయోగాలు చేశాడు. ముందతడు నీనుంచి జాలి గాథ ద్వారా చందా రాబట్టాలనుకున్నాడు. అది కుదరదని తెలియగానే అప్పలస్వామి కథ చెప్పాడు. అదీ నమ్మ వని తెలిసేక సునీత మంత్రం వేశాడు. సునీత పూలు కోసుకుందుకన్నట్లుగా ఆ యింటి పూలతోటలో చేరి నీకోసం వేచి ఉంది. నువ్వాఖరి మంత్రంలో పడిపో యావు. నువ్వు సునీత కౌగిలిమైకంలో ఉండగా— గోవిందరావు నీ పర్సు కాజేసి పారిపోయాడు. నలుగు రిలో జేబు కొట్టడంకంటె ఈ పద్ధతి చాలా మంచిది. ఇందులో సేఫ్టీ ఎక్కువ...." అన్నాడు ఉమాపతి.

"తల్చుకుంటే బాధగా ఉంది. పోయిన డబ్బు పది రూపాయలే! కానీ పర్సు ఖరీదు పాతికదాకా ఉంటుంది." అన్నాను.

"నీవేషం డాబు చూసి నీదగ్గరింకా ఎక్కువ డబ్బుం టుందనుకుని ఇంత కష్టపడి ఉంటాడు. నువ్వు గోవింద రావు కథ వినగానే జాలిపడి - జేబులోంచి కొంత డబ్బు తీసి—ఇది దగ్గిరుంచుకో—మిగతా డబ్బు మరెవరినుం చైనా అడిగి తీసుకో—అంటావని ఆశించాడు. అలా జరుగలేదు. ఈ నేరస్థుల్లో ఓ హిప్నాటిక్ పవర్ ఉంటుంది. ఎంత పెద్దకథ చెబితే అంత బాగా హిప్న టైజు చేయగలరువాళ్ళు. కథ పెద్దదైనకొద్దీ నీలో అతడి పట్ల ఏకాగ్రత పెరుగుతుందన్నమాట....ఏది ఏమైనా నీ వదృష్టవంతుడివి....పదిరూపాయల ఖర్చుతో ఓ అంద మైన అమ్మాయి కౌగిలి సంపాదించావు...." అన్నాడు ఉమాపతి.

"నే నిప్పు డమ్మాయిల కౌగిలికోసం తపించిపోవడం లేదు. ఉద్యోగం వచ్చేదాకా ఇలాంటి పది రూపాయలు

నాకెంతో విలువైనవి....'' అన్నాను బాధగా.

ఉమాపతి వెంటనే నవ్వి - "అమ్మాయిల కౌగిలికోసం తపించిపోవడంవల్లనే కదా—నువ్వు పర్సు పోగొట్టు కున్నావు" - అన్నాడు. అనేసి ఊరుకోకుండా నన్ను కాసేపాట పట్టించాడు.

"ఏది ఏమైనా దొంగలు తెలివిమీరి పోతున్నారు. కొత్త కొత్త పంథాలు తొక్కుతున్నారు-" అన్నాను బాధగా.

ఉమాపతి నన్ను చూసి నవ్వుతున్నాడు.

నే నక్కణ్నించి ఉక్రోషంగా బయటపడుతూ- "నీకూ ఇలాంటనుభవం అయితే అప్పుడు తెలుస్తుంది—" అన్నాను.

"నేను నీకులా తెలివి తక్కువవాణ్ని కాదు ..."

"నాకు సింపతీ చూపిస్తావని కథ చెబితే నన్ను పరిహాసం చేస్తావా? నాకా గోవిందరావు మళ్ళీ కనబడితే నిన్నూ ఓ పట్టుపట్టమని ప్రోత్సహిస్తాను. అప్పుడు చూస్తాను నీ తెలివి...."

"నా తెలివి చూడాలంటే నీకు గోవిందరావు కనబడ నవసరంలేదు. సరిగ్గా రెండు నెలల తర్వాత కనిపించు" అన్నా డుమాపతి.

అప్పుడు నేనా విషయం మర్చిపోవాలనుకున్నాను. కానీ రెండు నెలల తర్వాత ఉమాపతి నాకోసం కబు రెట్టాడు.

వెంటనే వెళ్ళాను.

"గోవిందరావు గుర్తున్నాడా నీకు?" అన్నాడుమాపతి.

"నేను మర్చిపోవాలనుకున్న వ్యక్తిని మళ్ళీ గుర్తు చేస్తావా?" అన్నాను బాధగా.

"నువ్వు మర్చిపోవాలనుకోలేదు. కనబడితే అతణ్ని నాపై ప్రయోగించాలనుకున్నావు. మర్చిపోయావా? ఇప్పుడు నేను నీకు గోవిందరావు కనబడే ఉపాయం చెబుతాను...."

"ఏమిటది?"

"ఈ పుస్తకం చూడు-" అంటూ ఓ పుస్తకాన్ని నా కందించాడు ఉమాపతి.

నే నా పుస్తకం చూసి ఉలిక్కిపడ్డాను. అందులో ఉమాపతి వ్రాసిన కథ ఉంది. ఆ కథ నాకూ గోవింద రావుకూ మధ్య జరిగిన అనుభవం.

"ఇది కథగా రాశావా? ఎందుకు?"

"ఎందుకేమిటి? అదే నా తెలివి. గోవిందరావు, సునీత కలిసి తెలివిగా కథలల్లి ప్రజల్ని మోసం చేస్తున్నారు. వాళ్ళ మోసం గురించి పదిమందికీ తెలియబర్చి హెచ్చరించడం కోసమే ఈ కథ! గోవిందరావువంటి వాళ్ళ ఆట కట్టించడం కోసమే ఈ కథ...."

"అయితే?"

"నీ తెలివి నిన్ను మోసం చేసింది. నా తెలివి పదిమందిని హెచ్చరించడానికి పనికొస్తుంది...." అని నవ్వాడు ఉమాపతి.

"మరి గోవిందరావుని చూపిస్తానన్నావ్?" అన్నాను.

"గోవిందరావుని చూడాలంటే రేపట్నించి రోజూ ఈ పత్రికా కార్యాలయానికి వెళ్ళి సంపాదకుణ్ని కలుసుకో.. అక్కడికేదో ఒక రోజున గోవిందరావు తప్పకుండా వస్తాడు...."

"ఎందుకు?"

"ఒకటి—తన పథకం అందరికీ తెలిసిపోయిందన్న బాధ...."

"పథకంతోపాటు తనూ బైట పడాలనుకోడు కదా!"

"అనుకోడు....కానీ...." అని ఆగి—"ఇంత పెద్ద పథకంలో అతడు నీనుంచి సాధించినది పది రూపాయల క్యాషూ, పాతిక రూపాయలు విలువచేసే పర్సునూ....అదే పథకంనుంచి నేను సంపాదించినది...." అని మళ్ళీ ఆగాడు ఉమాపతి.

"ఏమిటి నువ్వు చెప్పేది?"

"ఈ కథకు నాకు వచ్చిన పారితోషికమెంతో తెలుసుకుందుకు గోవిందరావు సంపాదకుణ్ని కలుసుకుంటాడు. ఏ శ్రమా లేకుండా అతడికంటె పన్నెండున్నర రెట్లు లాభం పొందానని తెలుసుకుని కుమిలిపోతాడు. అతడిదాకా ఎందుకు? నీ నష్టం నాకు లాభం తెచ్చిపెట్టిందని నీకేడుపుగా లేదూ?" అన్నాడుమాపతి.

నిజమే! నాకు పది రూపాయలు పోయిందని బాధపడి ఆ కథ చెబితే—దాంతో నూట పాతిక రూపాయలు లాభం కొట్టాడుమాపతి.

ఈ ప్రపంచంలో ఒకో విశేషం కొందరికి లాభాలనూ, కొందరికి నష్టాలనూ కలిగిస్తుంది. కానీ అన్ని విశేషాలనూ తమ లాభానికే ఉపయోగించుకోగలవారొక్క రచయితలే ఏమో!

నేను చటుక్కున ఉమాపతికి దణ్ణంపెట్టి—"గురూ! నాక్కూడా కథ లెలా రాయాలో నేర్పు...." అన్నాను.

"నీవంటి వాళ్ళు లేనిదే కథలు నాకెక్కణ్ణించి వస్తాయి నేర్పడానికి?" అన్నా డుమాపతి నవ్వుతూ. □

గాళ్ళలోని గువ్వపిట్టలు

కె.వి. యస్. యన్. మూర్తి

"ఇదిగో! అబ్బీ! ఒక సారిటురా!"

రంగడు అతడిని పరిశీలనగా చూశాడు ఇస్త్రీ బట్టల్లో పెద్దమనిషిలానే వున్నాడు. పైగా మోటారు సైకిల్ మీద వచ్చాడు.

రంగడు నెమ్మదిగా అతడి ప్రక్కకు వచ్చాడు. వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"నీ పేరేంటి?" సిగిరెట్ పొగను విలాసంగా వదులుతూ

అడిగా దతడు.

"రంగదంటారండి!"

"నువ్వేం చేస్తోవుంటావు?"

"కేరియర్లు మోస్తా ఉంటానండి."

"నీ దీ ప్రాంతమేనా?"

"అయ్! ఈడ యిదివరకు మా పాకలుండేవండి. అటిని తీసేసి గవర్నమెంటోళ్ళు ఈ పక్కా యిళ్ళు కట్టించి యిచ్చారండి."

అతడు మరో సిగిరెట్ తీసి వెలిగించాడు. రంగడికో సిగిరెట్ అందించాడు. అంత ఖరీదయిన సిగిరెట్ చేతిలో పడటంతో రంగడికి అతనిమీద ఒక రకమయిన గౌరవం బయలుదేరింది.

"ఇక్కడేమయినా యిళ్ళు అద్దెకు దొరుకుతాయా!"

రంగడీసారతడిని విచిత్రంగా చూశాడు. "ఏమిటి ఈ పెద్దమనిషి తమ మధ్య అద్దెకుంటాడా?"...... "అయ్! లేవండి....అయినా తవరిలాటోళ్ళ...."

అతడు తమాషాగా తలెగరేశాడు. "నాకు కాదులే మా ఫ్రెండొకడికి కావాలి... " అన్నాడు.

"లేవండి."

"అదికాదోయ్! ప్రయత్నించి చూడకూడదూ?"

"దొరకవండి."

అతడు జేబులోంచి వందకాగితం తీసి రంగడి చేతిలో పెట్టాడు.

"అయి బాబోయ్! యిదేటండి?" అన్నాడు రంగడు. దాన్నందుకొంటూనే.

"దాని సంగతటుంచి నేను చెప్పేది విను—"

"అయ్!"

"మీకు కష్టంలేకుండా డబ్బొచ్చే మార్గం చెబుతాను....
వింటావా?"

రంగడు హుషారుగా ముందుకు వంగాడు.

"మీరుంటున్న ప్రతి యింటి వెనుక ఖాళీ జాగా లున్నాయి కదా?"

"ఉన్నాయండి."

"నేను ప్రతీ యింటికి వెయ్యిరూపాయలిస్తాను. ఇంటి వెనక నున్న ఖాళీ జాగాల్లో పాకలేసుకోండి. ముందు బిల్డింగ్‌ను మాకు అద్దెకివ్వండి. నెలకు నూట ఏభై రూపాయలు అద్దెయిస్తాం. అయిదు సంవత్సరాలకు కాగితాలు రాసుకుందాం. పైగా మేం ప్రతి యింటికి కుళాయికూడా పెట్టించుకుంటాం."

రంగడికి ఎగిరి గంతేయ్యాలనిపించింది. కానీ అంత లోనే చిన్న అనుమానం పొడచూపింది. "ఏం ఫరవా లేదు గందా?"

అతడి కళ్ళు విచిత్రంగా మెరిశాయి. 'గురుడు గాలంలో యిరుక్కున్నాడు' మూడో సిగరెట్ వెగించి "ఏం యిబ్బంది లేదు. నీకు తెలిసినవాళ్ళచేతే కాయితాలు రాయిద్దాం" అన్నాడు.

"మిగతావాళ్ళ గురించి నాకు తెలియదుగానండి, నేను రడీ అండి" అన్నాడు.

కానీ రంగడికి తెలియని విషయం మరోటుంది. "అప్పటికే చాలామంది రంగళ్ళు ఆ పెద్దమనిషి గాలం ముల్లుకు తగుల్కొన్నారని...."

"సరే! నేను రేపు వుదయం వస్తాను. రాత్రికి నువ్వు మీ వాళ్ళతో సంప్రదించు. పాక వెయ్యటానికి కావలసిన కలప గట్రా రేపు లారీల మీద యిక్కడకు వస్తాయి.

మీరు నేనిచ్చిన డబ్బుతో కలపకొని పనులు మొదలు పెట్టొచ్చు" అని సమాధానం కోసం చూడకుండా మోటార్ బైక్ స్టార్ట్ చేశాడు.

2

"ఏమిటండీ వాళ్ళు మాత్రం మనుషులు కాదా? వాళ్ళకి కుళాయిలు లేకపోతే ఎలా?" దాదాపుగా అరిచాడు సీతా రామయ్య.

మేయర్ అతని వయిపు అదోలా చూశాడు. "ఎందు కయ్యా! అలా అరుస్తావు? వీకర్ సెక్షన్సుకు యిచ్చిన కాలనీలలో, మన కార్పొరేషన్ కొళాయిలు వున్నాయి. దానికి తోడు బోరింగులు కూడా వేయించాం" అన్నాడు.

"అయితే మన తెలుగింటి ఆడబడుచులు అలా వీధి కుళాయిల దగ్గర బారులు తీరి నుంచోక తప్పదంటారు. అందులోను అవన్నీ శ్రామిక వాడలు. ఆడా మగా వళ్ళు వంచి పనిచేస్తేగాని వాళ్ళకి రోజు గడవదు. మనం వదిలి నప్పుడు నీళ్ళు పట్టుకోవటానికి అక్కడి ఆడబడుచులకు అవకాశం వుండదు."

"అయితే ఏమిటంటావ్?" మేయర్ కంఠంలో విసుగు కనపడింది.

"ఏమంటానికేముంది! ప్రతీ యింటికి వాటర్ కనెక్షన్ యివ్వండి."

"నాన్సెన్స్. అది జరిగే పనేనా! ఇన్నాళ్ళ నుండి నీకు మన కార్పరేషన్ గురించి తెలుసు రూల్సు, రెగ్యులేషన్సూ...అన్నింటికీ మించి అవకాశం" ఇంకా ఏదో చెప్పబోతోన్నాడు మేయర్.

సీతారామయ్య అతని మాటలకు అడ్డొచ్చాడు. "ఏమి టండీ రూల్సూ వల్లకాడునూ....ముందు వాళ్ళకు కనక్షన్స

యిచ్చి తీరాల్సిందే!" అన్నాడు.

మేయరతన్ని చిరాగ్గా చూసి "కుదరదు!" అన్నాడు.

"కుదరదా? ఎందుకు కుదరదో చూస్తాను. రేపీపాటికి మన ఆఫీసు ముందు నిరాహార దీక్షలూ....అవీ...." అంటూ ఆవేశంగా లేచాడు సీతారామయ్య.

మేయర్ ఈ సారి నీళ్ళు నమిలాడు. ఆయనకు సీతారామయ్య సంగతి బాగా తెలుసు. ఎలా రభస చెయ్యాలో ఎలా అన్‌పాపుల్యలర్ చెయ్యాలో....ఎలా అలగా జనాన్ని తన వెంట తిప్పుకోవాలో....అన్నీ బాగా తెలుసు. అందుకే ఈ గొడవను తెగేదాకా లాగదలచుకోలేదాయన.

"మరీ అలా ఆవేశపడిపోతే ఎలా? కూర్చో!" అన్నాడు అనునయంగా.

సీతారామయ్య వంకరగా నవ్వాడు. "నేను మీ అందరికీ పనికిరానివాడిలా కనిపిస్తోన్నానండీ!" అన్నాడు.

"ఛ! అలాగని ఎవరన్నారయ్యా! ముందు కూర్చో" ప్రతిమాలాడు మేయర్.

"మరి లేకపోతే ఏమిటండీ? నేనేమయినా మా దొడ్లో నుయ్యి తవ్వించమన్నానా? పాయిఖానా కట్టమన్నానా? బడుగు వర్గాలకు కొంచెం మేలు చెయ్యమన్నాను."

మేయరు మాట్లాడలేదు.

"అయ్యా! ఎవరికో చేస్తే ఏముందండీ? వాళ్ళకి చిన్న ఉపకారం చెయ్యండి జీవితాంతం మీరు గుర్తుండిపోతారు. మళ్ళీసారి మీరు వాళ్ళ దగ్గరకు వెళ్ళనవసరం లేదు. మీరు నుంచోపోయినా, బ్యాలెట్ మీద మీ పేరు రాసి మరీ బాక్సులో వేస్తారు." ఈసారి సీతారామయ్యకు మేయరు ఆయువుపట్టు దొరికింది.

మేయరు కుర్చీలో సర్దుకొన్నాడు. "అయినా ప్రయి

వేట్ కనక్షన్స్ ఎలా యిస్తామా?" అని అన్నాడు.

"ఓస్ దానికేనా!" అంటూ సీతారామయ్య జేబులోంచి తెల్లకాగితాలు తీసి బల్లమీద వుంచాడు. "అయ్యా! ఇవన్నీ అప్లికేషన్‌లు, డబ్బు కూడా కూడబెడతాను. మనం చెయ్యాల్సిందల్లా బయటవాళ్ళకన్నా వీళ్ళమీద కొంచెం కనికారం చూపటం" అన్నాడు.

మేయరు పూర్తిగా మెత్తబడిపోయాడు.

"అయ్యా! యిక ఆలోచించకండి. ఇంకో మార్గం చెబుతాను. రెండేసి యిళ్ళకు కలిపి ఒక్కో కనక్షన్ యిచ్చి రెండు యిళ్ళకూ గొట్టాలు లాగితే సరిపోతుంది" అన్నాడు.

"సరే చూద్దాం."

"అదుగదుగో ఆ ఎర్రతేపే వద్దు! ముందు మీరు పనులు పురమాయించండి. నేను డబ్బు ఏర్పాటుచేస్తాను" అన్నాడు.

"అయినా ఆ కాలనీలు నీ వార్డులోవి కాదు కదా? నీ కెందుకు బాధ?" అన్నాడు మేయరు.

"ప్రజాసేవండి బాబు, దీన జనోద్ధరణ!" అన్నాడు సీతారామయ్య. అతడికి అందిన పయికం అతనిచేత ఎలాంటి చిలక పలుకులనయినా పలికిస్తుంది.

మేయర్ అలవోకగా నవ్వాడు.

మరు నిముషం వాటర్‌వర్క్స్ డిపార్టుమెంటుకు కబు రెళ్ళింది.

చకచకా పనులు మొదలయి పోయాయి.

అధికార యంత్రాంగం అంతా ఆ పనిమీదే వుండి పోయింది.

3

"అబ్బ వెధవ్వూరు! ఎక్కడా కొంప దొరికి చావ లేదు" చెప్పులు వదలి వుసూరుమంటూ కుర్చీలో కూల బడ్డాడు రమణారావు.

"ఏమయిందిరా?" అడిగాడు శాస్త్రి.

"ఏమయేదేముంది? దరిద్రపు టౌనుకు ట్రాన్సఫర్ అయ్యాను."

"టౌన్ కాదు గురూ సిటీ!" సవరించాడు శాస్త్రి.

"అదే! ఏదో వల్లకాడు."

"అదేంటి గురూ, మరీ అంత నిస్పృహగా మాట్లాడు తున్నావు?"

"మరేం చెయ్యను చెప్పు. వూరంతా చెప్పులరిగేలా తిరిగినా ఒక్క కొంపయినా దొరికి చావలేదు. రెండు రోజుల్లో కాపురం పెట్టకపోతే మీ వదిన సింగిలా మీద పడిపోతుంది."

శాస్త్రి అతడికి ధైర్యం చెప్పాడు. అప్పటి కప్పుడు యిద్దరూ కలసి బయటకు వచ్చారు. ఇళ్ళ వేటలో పడ్డారు.

సాయంత్రం అయిదు గంటలయింది. ఒక్క పోర్షనూ వారి కంట పడలేదు. రెండు మూడు ఖాళీలున్నాయి గానీ బాత్రూముంటే లేవటరీ లేదు, రెండోదుంటే మొదటిది లేదు. ఈ రెండూ వుంటే కొళాయి లేదు. చిన్న కొట్టు గదికి కూడా అద్దె నాలుగొందలు.

రమణరావుకు గుండె బేజారెత్తి పోయింది.

ఒక ఓనరయితే ఇంట్లో దిగితేనే యిల్లు చూపిస్తా నన్నాడు.

"మాకు నచ్చుతుందో, లేదో!" అన్నాడు శాస్త్రి.

"మీ రెంత మంది?"

"భార్యా, భర్తా, యిద్దరు పిల్లలూ!"

"అయితే నచ్చుతుంది రండి" అంటో లోపలకు తీసుకొని వెళ్ళి పోర్షన్ చూపించాడతడు.

చిన్న గదీ. వంటిల్లు, వసారా! చీకటి గూళ్యం. పది పోర్షన్‌లకు కలపి రెండు బాత్రూములు, రెండు నాటు పాయిఖానాలూ, కామన్ కొళాయి. నాలుగొందలు అద్దె. అయిదు వేలు అడ్వాన్సు.

"మాకు నచ్చలేదండీ!" అన్నాడు శాస్త్రి.

అంతే! ఆయన ఒంటి కాలిమీద లేచిపోయాడు. "నేను ముందే చెప్పాను. దిగుతానంటేనే చూడండని."

శాస్త్రికి అతని ఆర్గ్యుమెంటులో పాయింటు కనిపించ లేదు. ఆ విషయమే చెప్పాడు.

"అవునండీ! ఈ రోజుల్లో పెళ్ళికాని ఆడపిల్లలకూ, ఎవరూ దిగని పోర్షన్‌లకూ విలువ లేకుండా పోయింది. ప్రతీ వెధవా వచ్చి చూసేసి వెళ్ళిపోతారు." ఇంకా అతని అరుపులు తీవ్రస్థాయికి చేరుకొంటోన్నాయి.

పరిస్థితి మరీ విషమించక ముందే శాస్త్రి ద్వయం అక్కడ నుండి నెమ్మదిగా జారుకొంది.

సాయంత్రం ఆరు దాటుతోందనగా వాళ్ళు "వాస్తూ కన్సల్టెంట్సు" ఆఫీసు దగ్గరకు వచ్చారు.

"పేరు విచిత్రంగా వుంది కదూ!" అంటూ బోర్డు క్రిందనున్న పర్టిక్యులర్స్ చదివాడు శాస్త్రి.

ఇళ్ళ అమ్మకాలూ, కొనుగోళ్ళూ, ఇళ్ళపై రుణాలూ, అద్దె యిళ్లూ....యిలా వగైరా రాసి వుంది.

ఇద్దరూ ఆఫీసులోకి వెళ్ళారు.

లోపల ఆఫీసు చాలా అధునాతనంగా అలంకరించి వుంది.

'మోహన్‌కుమార్, ఛీఫ్ కన్సల్టెంటు' అని బోర్డున్న గది దగ్గరకు వెళ్లారు.

మోహన్‌కుమార్ చాలా హుందాగా వున్నాడు. ఠీవిగా కూర్చొని వున్నాడు. అతని మొహంలో అదోరకమైన గంభీరత వుంది.

అతడు లోపలకు వచ్చిన యిద్దర్నీ మర్యాదగా విష్‌చేసి కుర్చీలను ఆఫర్ చేశాడు.

శాస్త్రి తన మిత్రుడికి వచ్చిన కష్టాన్ని వివరించాడు.

ఈలోగా బాయ్, మూడు గ్లాసుల్లో షర్బత్ తెచ్చి యిచ్చాడు.

శాస్త్రి చెప్పిందంతా విని మోహన్ కుమార్ చిన్నగా నవ్వాడు. "అందుకే గదా మేమున్నది" అంటూ టేబుల్ సొరుగులోంచి ఆల్బామ్‌లూ, ప్లాన్‌లూ బయటకు తీశాడు.

"అయ్యా! ఆదర్శ నగర్లని నాలుగున్నాయి. ఒకటి బీచ్ దగ్గిర మరోటి వూరు చివర, మరోటి ఇండస్ట్రియల్ ఎస్టేటు దగ్గిర మరోటి ఆ కనిపించే పెద్ద కొండమీద. ఆ యిళ్ళన్నీ ప్రస్తుతం మన కంట్రోల్‌లోనే వున్నాయి. ముందు ఖాళీ జాగా, పెద్ద గది, అనుకొని కిచెన్, లావట్రీ బాత్‌రూమ్, అన్నీ మించి సపరేట్ కుళాయి. సపరేట్ హౌస్. మరొకరితో సంబంధం వుండదు."

"లొకాలటీ డీసెంటుగా వుంటుందా?"

"అసలు ఓనర్స్పెవరూ ఆ యిళ్ళలో వుండటంలేదు. అంతా మీలాటివాళ్ళే. చాలా డీసెంటుగా ఉంటుంది."

రమణారావులో ఉత్సుక పెరిగింది. "వివరాలు చెప్పండి" అన్నాడు.

"ఇంటి ఓనర్‌కు మనం పదివేలు అడ్వాన్సు ఇవ్వాలి. దానికి సపోర్టింగుగా మనకి పేపర్సు సబ్‌మిట్ చేస్తారు. నెలకు నూటఏభై అద్దె" అన్నాడు.

"పదివేలు అడ్వాన్సే!"

"ఎందు కాశ్చర్యపోతారు. మీరు ఎక్కడయినా చూడండి. అలాంటి యింటికి పదివేలు అడ్వాన్సూ నాలుగొందల చిల్లర అద్దెవుండి తీరుతుంది. పైగా యిక్కడ మనకు మరో అవకాశం వుంది. పదివేలు యిచ్చాక, వాళ్ళు అంత మొత్తాన్ని మనకు ఎలానూ తిరిగి యివ్వలేరు. వీలు చూసుకొని మరో అయిదో, పదో వాళ్ళ చేతుల్లో పెడితే యిల్లు మీ సొంతం అయిపో తుంది."

రమణరావులో ఆశ చిగురించింది.

"ఆ మాట అటుంచండి. అగ్రిమెంటు అయిదు సంవత్సరాలు. ఈ అయిదు సంవత్సరాల్లోనో మీ అద్దె మారదు. నూట ఏభై రూపాయలు మాత్రమే. అయిదు సంవత్సరాలు పోయిం తరువాత మీకు వాళ్ళు మీరు పే చేసిన అడ్వాన్సు తిరిగి యిచ్చేస్తారు. అప్పుడు మిగితా విషయాలు అంటే ఫర్దర్ కంటున్యూయేషన్ గురించి ఆలో చించుకోవచ్చును. అయినా అప్పటివరకు మీరు వూరుకో రనుకోండి. ఈలోగానే ఆ యిల్లు మీ సొంతం అయిపో తుంది." మోహన్‌రావు గొంతుక ఒక రిథిమ్ ప్రకారం పలుకుతోంది.

రమణారావు పూర్తిగా అతని వశమయి పోయాడు. నాదస్వరం విన్న నాగులా తలూపాడు.

"అయితే మిమ్మల్ని ఎప్పుడు కలవాలి?" అడిగాడు శాస్త్రి.

"రేపు ఉదయం డబ్బు తీసుకురండి. మాలాయరు పేపర్సు తయారుచేస్తాడు. ఓనరుని కూడా మీరు కలుసుకోవచ్చు." అన్నాడు మోహన్‌కుమార్.

ఇద్దరూ తలలు వూపారు.

"మీ కిష్టమయితే మాకు అయిదు వందలు పే చెయ్యండి?" అన్నాడు.

"టు మచ్!" అన్నాడు శాస్త్రి.

"చూడండి! మేం ఈ విషయంలో చాలా కష్టపడ్డాం. ఆఫ్టారల్ అయిదొందలు ఒక పెద్ద మొత్తంకాదు. అరవై వేల రూపాయల యింటిని యిరవైకి కొట్టేయ్యాలంటే మరి కొంచెం ఖర్చవుతుంది". మోహన్ కుమార్ గొంతులో ఒక రకపు జీర ఏర్పడింది. ఆ జీరలో చిన్నగా హేళనా, కొంచెం ఎక్కువపాల్లో కోపం వుంది.

శాస్త్రి ఏదో మాట్లాడబోయాడు.

రమణారావతడిని చెయ్యి పట్టుకొని ఆపి, అయిదు వందలూ పే చేశాడు.

"మరో పావుగంట వెయిట్ చెయ్యండి, మా ట్రక్ మిమ్మల్ని ఆ ప్లేసెస్‌కు తీసుకు వెళుతుంది. మీకు కావాల్సిన యింటిని సెలక్టు చేసుకోండి."

అతడు చెప్పినట్లుగానే మరో పావుగంటలో నాలుగు ట్రక్కులు వచ్చాయి. నాలుగు ట్రక్కులూ పూర్తిగా జనంతో నిండిపోయి వున్నాయి.

శాస్త్రీ రమణారావూ ట్రక్ ఎక్కారు.

మరుసటి రోజు రమణారావే కాకుండా, ఆ ప్రక్క యింట్లో శాస్త్రి కూడా దిగిపోయాడు.

4

ఇన్‌స్పెక్టర్ సుందరం కుర్చీలో అసహనంగా కదిలాడు.

అతని ఎదురుగా శాస్త్రీ, రమణారావు మరో నలుగురు వ్యక్తులూ కూర్చొని వున్నారు.

"చెప్పండి! అవతల నాకు చీఫ్ మినిస్టర్ ప్రోగ్రాం పనులు బోల్డు వున్నాయి." అన్నాడు సుందరం.

"అయ్యా! మే మందరం - అంటే దాదాపు మూడు వందలమంది అన్యాయంగా ఒక దుర్మార్గుడి వలలో పడిపోయాం సార్!" అంటూ ఏడుపు మొహంతో జరిగిందంతా చెప్పటం ప్రారంభించాడు, జగన్నాధమనే ఆసామీ. అతడు ఏదో ప్రయివేట్ సంస్థలో చిన్న ఉద్యోగి.

"అయితే మోహన్ కుమార్ అనే అతడు, అక్కడి వాళ్ళందరికీ వెయ్యేసి రూపాయల చొప్పున పే చేసి, మీ దగ్గర పదేసి వేలు గుంజాడన్న మాట." అన్నాడు సుందరం ఆశ్చర్యంగా.

"అవును సార్! చాలా అన్యాయమయిపోయాం. పిల్లలు గలవాడిని ఎలాగయినా మీరే కాపాడాలి." గొల్లుమన్నాడు జగన్నాథం.

"మీరంతా అంత కళ్ళు మూసుకుపోయి ట్రాప్‌లో ఎందుకు చిక్కుకున్నారు?" విసుక్కున్నాడు సుందరం.

"కాగితాలూ అవీ సజావుగానే వున్నాయి." చెప్పాడు

శాస్త్రి.

"వెర్రిపై చేసుకోలేక పోయారా?"

ఎవరూ మాట్లాడలేదు.

పదివేలు యిస్తే ఆ ఓనరు ఎలానూ తిరగ్గొట్టలేడు. ఆ తర్వాత పదో పరకో యిచ్చి యింటిని సొంతం చేసుకో వచ్చునన్న ఆలోచనతో అందరూ బుట్టలో పడిపోయారని సుందరం గ్రహించాడు. తర్వాత "మోహన్ కుమార్ ఎప్పటినుండి కనుపించటం లేదు?" అడిగాడు.

జగన్నాధం పళ్ళు పట పట నూరాడు. "మేం ఇళ్ళలో దిగిన వెంటనే పారిపోయేడట. మాకు నిన్ననే తెలిసింది" అన్నాడు ఆవేశంగా.

"అసలు మోసం జరిగిందన్న విషయం మీకు ఎలా తెలిసింది?"

"శాస్త్రిగార్కి గుంటూరు ట్రాన్సఫర్ అయింది. ప్రతి యింటి ఓనరూ ఆ యింటి వెనక పాకలోనే కదా వుంటు న్నది. ఆయన ఓనరు దగ్గిరకు వెళ్ళి తన అడ్వాన్సును తిరిగి యిచ్చినా సరే లేదా ఏదో రేటుగట్టి ఆ యింటిని యిచ్చేసినా సరే—అన్నారట. ఆ ఓనర్ ఒక గంట పోయాక వెయ్యిరూపాయలు తీసుకు వచ్చి యిచ్చాడట. అప్పుడు జరిగిన మోసం తెలిసి మేం వాస్తూ కన్సల్టెంట్సుకు వెళ్ళాం." అన్నాడు జగన్నాధం.

"సరే మీరు రిపోర్టు యిచ్చి వెళ్ళండి. మేం యిన్వెష్టి గేట్ చేస్తాం." అన్నాడు సుందరం.

జగన్నాథం జేబులోంచి కాగితాలు తీసి సుందరానికి అందించాడు.

కేసు మామూలుగా రిజిస్టరయి పోయింది. □

శాపంతో ప్రయాణం

సరసి



విశ్వనాధానికి పిల్లల్లేరు. ఆ విషయంలో అతడికంటె ఎక్కువగా బాధపడుతుంది అతడి భార్య కౌసల్య.

ఒంటరిగా ఆలోచిస్తూ కూర్చునుంటే పిల్లల్లేని లోటు పదే పదే కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని తరచు విహార యాత్రలనో, పుణ్యక్షేత్రాలనో - దేశం తిరగడం ప్రారం

భించారు దంపతులిద్దరూ. ఆ విధంగా చాలా ప్రదేశాలు, క్షేత్రాలూ తిరిగేరు.

అలా ప్రయాణాలు చేస్తూ ఓసారి భార్యాభర్తలిద్దరూ బొంబాయి చేరుకున్నారు.

అప్పటికి ఇల్లు వదలి సుమారు నెలరోజులు కావస్తోంది. నీళ్ళమార్పిడివల్ల విశ్వనాథం కొద్దిగా అస్వస్థత పాల య్యాడు.

వాళ్ళుంటున్న హోటలుకి దగ్గర్లో ఓ డాక్టరుంటే ఆయ నకి చూపించింది కౌసల్య తన భర్తని. భయంలేదని చెప్పి ఇంజక్షనిచ్చి కొన్నిమందులు రాసిచ్చాడు డాక్టరు.

కాస్త స్వస్థత చేకూరితే తర్వాతి ప్రయాణానికి స్వస్తి చెప్పి ఇంటికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నారు విశ్వ నాథం, కౌసల్య.

డాక్టరొచ్చి పరీక్షచేసి వెడుతున్నాడు రోజూ. ఇలా నాలుగురోజులు గడిచాయి.

తర్వాత ఓరోజు విశ్వనాథం కోలుకుని లేచి కూర్చు న్నాడు. మర్నాడు వెళ్ళిపోవచ్చునన్నాడు భార్యతో!

కాని మర్నాడు అతడొక్కడే వెళ్ళిపోయాడు లోకం విడిచి!

గుండెలు బాదుకుని ఏడ్చింది కౌసల్య.

జీవితంలో మిగిలిన ఒకే ఒక తోడు అతడామెకు. అది కాస్తా ఇక లేదనే సరికి వేళ్ళు నరికిన చెట్టులా కూలి పోయిందామె!

ఆ సమయంలో హోటల్ సిబ్బందే ఆమెకు ఆప్తు లయ్యారు. వాళ్ళే ఆమె నోదార్చారు.

హోటలు బిల్లు, డాక్టరు ఖర్చులు పోగా కౌసల్యచేతిలో మిగిలిన సొమ్ము మూడువందల నలభై రూపాయలు. ఆ

డబ్బుతోనే శవ దహనం చెయ్యాలి, తను ఇల్లు చేరుకో వాలి!

ఆమెకు ఏం చెయ్యాలో పాలుపోలేదు.

దహనసంస్కారాలకి డబ్బు బాగా కావాలి. స్నేహితుల కెవరికైనా టెలిగ్రాం ఇప్పించి డబ్బు తెప్పించుకునే సమయం లేదు. అందాకా శవాన్ని ఏమూలకో ఈడ్చేస్తే తను భరించలేదు. వస్తువులమ్మేద్దామా అంటే - ప్రయాణాల్లో భద్రతవుండదని పసువుతాడుతో వచ్చింది తను.

తనతో ఏడడుగులూ నడిచి భర్తకంటే అధికంగా స్నేహితుడిలాగా, దైవంలాగా తన వెంట వున్న మనిషి చనిపోతే అతడికి కడకు దహనసంస్కారాలు కూడా సక్రమంగా జరిపించలేని తన దౌర్భాగ్యస్థితికి వలవలా ఏడ్చింది కౌసల్య!

ఆమె పరిస్థితికి జాలిపడ్డ హోటల్‌మానేజరు "అమ్మా! మీ తిరుగు ప్రయాణానికి డబ్బు వుంచుకుని ఓవందరూపాయలు మాత్రం ఇవ్వండి. ఏదోవిధంగా దహన సంస్కారాలు చేయిస్తాను!" అన్నాడు.

బొంబాయి మహానగరంలో కొన్నివందల రూపాయలు పోస్తేగాని అటువంటి పనికి ఎవరూ ముందుకు రారు. తన దీనావస్థ చూసి సహాయ పడతానన్న హోటల్ మేనేజరులో మానవతావాది కనిపించాడామెకు.

కాని మరుక్షణం ఓ అనుమానం కలిగింది. డబ్బు తక్కువైనందువల్ల ఏ మునిసిపాలిటివాళ్ళనో పిలిపించి దరిద్రుణ్ని ఈడ్పించినట్టు తన కళ్ళముందే హీనంగా ఈడ్పించేస్తే తను తట్టుకోగలదా? అలాగే కనక జరిగితే పరలోకంలో భర్త తనని క్షమిస్తాడా? తను జీవితాంతం మనశ్శాంతితో బ్రతగ్గలదా?

ఆ అనుమానం పొడసూపగానే వెంటనే అంది కౌసల్య "అసలీవూళ్లో ఏంచెయ్యడానికీ ఒప్పుకోను. శవాన్ని మా వూరు తీసికెళ్లి వారి ఆత్మ శాంతించేలాగా ఆయన పుట్టిన వూళ్ళోనే యధావిధిగా సంస్కారాలు చేయిస్తాను....ఎంత ఖర్చయినాసరే!" అని.

"మీ ఉద్దేశం మంచిదేనమ్మా! కాని డబ్బు లేకనే గదా ఈ తిప్పలన్నీ!" అన్నాడు హోటల్ మేనేజరు.

"నా పరిస్థితి కళ్లారా చూస్తున్నారుకదా: మా వూరు చేరగానే మీ డబ్బుమీకు పువ్వుల్లో పెట్టి పంపిస్తాను. దయచేసి నా అవసరానికి సహాయం చెయ్యండి!" ఇలా ప్రాధేయపడాల్సి వచ్చినందుకు తననితాను తిట్టుకుంది.

"మీకు డబ్బు యిస్తే తిరిగిరాదని కాదు. మేనేజరుగా నాకు కొన్ని పరిమితులున్నాయి. కాకపోతే ఓ సహాయం మాత్రం చెయ్యగలను. మీవూరికి శవాన్ని తీసుకువెళ్ళడానికి ఏర్పాటు చెయ్యగలను. వాళ్ళకి కొంత సొమ్ము అడ్వాన్సుగా ఇస్తే మిగిలిన డబ్బు మీవూరు చేరేక ఇవ్వవచ్చు" అన్నాడు మేనేజరు.

కౌసల్య ఆనందంగా ఒప్పుకుంది.

డబ్బు ఖర్చయినా ఫరవాలేదు. శవం తన వూరు సక్రమంగా చేరితేచాలు - అనుకుంది.

అర్ధగంటలో ఇద్దరు మనుషుల్ని తెచ్చి నిలబెట్టేడు హోటల్ మేనేజరు. వాళ్ల పేర్లు సులేమాన్, రాజేష్! టాక్సీలు, ట్రక్కులు నడిపే ఓ ట్రాన్స్‌పోర్టు ఏజన్సీకి చెందిన మనుషులు వాళ్ళిద్దరూ.

శవాన్ని వాళ్ళ ఊరు చేర్చడానికి మూడు వేలవుతుందని రేటు తేల్చాడు సులేమాన్ అదికూడా శవాన్ని బాక్సులోపెట్టి రెండురోజుల్లో ఇంటికి చేర్చడానికే గాని

టాక్సీలో తీసుకెళ్ళే పద్ధతిమీద కాదు. టాక్సీలో అప్పటి కప్పుడు బయలుదేరాలంటే మరో వెయ్యి అధికంగా అవు తుందన్నాడు.

ఆ రేట్లు వినేసరికి భయపడిపోయింది కౌసల్య!

టాక్సీలో శవాన్ని వేసుకుని తను ఒంటరిగా వాళ్ళతో రావడంకన్న వాళ్ళనే ఇంటికి తీసుకొచ్చి అప్పజెప్ప మనడం మంచిదనిపించిందామెకు.

మేనేజరుతో మాట్లాడించి అతికష్టంమీద అయిదు వందలు తక్కువ చేయించి రెండువేల అయిదువందలకు బేరం కుదిర్చి అడ్వాన్సుగా రెండువందలయాభై రూపా యలు ఇచ్చింది. మిగిలిన డబ్బు ఇంటికి శవాన్ని చేర్చిన వెంటనే ఇచ్చేటట్టుగా చెప్పి అడ్రసూ, ఇంటి రూటూ ఇచ్చింది. దానితోబాటు విశ్వనాథం అనారోగ్యంవల్ల చని పోయినట్టుగా డాక్టరు ఇచ్చిన ధృవీకరణ పత్రంకూడా వాళ్ళ కిచ్చింది కౌసల్య.

శవాన్ని పెట్టెలో పెట్టి తీసుకుపోయారు సులేమాన్, రాజేష్‌లు.

మేనేజరుకు కృతజ్ఞతలు చెప్పి గుండె దిటవు చేసు కుని బయలుదేరింది. ఆరోజు సాయంత్రం హైదరాబాదు బయలుదేరే ప్రైవేటు బస్సులో ఎక్కి భవిష్యత్తు ఎలాగా అని ఆలోచిస్తూ కళ్ళుమూసుకుంది కౌసల్య!

2

శవాన్ని ట్రాన్సుపోర్టు చేసే పనిలో హడావుడిగా వున్నారు సులేమాన్, రాజేషూ. ఈవ్యవహారంలో ఖర్చు లుపోగా వాళ్ళకి సుమారు వెయ్యిరూపాయలు మిగులుతా యని తేలింది. శవాన్ని హైదరాబాదు వెళ్ళే ఓ ట్రక్కులో పంపేసి డబ్బు ఎంత త్వరగా తీసుకుందామా అనే ఆత్ర

తలో వున్నారిద్దరూ.

ఇంతలో లాభాలు బేరీజువేస్తున్న రాజేష్‌కి ఓఆలోచన మెదిలింది.

"గురూ! మనం ఓపద్ధతిమీద శవాన్ని హైదరాబాదు చేర్చగలిగితే డబ్బులు బ్రహ్మాండంగా మిగుల్తాయి!" అన్నాడు కళ్ళింత చేసుకుని.

"ఎలా?"

రాజేష్ తెలివితేటలమీద సులేమాన్‌కి గుడ్డినమ్మకం.

"శవానికి ఒంటిమీద మంచిబట్టలున్నాయి. బ్రతికున్న వాడికి మల్లే బూట్లూ. చేతులకు గ్లవ్స్ తగిలించి బట్టల మీద, నోటిదగ్గిర కొంచెం మందు జల్లుదాం. తర్వాత నువ్వూ నేనూ చెరో పక్కా నిలబడి తాగినవాడిని మోసు కెడుతున్న పద్ధతిలో శవాన్ని ఇంచుమించు నడిపిస్తున్న ట్లుగా నాటకం ఆడి రాత్రిపూట రైలెక్కించుదాం. ముగ్గు రుకీ టికెట్లు తీసుకుందాం. హైదరాబాదు చేరేక కూడా ఇదే పద్ధతి. స్టేషను దాటి కార్లో పడేశామంటే ఇకఇంటికి చేర్చేసినట్టే, మనకు రావలసిన డబ్బు చేతిలో పడిపోయి నట్టే!"

రాజేష్ తెలివితేటలకి సులేమాన్ ఆశ్చర్యపడి పోయాడు. "అరె ఏం బుర్ర గురూ నీది?" అంటూ కావి లించుకున్నాడు. గానీ మరుక్షణం నీరుగారిపోయాడు.

తాగిన మనిషిని రిక్షాలోకో, ఆటోలోకో ఎక్కించి తీసికెళ్ళడం రివాజుగానీ ఇలాసరాసరీ రెల్లో కెక్కించి ఊళ్ళకి ఊళ్ళు తిప్పడం ఎంతవరకూ సాధ్యం గురూ! రైల్వే ప్లాట్‌ఫారాలనిండా తిరిగే పోలీసులూ, రైల్వే ఆఫీ సర్లూ, పోర్టర్లూ వీళ్ళందరినీ తప్పించుకుని అసలీ విశ్వ నాథంగార్ని అక్కడికి చేర్చగలమా? ఖర్మం జాలక ఎవ

దైనా పసిగడితే మనమే ఈయనగారిని చంపేసి ఇలా తీసుకుపోతున్నామని లేనిపోని కేసులో ఇరికించేస్తారు. అప్పుడు బైటపడడానికి ఎన్నిపాట్లు పడితే అవుతుందీ?"

"లాభం కావాలంటే ధైర్యం చెయ్యాలి గురూ! నీ కెందుకు ఆ సంగతి నా కొదిలెయ్యి!" భరోసా ఇచ్చేడు రాజేష్!

అలా రైల్లో తీసికెళ్ళడంలో చిక్కులేమైనా వున్నాయా వుంటే ఎలా ఎదుర్కోవాలీ—అని ఆలోచించి చివరకు ఆ పద్ధతి బాగానే వుందని నిర్ధారణ కొచ్చారిద్దరూ.

ఆరాత్రి హైదరాబాదుకి బయల్దేరే మీనార్ ఎక్స్‌ప్రెస్‌కి మూడు టిక్కెట్లు కొన్నాడు రాజేష్. బెర్తు రిజర్వేషన్ దొరికుంటే బాగుండేదనుకున్నాడు గానీ ఆరోజు కారోజే ప్రయాణం కావడంచేత దొరకలేదు. బెర్తుకోసం మరో రోజు ప్రయాణం వాయిదావేస్తే శవం వాసన రావొచ్చు. అప్పుడు ప్లానంతా ధ్వంసం అయిపోతుంది.

అనుకొన్న ప్రకారం శవాన్ని చక్కగా అలంకరించి తలదువ్వి చేతులకి గ్లవ్స్‌వేసి, కాళ్ళకి బూట్లు తొడిగి బట్టలమీద, పెదవుల దగ్గిరా అక్కడక్కడ వాసనలొచ్చే లాగా బ్రాందీ చుక్కలు చిలకరించేరు.

బండి ప్లాట్‌ఫారంమీదికి రాకముందే రైల్వేపోర్టర్లు రైలెక్కి తువ్వాళ్ళూ, దుప్పట్లూ పరిచి బెర్తులూ, సీట్లూ అమ్మకం పెడుతుంటారు. అటువంటి పోర్టరుకి ముందుగానే పదిరూపాయలిచ్చి జనరల్ కంపార్టుమెంటులో ఓ బెర్తు బుక్‌చేశాడు రాజేష్.

ఆటోని పిలిచి ఎవరికీ అనుమానం రాకుండా చీకట్లో శవాన్ని రైల్వేస్టేషనుకి తరలించారు.

ఓ అనారోగ్యం మనిషినో, తాగిన మనిషినో తీసి

కెడుతున్నట్టు చూసేవాళ్ళకి భ్రమ కల్పించి చాకచక్యంగా శవాని కిరుప్రక్కలా నిలబడి నడిపించుకెడుతున్నట్టు రైలులోకి ఆ శవాన్ని చేర్చి పై బెర్తుమీదికి ఎక్కించేదాకా వాళ్ళగుండెలు దడదడ లాడుతూనే వున్నాయి. వాళ్ళ అదృష్టం బావుండి వాళ్ళనెవరూ అనుమానించలేదు.

రాత్రి కావడంచేతా ప్రయాణీకులంతా హడావుడిగా ఇళ్ళకుచేరే ప్రయత్నంలో వుండడంచేతా వీళ్ళ వ్యవహారం పట్టించుకునేవాడు లేకపోయాడు. పైగా బొంబాయిలో చీకటి పడేసరికి చాలాచోట్ల ఇలా 'మందు భాగ్యులు' దర్శన మిస్తూనేవుంటారు. కారణం ఏదయినా సులేమాన్ రాజేష్‌ల వ్యవహారం ప్రథమాధ్యాయం జయప్రదంగానే ముగిసింది.

3

అది జనరల్ కంపార్టుమెంటు కావడంచేత కొంచెం రద్దీగానే వుంది. అదీగాక బొంబాయిలో వ్యాపారాలు చేసుకుని రాత్రికి రాత్రి పూనా తిరుగుముఖంపట్టే ప్రయాణీకులతో కంపార్టుమెంటు కోలాహలంగా వుంది.

శవాన్ని బెర్తుమీద పడుకోబెడుతూనే మొఖం బైటి వాళ్ళకు కనబడకుండా అటువైపు తిప్పి పడుకోబెట్టాడు సులేమాన్.

అంతవరకూ ఎవరూ మాట్లాడలేదుగానీ కూర్చోడానికి చోటులేక నిలబడ్డ ప్రయాణీకులు కొంతమంది రైలు కదిలిన కొద్దిసేపటికీ పడుకున్న విశ్వనాథంపైన చిరాకుపడ్డారు.

"లేవ్వెయ్యా .... ఇంతమంది నిలబడుంటే నువ్వు హాయిగా చోటంతా ఆక్రమించి పడుకున్నావ్....లే!" అని కసిరినట్టు మాట్లాదేడొక ప్రయాణీకుడు హిందీలో.

శవం వున్న బెర్తుకి ఎదురుగా క్రిందవున్న సీట్లో

కూర్చున్న ప్రయాణీకుల్లో ఓ మిలటరీ ఉద్యోగి కూడా వున్నాడు. అతడి పేరు దీప్‌సింగు.

"లేచి కూర్చోవయ్యా! నువ్వొక్కడివే తెలివైనవాడి ననుకుంటున్నావా ముందుగా బెర్తు పట్టేసి పడుకోడానికి!" నిలబడ్డవాళ్ళకి వత్తాసు పలుకుతూ అన్నాడు దీప్‌సింగు.

వెంటనే సులేమాన్ "ఆయన కొంట్లో బాగులేదు. బెర్తు రిజర్వేషను దొరకక జనరల్లో వస్తున్నాం. కొంచెం కోఆపరేట్ చెయ్యండి!" అన్నాడు అభ్యర్థిస్తున్నట్టు.

దీపుసింగు ఒప్పుకోలేదు.

"చాలు చాల్లేవయ్యా! చోటు దొరికిన ప్రతివాడూ ఏవో కుంటిసాకులు చెబుతూనే ఉంటాడు. అంత ఒంట్లో బాగు లేనివాణ్ని ఇలా రద్దీలో తీసుకురాకపోతే ఏం?"

అతడికి అనారోగ్యం అన్న సంగతి దీప్‌సింగు నమ్మ లేదని సులేమాన్ గ్రహించాడు. వేరే సందర్భంలో అయితే ఎదుర్కొనేవాడేగాని పరిస్థితి విషమిస్తే తమకే నష్టం అని గ్రహించి "సరే అయితే! నా సీటులో ఒకర్ని కూర్చోమనండి. నేను నిలబడతాను!" అన్నాడు నిలబడి.

ఓ ప్రయాణీకుడు ఆ చోటులో సర్దుకున్నాక పరిస్థితి చల్లబడింది.

మిగిలిన ప్రయాణీకులంతా మత్తుగా జోగుతున్నా రాత్రంతా సులేమాన్‌గానీ, రాజేష్‌గానీ అసలు నిద్రపోలేదు.

రాత్రి రెండు గంటలకి బండి పూనా చేరింది. అక్కడ కంపార్ట్‌మెంటంతా ఖాళీ అయిపోయింది—ఒక్క దీప్ సింగు తప్ప. తను కూర్చున్న సీటంతా ఖాళీ అయిపోయే సరికి దుప్పటి పరిచి నిద్ర కుపక్రమించాడు.

సులేమాన్, రాజేష్ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

వీళ్ళున్న ఖానాకి రెండు ఖానాలు అవతల కొంతమంది

పేకాడుతూ కేరింతలు కొడుతున్నారు. చాలా సేపుగా వాళ్ళ కేరింతల్ని గమనిస్తున్న సులేమాన్ శివజాగరణ బాధ్యత రాజేష్‌కి అప్పజెప్పి వెళ్ళిపోయి పేకాటగాళ్ళతో చేతులు కలిపాడు.

ఆట రసవత్తరంగా సాగుతుండడంతో వాళ్ళ అల్లరి మరింత ఎక్కువైంది. ఆటమీదే ధ్యాస వున్నా శవాన్ని విడిచి వెళ్ళడం మంచిదికాదని కాపలాగా వుండిపోయాడు రాజేష్.

బండి కదిలింది. దీప్‌సింగు అప్పటికే గాఢంగా నిద్ర పోతూ గురకపెడుతున్నాడు.

మరోగంట గడిచింది.

ఇక ఏ ప్రమాదమూ లేదని నిర్ధారించుకుని రాజేష్‌కూడా వెళ్ళి 'పేకాటవికుల'తో చేతులు కలిపాడు. సులేమాన్ అభ్యంతరం చెప్పబోతే రజేష్ తన సైగలతో సమాధాన పరిచాడు.

ఆగేస్టేషన్లు తక్కువ కావడంతో పాసింజర్లు ఎక్కే అవకాశం కూడా ఎక్కువగా లేదు. అందువల్ల స్నేహితు లిద్దరూ నిరాఘాటంగా పేకాడుతూనే వున్నారు.

రాజేష్‌కి రెండుసార్లు జాక్‌పాట్లు తగిలాయి. దాంతో మరింత విజృంభించి ఆడసాగేడు. సులేమాన్‌కి అసలే పేకాట పిచ్చి. ఇక ఆయిద్దరూ తెలతెలవారేదాకా అలా ఆడుతూనే వున్నారు.

తెల్లవారుతున్నట్టు గ్రహించిన సులేమాన్ ఆవులించి లేచి నిలబడ్డాడు. రాజేష్‌కి అతడితో లేవక తప్పలేదు.

ఒళ్ళు విరుచుకుని పేకాట ప్రపంచంలోంచి బైటపడి సీట్లదగ్గిర కొచ్చిన మిత్రులిద్దరూ ఒక్కసారిగా అదిరిపడ్డారు!

శవం లేదు బెర్తుమీద!!

4

గుండెలు జారిపోయాయి ఇద్దరికీ.

దీప్‌సింగుమాత్రం యథాప్రకారం నిద్రపోతున్నాడు.

హడావుడిగా సీట్లకిందా, చుట్టుపక్కలా అటూ ఇటూ అంతా వెదికేరిద్దరూ. ఎక్కడా శవం జాడలేదు.

వెంటనే సులేమాన్ చూపు దీప్‌సింగుమీద పడింది. "వీడే ఏదో చేసుంటాడు!" అన్నాడు గట్టిగా.

అంటూనే ముందుకెళ్ళి దీప్‌సింగుని కుదిపి లేపి "ఇక్కడ బెర్తుమీద మా స్నేహితుడేవయ్యాడు?" స్వరం పెంచి అడిగేడు.

దీపుసింగు లేచి కళ్ళు తుడుచుకుని పైకి చూశాడు.

"ఆఁ! ఇందాక ఏదో స్టేషన్లో బండాగిందికదా. అక్కడ మీస్నేహితుడు దిగిపోయాడు. మిమ్మల్ని హైదరాబాదులో కలుస్తాడట!! విషయాలన్నీ అక్కడ వివరంగా చెబుతానన్నాడు" అన్నాడు దీపుసింగు తడుముకోకుండా.

సులేమాన్, రాజేష్ ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు.

"లేదు.... వీడే ఏదో మాయ చేస్తున్నాడు!" అన్నాడు దీప్‌సింగువైపు వేలుపెట్టి చూపిస్తూ.

వెంటనే సులేమాన్ దీపుసింగు చొక్కా పట్టుకొని ఆదవడా ఈదవడా పెడీపెడీ వాయించి "ఇందాక బండాగింది స్టేషన్‌లో కాదురా ఫూల్! సిగ్నల్‌ఇవ్వక అడవిలో ఆగింది! చెప్పు...ఏంచేశావతణ్ని....చెప్పు!!" గర్జించాడు.

ఆ దెబ్బలకి దీప్‌సింగు మత్తొదిలిపోయింది!

లేస్తూనే దీప్‌సింగు సులేమాన్ పొట్టలో బలంగా పొడిచాడు హిందీలో ఓతిట్టుతిట్టి.

వెనకి తూలిపడబోయిన సులేమాన్ రాజేష్ ఆసరాతో

నిలబడి దీప్‌సింగ్ మీదికి లంఘించాడు. ఈసారి అతడికి రాజేష్‌కూడా సహకరిందాడు ముష్టిఘాతాల వర్షంలో.

దీప్‌సింగు ఆవేశపడిపోయి పళ్ళుబిగించి సులేమాన్ మొహంమీద పిడికిలి బిగించి కొట్టేడు. దాంతో సులేమాన్ పళ్ళలోంచి రక్తం చిమ్మింది.

ఈలోగా బండి షోలాపూర్ స్టేషన్‌లో తాపీగా ఆగింది.

ఆగుతున్న రైల్లోకి కూలికోసం ఎక్కిన ఇద్దరు పోర్టర్లు జరుగుతున్న యుద్ధం చూసి కంగారుపడి ఆపడానికి ప్రయత్నించి అడ్డుపడ్డారు.

ఆప్రయత్నంలో - దీప్‌సింగు చెయ్యి బలంగా విసరడంతో ఆ చేతికున్న స్టీలు కడియం ఓపోర్టరు గెడ్డంకింద తగిలింది. దాంతో ఆపోర్టరు చిన్నగా అరిచి నేలమీద కూర్చుండిపోయాడు. అది చూసిన రెండవ పోర్టరు తన ప్రయత్నం విరమించి, కూలిసంగతి మరిచిపోయి హడావుడిగా కిందకురికి ఇద్దరు రైల్వేపోలీసుల్ని వెంట బెట్టుకొచ్చాడు.

తర్వాత పావుగంటకి రైలు కదిలిపోయింది గానీ సులేమాన్, రాజేష్, దీపుసింగులు మాత్రం రైల్వే పోలీసుల అతిధులుగా షోలాపూరులో మిగిలిపోయారు.

పోలీసువాడు 'మర్యాదలు' చేసేసరికి విషయాలు బైటపెట్టా రొక్కొక్కరూ.

దీపుసింగు కధనం ఇలా వుంది:

అతగాడు గాఢ నిద్రలో వుండగా శవం దొర్లి అతడి మీద పడింది.

ఉలిక్కిపడి లేచిన దేప్‌సింగ్ తనకి నిద్రాభంగం చేసినందుకేకాక, ఆ రాత్రి చాలాసేపు తనకు లేని బెర్తు సుఖం అనుభవించాడనే కోపంతో బలంగా రెండు

దెబ్బలు కొట్టేడు శవాన్ని - మనిషే అని భ్రమపడి.

ఆ దెబ్బలు కొట్టేక వాలిపోతున్న మనిషిని చూసి భయపడి నాడి చూశాడు. నాడి ఆడటం మాట అటుంచి చెయ్యీ, ఒళ్ళూ చల్లగా తగిలేసరికి దీపుసింగు భయపడి పోయాడు. అతడు తను కొట్టిన దెబ్బలకే చనిపోయా డనుకుని. దాంతో-అప్పుడేం చెయ్యాలో పాలుపోలేదతనికి.

బెర్తుమీంచి కిందపడి చనిపోయాడంటే అతడి స్నేహి తులు నమ్మరు సరికదా తనే అతణ్ణి చంపినట్టు సులభంగా గ్రహించేస్తారు. ఏం చెయ్యాలి?

వాళ్ళు పేకాటనించి ఏ క్షణంలోనయినా రావచ్చు. వాళ్ళు రాకముందే ఏదో ఒకటి చెయ్యాలి.

ఆ హడావుడిలో అతడికొక ఆలోచనొచ్చింది. మంచి చెడు లాలోచించే టైము లేదు. అంచేత వెంటనే ఆ ఆలోచనను అమలుపరిచేడు.

శవాన్ని గప్‌చిప్‌గా బైటికి దోసేసి, వాళ్ళతో దిగి పోయాడని చెబితే సరి!

మరు నిముషంలో శవం రైల్లోంచి క్రిందకు దొర్లి పోయి చీకట్లో కలిసిపోయింది.

తలుపుకి దగ్గరగావున్న సీట్లు కావడంచేత దీపం మసగ్గా వెలుగుతుండటంచేతా దీపుసింగు నడిపిన ఈ వ్యవహారం ఎవరికంటా పడలేదు. పైగా దూరంగా పేకాట హడావుడిలో వున్న స్నేహితులు ఇవేం పట్టించుకునేస్థితిలో లేరు.

మొత్తం వ్యవహారమంతా పోలీసులు రికార్డు చేసుకుని ముగ్గురిపయినా కేసులు బుక్ చేసి కటకటాల్లో తోశారు.

తర్వాత రైలు పట్టాల వెంబడి గాలించి జీర్ణస్థితిలో వున్న శవాన్ని కనుక్కొని కౌసల్యకి అప్పగించారు పోలీసులు. □

సాక్షి కోసం అన్వేషణ

వసుంధర

"ధైర్యవంతుడికి మరణించినా చావులేదు. పిరికివాడు అనుక్షణం చస్తూనే బ్రతుకుతూంటాడు. ఈ విషయాన్ని మీరందరూ గుర్తుంచుకుని ధైర్యంగా ముందుకు వచ్చి మీరు చూసిన ప్రతి నేరాన్నీ, మీకు తెలిసిన ప్రతి నిజాన్నీ పోలీసులకు తెలియబరుస్తూంటే - అలనాటి రామరాజ్యం మళ్ళీ వస్తుంది. దేశంలో నేరస్థులన్నవారు లేకుండా

పోతారు. విన్నవారికి నా మాటలు సందేశం. ఆలోచించే వారికి నా మాటలు హెచ్చరిక!"

ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ ఈ మాటలు చెప్పి కూర్చోగానే సభంతా కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోయింది.

అది ఆ ఊళ్ళోని ఓ హైస్కూలు. విద్యార్థులందర్నీ ఉద్దేశించి ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ ముఖ్య అతిథిగా ఆ ఉపన్యాస మిచ్చాడు.

సాధారణంగా చంద్రకాంత్ సభలకూ, సమావేశాలకూ వెళ్ళడు. ఆ స్కూలుకు మాత్రం కావాలనే వెళ్లాడు. ఆహ్వానం తనకు రావడం కోసం అతడు తెర వెనుక నుండి కృషి కూడా చేశాడు.

అందుక్కారణ ముంది.

ఊరి చివర స్మగ్లింగ్ ఆపరేషన్ జరుగుతూండగా కానిస్టేబుల్ మహేష్ అక్కడికి వెళ్ళాడు. ఒక అనుమానితుడి ననుసరిస్తూ అతడంత దూరం వెళ్ళాడు. అక్కడ అతడిద్దరు పుర ప్రముఖుల్ని చూశాడు. కానీ అతడొక్కడు. ముఠా వ్యక్తులు పదిమంది. కానిస్టేబులు తన ప్రాణాలు రక్షించుకునేందు కక్కణ్ణించి పారిపోవలసి వచ్చింది. ముఠావ్యక్తులతణ్ని తరిమారు.

కానిస్టేబుల్ మహేష్ ఎలాగో ఓ సందులోకి చేరుకున్నాడు. అప్పుడే ఆ సందులో ఓ కుర్రా డడుగు పెట్టాడు. అతడు సెకండ్ షో సినిమా చూసి ఇంటికి వెడుతున్నాడు. మహేష్ ఆ కుర్రాడి నాపి తను చూసిన విశేషమూ, తన పరిస్థితీ చెప్పి కబురు పోలీస్‌స్టేషన్‌లో చెప్పమన్నాడు.

ఇంతలో ఆ సందులోకి మహేష్‌ను తరుముతున్న

వ్యక్తులు పరుగున వచ్చారు. కానిస్టేబుల్ మహేష్ ఆ కుర్రాణ్ని హెచ్చరించాడు. వేరే దారిలేక ఆ కుర్రాడు పక్కనే వున్న చెత్తకుండీ వెనుక దాక్కున్నాడు. తరుము తున్న వ్యక్తులు మహేష్‌ని పట్టుకుని కత్తితో పొడిచారు. చెత్తకుండీ వెనుక నుంచి ఆ కుర్రాడా దృశ్యం చూశాడు. ఆ మనుషుల్ని స్పష్టంగా చూశాడు.

మహేష్ స్పృహ తప్పి పడిపోయాక ఆ వ్యక్తులు వెళ్ళిపోయారు. ఆ కుర్రాడు అక్కణ్నించి పారిపోయి దగ్గర్లో వున్న ఓ డాక్టరింటికి వెళ్ళాడు. సమయానికి డాక్టరు నిద్ర పోతున్నాడు. వాచ్‌మన్‌కి ఆ కుర్రాడు మహేష్ పరిస్థితి వివరించి చెప్పి అక్కణ్నించి వెళ్ళి పోయాడు.

తర్వాత ఆ కుర్రాడు ఇంటికి వెళ్ళి పరిస్థితి చెప్పాడు. ఇంట్లోవాళ్ళతణ్ని తిట్టి ఆ వ్యవహారం మర్చిపొమ్మన్నారు. ప్రమాదంలో తల దూర్చవద్దన్నారు.

ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్ మహేష్ హత్య కేసును పరిశోధిస్తున్నాడు. ఎవరో మామూలు గూండాలు చేసిన నేరంగా అతడు భావిస్తున్నట్లు - మహేష్ హత్య కేసు గురించి పేపర్లలో వచ్చింది.

ఆ కుర్రాడు ఇన్‌స్పెక్టర్ చంద్రకాంత్‌కో ఉత్తరం వ్రాశాడు. అందులో మహేష్ ఏ పరిస్థితిలో చనిపోయాడో వివరించి ఏకారణంగా తనుముందుకు రాలేకపోతున్నాడో కూడా వివరించాడు. సమాజంలో పెద్దమనుషులుగా చెలామణీ అవుతున్న ఆ యిద్దరినీ బయట పెట్టమనీ, తనిలా ఉత్తరం వ్రాసినట్లు కూడా ఎవరికీ చెప్పవద్దనీ అతడా ఉత్తరంలో కోరాడు.

ఆ ఉత్తరం చంద్రకాంత్ నాశ్చర్యపరచింది.

చదవడానికి అంతా కథలా ఉంది కానీ అది నిజం కావడానికి చాలా అవకాశాలున్నాయి. కానీ ఆ ఉత్తరం ఆధారంగా తనేమీ చేయలేడు. ఆ ఉత్తరం ఎవరో గిట్టని వాళ్ళు సృష్టించారని పెద్దమనుషులు వాదిస్తారు.

ఉత్తరం రాసిందెవరో తెలుసుకోవాలి. ఆ ప్రత్యక్ష సాక్షి సాయంతో ఏమైనా చేయొచ్చు.

వచ్చిన ఉత్తరంలో వ్రాసిన వ్యక్తి పేరు లేదు. కవర్ మీద ఫ్రం అడ్రసు లేదు. ఏ వీధిలో పోస్టయిందీ చూద్దామా అంటే నడిబజార్లో మెయిన్ పోస్టాఫీసు దగ్గర పోస్టయింది.

ఉత్తరం పోస్టుచేసిన వ్యక్తీ, డాక్టరింటికి కబురు చెప్పిన వ్యక్తీ ఒకరే అయుండొచ్చని చంద్రకాంత్ అనుమానించాడు. వాచ్‌మన్ చెప్పిన ప్రకారం ఆ వ్యక్తి హైస్కూలు కుర్రాడు. ఆ హైస్కూలు కుర్రాళ్ళంతా వాచ్‌మన్‌కి బాగా తెలుసు. ఎందుకంటే వారానికి మూడు రోజులు, రోజుకు మూడుగంటల చొప్పున ఆ డాక్టరు హైస్కూల్లో ఉంటాడు. వాచ్‌మన్ డాక్టరు గదిబైట కూర్చుని ఒకరొకరినే లోపలకు పంపిస్తాడు. డాక్టరంటే కుర్రాళ్ళకు చాలా యిష్టం. ఎంత చిన్న కంప్లయింటున్నా సరే వాళ్ళు డాక్టర్ని కలుస్తూంటారు. ఆ హైస్కూల్లో చక్కగా అమలుజరుగుతున్న వైద్యసదుపాయమది.

వాచ్‌మన్ వయసు మళ్ళింది. రాత్రిపూట కళ్ళంత బాగా కనిపించవు. రాత్రి తన్ను పలకరించినది ఫలానా హైస్కూలు కుర్రాడని చెప్పగలిగాడు కానీ ఫలానా కుర్రాడని చెప్పలేకపోయాడు. ఎంత తరచి అడిగినా వాచ్‌మన్ తను చెబుతున్నదానికి అదనంగా సమాచార మివ్వలేక పోయాడు.

ఏమైతేనేం చంద్రకాంత్‌కి కొంత ఆధారం దొరికింది. తనక్కావలసిన వ్యక్తి ఆ హైస్కూల్లో ఉన్నాడు. అతడి నెలా గుర్తించడం?

తన దగ్గరున్న ఉత్తరంలో దస్తూరీని బట్టి ఆ కుర్రాణ్ని గుర్తించాలనుకున్నాడు చంద్రకాంత్. కానీ ఆ కుర్రాడీ విషయంలో చాలా తెలివిగా వ్యవహరించాడు. దస్తూరీ కావాలని పెద్ద అక్షరాలు టింకర వంకరగా వ్రాసి నట్లుంది. ఆ ఉత్తరం ఆధారంతో ఓ హైస్కూలు కుర్రా డినిపట్టాలనుకుంటే—గడ్డిమేట్లో సూదికోసం వెతకడమే అవుతుంది.

ఆఖరిమార్గంగా చంద్రకాంత్ విద్యార్థుల్ని ప్రభావితం చేయాలనుకుని—ఆ హైస్కూల్లో ఓ ఫంక్షన్ ఏర్పాటు చేయించి ముఖ్య అతిథిగా వెళ్ళాడు. ఆవేశంగా ఉపన్యాస మిచ్చాడు.

చంద్రకాంత్‌కు కరతాళ ధ్వనులు వినబడడంలేదు. అతడి కళ్ళు ఆత్రుతగా తన ముందున్న విద్యార్థుల్ని పరీ క్షిస్తున్నాయి. వారిలోనే తనక్కావలసిన ఆ కుర్రా డున్నాడు. అతడు తన ఉపన్యాసానికి ప్రభావితుడయ్యాడా? లేచి ముందుకు వచ్చి సాక్ష్యం చెబుతాడా?

చంద్రకాంత్ చూస్తూనే ఉన్నాడు. ఎవరూ ముందుకు రాలేదు.

వేదికపై తంతు ముగిసింది.

తరువాత వినోద కార్యక్రమాలు....

సాధారణంగా చంద్రకాంత్ వినోద కార్యక్రమాలు చూడడు. కానీ ఈరోజతడికి ఆశగా ఉంది. ఆ కుర్రా డేదో సమయంలో తనవద్దకు వస్తాడు. తనకు సహకరించ డానికి సిద్ధపడతాడు. అందుకని కాసేపు తనిక్కడే

ఉండాలి. తన్ను చూస్తున్నంతసేపూ అతడు ప్రభావితు డౌతూనే ఉంటాడు.

ముందుగా ఫ్యాన్సీ డ్రస్సయింది. ఒక్కటీ చంద్ర కాంత్ బుర్రలోకి ఎక్కలేదు. తర్వాత వరుసగా కొందరు పాటలు పాడారు. చంద్రకాంత్ ఒక్క పాట కూడా విన లేదు. ఆ తర్వాత నాట్యప్రదర్శన. అదో పావుగంట ఉంటుందనీ తర్వాత అరగంట నిడివి నాటకం ఉంటుం దనీ వేదిః మీద ప్రకటించడం జరిగింది.

నాట్యం ప్రారంభమయ్యేసరికి చంద్రకాంత్‌లో అస హనం ప్రారంభమయింది. టైమైపోతోంది. ఎవరూ రావడంలేదు.

చంద్రకాంత్ తన పక్కనే ఉన్న హెడ్మాస్టరు వంక చూసి నెమ్మదిగా "బాత్రూం ఎక్కడః?" అన్నాడు.

"రండి చూపిస్తాను" అంటూ హెడ్మాస్టరు లేవ బోయాడు.

"నాకు దారి చూపించండి చాలు—మీరు రావొద్దు-" అన్నాడు చంద్రకాంత్..

హెడ్మాస్టరతడికి దారి వివరించాడు.

చంద్రకాంత్ ఆడిటోరియంలోంచి బయటకు వచ్చాడు కానీ బాత్రూంలోకి వెళ్ళలేదు. ఇంకా బయటకువచ్చి చుట్టూ చూశాడు.

అక్కడ పార్కులాంటి చిన్న పూదోట ఉంది.

చంద్రకాంత్ అందులోకి నడిచాడు.

ఈ ఉపాయం ముందుగానే తనకు స్ఫురించనందు కతడు తన్ను తనే నిందించుకున్నాడు.

తన కళ్ళెదుట హత్యజరగడం చూసిన పసివాడు, హంతకులకు భయపడుతున్న హైస్కూలు విద్యార్థి—

ఎంతో కొంత ధైర్యం తెచ్చుకుని తన గురించి తెలియ నివ్వకుండా విషయం తెలియబరుస్తూ ఉత్తరం రాశాడు. అతడి ధైర్యాన్నభినందించడానికి బదులతడి ఉనికిని బైట పెట్టాలని చూస్తున్నాడు తను. ఈరోజాకుర్రాడు తన ఉప న్యాసానికి ప్రభావితుడై ఉంటాడు. కానీ పదిమందిలో ఎందుకు బైటపడతాడు? తనను ఏకాంతంగా ఇలాంటి చోట కలుసుకోవాలనుకుంటాడు. అతడి కిలాంటి అవ కాశం తనూ ఇవ్వాలిగా!

చంద్రకాంత్ అటూ యిటూ పచార్లు చేస్తూండగా వెనుకనుంచి—"సర్!" అన్న పిలుపు వినబడి వెనక్కు తిరిగాడు.

అతడి కళ్ళు మెరిశాయి.

ఓ కుర్రాడు ...

"నాపేరు ప్రభాకరం సర్....నైన్తుక్లాసు చదువు తున్నాను. మీతో ఓ ముఖ్యవిషయం చెప్పాలని వచ్చాను సర్...." అన్నాడతడు.

"నేను నీకోసమే వచ్చాను...." అన్నాడు చంద్ర కాంత్.

"మీరు నాకోసమా....? నేను మీకెలా తెలుసును...." ఆశ్చర్యంగా అడిగా డా కుర్రాడు.

"కానిస్టేబుల్ మహేష్ హత్యను నువ్వు కళ్ళారా చూశావు. అవునా?"

"మహేష్ ఎవరు సార్? నాకు తెలియదు...." అన్నా డా కుర్రాడు.

చంద్రకాంత్ తడబడి - "నువ్వు నాకు చెప్పాలనుకుం టున్న విశేష మేమిటి?" అన్నాడు.

"మీకు కిళ్ళీకొట్టు రంగయ్య తెలుసుకదూ సర్...."

"రంగయ్యెవరు?"

"ఓహ్ - మీరు కొత్తగా ఈ ఊరొచ్చారా?"

"అంటే?" అన్నాడు చంద్రకాంత్.

"రంగయ్య పోయి ఏణ్ణర్థమయింది సర్...."

"నే నీ ఊరొచ్చి ఎనిమిది నెలలయింది. అయినా బ్రతికున్న కిళ్ళీకొట్టువాళ్ళు కూడా నాకింకా ఎవరూ పరిచయం కాలేదు...." అన్నాడు చంద్రకాంత్.

"రంగయ్య విషయం వేరు సర్.... అతడు మాయమైనట్లు పోలీసు కంప్లయింటుంది. ఇంతవరకూ దొరకలేదు."

"అయితే?"

"రంగయ్య మాయం కాలేదు సర్....హత్య చేయబడ్డాడు."

"నీ కెలా తెలుసు?"

"ఆ హత్య నేను కళ్ళారా చూశాను సర్...."

చంద్రకాంత్ ఉలిక్కిపడి-"అంతా వివరంగా చెప్పు" అన్నాడు.

ప్రభాకరం చెప్పడం ప్రారంభించాడు.

*　　*　　*

రంగయ్యకు చిన్నపిల్లలంటే చాలా యిష్టం. వాళ్ళలో ప్రభాకరం అంటే మరింత యిష్టం. ప్రభాకరం తరచుగా రంగయ్య కొట్లోనే చాక్లెట్లు కొంటాడు.

రంగయ్య యువకుడు. చురుకయినవాడు. నీతిపీ, నిజాయితీనీ నమ్ముకుని వ్యాపారం చేస్తున్నాడు. అతడి సంపాదన బాగుంది.

చావడానికి ఆర్నెల్లకు ముందు రంగయ్యకు పెళ్ళయింది. రంగయ్య భార్య చాలా అందంగా ఉంటుంది.

వెళ్ళయ్యాక రంగయ్య ఒక రోజున ప్రభాకరాన్ని తనింటికి పిలిచి టిఫిన్ పెట్టాడు. అప్పుడు ప్రభాకరం రంగయ్య భార్యను చూశాడు.

చనిపోయేరోజు సాయంత్రం రంగయ్య విచారంగా ఉండడం గమనించాడు ప్రభాకరం. కారణ మడిగాడు.

"గొప్పవాళ్ళమనే వాళ్ళకి నీతీ జాతీ లేవు." అన్నాడు రంగయ్య. ప్రభాకరాని కర్థం కాలేదు. రంగయ్య వివరించాడు.

రజనీకాంత్ వ్యాపారస్థుడు. పలుకుబడి వున్నవాడు. అండర్‌గ్రౌండ్ వ్యవహారాల్లో రంగయ్య కిళ్ళీకొట్టు సాయం కావాలొచ్చి అడిగితే రంగయ్య నిరాకరించాడు. కిళ్ళీకొట్టు పెట్టుకునే ముందు రజనీకాంత్ రంగయ్య నిలదొక్కుకునేందుకు అయిదు వంద లిచ్చి ఆదుకున్నాడు. రజనీకాంత్ అంటే రంగయ్యకు గౌరవం, కృతజ్ఞత ఉన్నాయి.

"నాకు చేతనయిన పని ఏదైనా చెప్పండి, చేస్తాను. చేతకాని పనులు మాత్రం చెప్పొద్దు బాబూ" అన్నాడు రంగయ్య ఆయనతో వినయంగా.

రజనీకాంత్ ఇంట్లో ఏదో శుభకార్యం జరుగుతోంది. సాయానికి రంగయ్య భార్యను పంపమని అడిగాడు రజనీకాంత్. రంగయ్య పంపాడు. రెండు రోజులయింది. ఆమె వెనక్కు రాలేదు. రంగయ్య కంగారుపడి ఆ రోజు ఉదయమే రజనీకాంత్ ఇంటికి వెళ్లాడు.

"నిన్ననే పంపేశానే - ఇంకా ఇంటికి రాలేదా?" అన్నాడు రజనీకాంత్.

"లేదు బాబూ ...." అన్నాడు రంగయ్య కంగారుగా.

"రాజును చూసిన కళ్లతో మొగుడ్ని చూస్తే మొత్త

బుద్ధయిందిట. అది నేనంటే మోజుపడుతోందిరా. దాని వద్ద మా గెస్ట్‌హౌస్ తాళా లున్నాయి. తిన్నగా అక్కడికి పోయి మకాం పెట్టిందేమో!" అన్నాడు రజనీకాంత్.

రంగయ్య కళ్ళెర్రబడ్డాయి. ఆవేశంతో మాట రాలేదతడికి.

"ఆవేశపడకురా! నా మాట విను - నా పనులకు నీ కిళ్ళీకొట్టుపయోగించుకోనీ! అప్పుడు నీ పెళ్ళాం నువ్వంటే నామీద పడుతున్నంత మోజూ పడుతుంది" అన్నాడు రజనీకాంత్.

రంగయ్య తన్ను తాను తమాయించుకుని - "ఆ మాట దాని నోటమ్మట విన్నాక నేనాలోచించి ఏ విషయం చెబుతాను...." అన్నాడు.

"అయితే రాత్రి తొమ్మిదింటికి కిళ్ళీకొట్టు కట్టేసుకుని గెస్ట్‌హౌస్‌కి రా...." అన్నాడు రజనీకాంత్.

రంగయ్య ఇప్పు డా విషయమే ఆలోచిస్తున్నాడు.

ప్రభాకరానికి రంగయ్య సమస్యేమిటో అర్థం కాలేదు- "నీ భార్యకు నువ్వంటే ఇష్టం లేకపోతే నువ్వింకో పెళ్ళి చేసుకో. హాయిగా ఉండు" అన్నాడు.

"అది కాదు ప్రభాకరం - ఆయన బలవంతంగా నా భార్యను గెస్టుహౌస్‌లో బంధించాడు. దాన్నెలాగయినా విడిపించాలి...."

"పోలీసు రిపోర్టివ్వచ్చుగా...."

"ఇచ్చాను. ఇనస్పెక్టర్ కుమార్ రజనీకాంత్ గెస్టు హౌసుకి వెళ్ళి వచ్చాడు. నాభార్య అక్కడే ఉందిట. నన్ను తిడుతోందిట. నాకు భయపడి గెస్టుహౌస్‌లో దాక్కున్నానని. రజనీకాంత్ దగ్గిరే తనకు రక్షణ ఉన్నదనీ, ఆ గెస్టుహౌస్‌లో వంట మనిషిగా తానుండిపోతాననీ

అన్నదిట...."

ప్రకారం ఆమెతో రంగయ్యను కట్టీ అయిపొమ్మ న్నాడు.

"నా భార్య చాలా మంచిది. దానికి నేనంటే చెప్ప లేనంతిష్టం. నగలమీదా, చీరలమీదా, డబ్బుమీదా దానికి మోజులేదు. ఏదో నాటకం జరుగుతోంది. అదేంటో తెలుసుకోవాలి. అందుకు నువ్వు సాయం చేయగలవా?"

"నేనేం చేయగలను?"

"రాత్రి తొమ్మిదింటికి నన్ను గెస్టుహౌసుకి రమ్మ న్నాడు రజనీకాంత్. నేను వెడతాను. ఆయన గురించిన ఆయుప్పపట్లు కొన్ని నాకు తెలుసు. ఈ ఊళ్ళో రెండు కిళ్ళీకొట్ల నాయన స్మగ్లింగ్ కుపయోగించుకుంటున్నాడు. వాళ్ళిద్దరూ నాకు స్నేహితులు. వాళ్ళ ద్వారా ఆయన రహస్యాలు కొన్ని నాకు తెలుసు. అవి చెప్పి బెదిరించి నా భార్యను నేను వెనక్కు తెచ్చుకుంటాను. మళ్ళీ తప్పు చేస్తే నా భార్య ఆయనపై పోలీసు కంప్లయింటు యిస్తుంది...."

"మరి నీ భార్య పోలీసులతో నువ్వంటే యిష్టంలేదని చెప్పింది...."

"అదా! ఆ రజనీకాంత్ దాన్ని భయపెట్టి ఉంటాడు... అవన్నీ ఈ రాత్రికి తేలిపోతాయిగా...."

"ఇందులో నేను చేయాల్సిన దేముంది?"

"పెద్దవాళ్ళతో వ్యవహారం....జాగ్రత్తగా ఉండాలి. అక్కడ నా కోసం ఎలాంటి ప్రమాదం పొంచి వుందో తెలియదు. నేను వెళ్ళిన కాసేపటికి అంటే ఓ పావుగంట తర్వాత నువ్వు ఆ గెస్ట్‌హౌస్‌లో ప్రవేశించి రహస్యంగా అక్కడేం జరిగిందో గమనించాలి...." అన్నాడు

రంగయ్య.

ప్రభాకరానికి సాహసకార్యా లంటే చాలా సరదా. ఇంట్లో కంబైండు స్టడీస్ పేరు చెప్పి అతడు రంగయ్యకు సాయం చేయాలనుకున్నాడు.

రంగయ్య అతడికో పాకెట్ టేపురికార్డరిచ్చి "వీలున్నప్పుడల్లా విశేషాలు రికార్డు చేయి....." అని చెప్పాడు.

ఆ రాత్రి ప్రభాకరం పాకెట్ టేపురికార్డరు తీసుకుని రజనీకాంత్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాడు. రహస్యంగా అందులో ప్రవేశించడం అతడికి కష్టం కాలేదు. గేటు వద్ద కాపలా వాడు లేడు.

లోపల ఓ గదిలో రజనీకాంత్, రంగయ్య, రంగయ్య భార్యా ఉన్నారు.

రజనీకాంత్ కాసేపు మాటల్లో ఘర్షణపడ్డారు. రంగయ్య తనకు ప్రమాదకారిగా మారుతున్నాడని గ్రహించి రజనీకాంత్ రివాల్వర్‌తో రంగయ్యను కాల్చి చంపాడు.

జరిగిన హత్యాకాండ చూసి రంగయ్య భార్య వణికిపోయింది. రజనీకాంత్ ఆమెతో - "నిన్ను వేశ్యాగృహాని కమ్మేస్తే నీ బ్రతుకు నరకమవుతుంది. నా మాట వింటే నువ్వు గౌరవంగా బ్రతకొచ్చు. ఇప్పుడు మనమిద్దరం కలిసి ఈ శవాన్ని లోపల పాతిపెట్టేద్దాం. రంగయ్య తమ్ముడు ప్రసాద్ నిన్ను పెళ్ళి చేసుకుంటాడు. కిళ్ళీకొట్టు కూడా వాడికే చెందుతుంది. నువ్వు, కిళ్ళీకొట్టు అవసరాన్నిబట్టి నాకుపయోగపడుతూంటారు. రేపు ఉదయమే నువ్వు రంగయ్య కనబడ్డం లేదని పోలీసు రిపోర్టియ్యి" అన్నాడు.

తర్వాత వాళ్ళిద్దరూ శవాన్ని లోపల పూడ్చి పెట్టారు. రంగయ్య భార్య రజనీకాంత్ ఎలా చెబితే అలా వింది.

మొత్తం దృశ్యాన్ని ప్రభాకరం చూశాడు. కొన్ని కీలక సంభాషణలను రికార్డు కూడా చేశాడు. అతడక్కడుంటాడని రజనీకాంత్ ఊహించలేదు.

ప్రభాకరం ఒక వారం రోజులపాటు మౌనంగా ఉన్నాడు. ఈ వారంరోజుల్లోనూ కిళ్ళీకొట్టు ప్రసాద్ దయింది. రంగయ్య జాడ తెలియక పోలీసులు ప్రయత్నిస్తున్నారు. రజనీకాంత్ పలుకుబడివల్ల రంగయ్య ఏదో నేరం చేసి పరారీలో ఉన్నట్లు ప్రచారం కూడా వచ్చింది.

ఇక ప్రభాకరం ఊరుకోలేకపోయాడు. విషయం ఇంట్లో తండ్రికి చెప్పాడు. తండ్రి అతణ్ణి మెచ్చుకుని "నువ్వే స్వయంగా పోలీసులకి అంతా చెప్పు. నీకు పేరు కూడా వస్తుంది" అన్నాడు.

ప్రభాకరం ఎంతో ఉత్సాహపడ్డాడు.

*　　　　*　　　　*

"ఈ విషయం చెప్పడానికి నీకేణ్ణర్థం పట్టిందా?" అన్నాడు చంద్రకాంత్.

"లేదు సార్.... నేను ముందుగా ఇన్‌స్పెక్టర్ కుమార్‌కి ఫిర్యాదు చేశాను.... ఆయన నేనిచ్చిన టేపు రికార్డర్నీ, కాసెట్‌నీ నా కళ్ళ ముందే ధ్వంసం చేసి పొమ్మన్నాడు. ఆయన బాగా లంచాలు తింటాడని పేరు సర్. రజనీకాంత్ బాగా లంచాలివ్వగలడు సార్...."

"తర్వాతేం చేశావ్?"

"మళ్ళీ మరో ఇన్‌స్పెక్టర్ దగ్గరకు వెడితే పాతిపెట్టిన శవం కూడా మాయం చేస్తాడని భయమేసి ఊరుకుండిపోయాను సర్! ఈ రోజు మీ ఉపన్యాసం వింటూంటే మీవల్ల పని జరుగుతుందనిపించింది. అందుకే

మీకు విషయం చెబుతున్నాను సర్ ...."

చంద్రకాంత్ ప్రభాకరం వంక మెప్పుకోలుగా చూసి - "నీ నమ్మకాన్ని నేను వమ్ము చేయను. థాంక్స్ ఫర్ ది ఇన్ఫర్మేషన్ ...." అన్నాడు.

"సర్ ....రజనీకాంత్ గెస్ట్‌హౌసులో - రెండే రెండు నల్ల గులాబీ మొక్కలున్నాయి. వాటి కింద తవ్వితే మీకు రంగయ్య శవం దొరుకుతుంది. శవాన్ని గుర్తుపట్టడానికి వాచీ చాలు సార్! నా చేతికున్న ఈ వాచీలాంటిదే రంగయ్యకీ ఉంది. చూడండి సార్ ....నా వాచీ చెయిన్ మీద ఎ ప్రభాకరం అని పేరుంది. రంగయ్య వాచీమీద టి. రంగయ్య అని పేరుంది...." అంటూ ప్రభాకరం తన వాచీ చూపించాడు. చంద్రకాంత్ వాచీని శ్రద్ధగా పరిశీలించి - "థాంక్స్-ప్రస్తుతానికి సమాచారం చాలు" అన్నాడు.

"సర్ - నిజంగా మీ రీ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తారా?" అన్నాడు ప్రభాకరం జాలిగా, ఆశగా, బాధగా.

"ఏం? నామీద నీకు అపనమ్మకంగా ఉందా?"

"ఏం చెప్పనుసార్? హత్య జరిగిన వారం రోజుల కసలు సంగతి చెబితేనే__పోలీసులు లెక్కచేయలేదు. ఏణ్ణర్ధంతర్వాత చెబుతున్నాను - లెక్కచేస్తారా అని సందేహంగా ఉంది ...."

"అలాంటనుమానాలేం పెట్టుకోకు. నీకు నేను బ్రేవరీ అవార్డు కూడా ఇప్పిస్తాను" అన్నాడు చంద్రకాత్.

ప్రభాకరం ఇంకా ఏదో అనబోతూండగా__ "మీ రిక్కడున్నారా ఇన్‌స్పెక్టరుగారూ!" అన్న హెడ్మాస్టరు గారి మాట వినబడింది.

ప్రభాకరం చటుక్కున పొదలచాటుకు వెళ్ళిపోయాడు.

చంద్రకాంత్ వెనక్కి తిరిగి—"లోపల ఉక్కగా అని పించి ఈతోటలోకి వచ్చాను...." అన్నాడు.

"నాటకం అయిపోవచ్చింది. ఇంతసేపు మీరు బాత్రూంలో ఏం చేస్తున్నారా అని అనుమానం వచ్చి నేనూ బయటకు వచ్చాను........"

చంద్రకాంత్ ఆయన మాటలు వినడంలేదు.

2

ముందుగా చంద్రకాంత్ కిళ్ళీకొట్టు ప్రసాద్‌ని కలుసుకొని కొన్ని ప్రశ్నలు వేశాడు. రజనీకాంత్‌కీ అతడికీ సంబంధమున్నట్లు బయటపడింది. తర్వాత ప్రసాద్ ఇంటి కెళ్ళాడు.

ప్రసాద్ భార్య నిజంగా చాలా అందమైనది.

ఆమె జీవితం వైభవంగానే ఉంది. చిన్న డాబాయిల్లు. ఇంట్లో అన్ని హంగులూ ఉన్నాయి. వాళ్ళకి కలర్ టీవీ కూడా ఉంది.

ప్రసాద్ భార్య పోలీసినస్పెక్టర్ని చూసి కంగారు పడింది.

"కంగారేంలేదు. స్నేహపూర్వంగానే వచ్చాను. కిళ్ళీకొట్టు పెట్టుకున్నవాళ్ళు నాకంటే వైభవంగా జీవిస్తున్నారని ఎవరో చెబితే మీయిల్లు చూడాలని వచ్చాను—" అన్నాడు చంద్రకాంత్ నవ్వుతూ.

ఆమె కంగారుగా - "ఈరోజుల్లో కిళ్లీకొట్టుకు మించిన బిజినెస్ లేదుబాబూ! న్యాయంగా పోయినా రోజుకు రెండొందలు లాభం కళ్ళజూడొచ్చు—" అంది.

"అవును. అదే రెండుకళ్ళారా చూస్తున్నాను...." అన్నాడు చంద్రకాంత్.

"కాఫీ పుచ్చుకుంటారా, టీ పుచ్చుకుంటారా?"

అందామె.

"రెండూ తాగను. కానీ నాకు నిన్నెక్కడో చూసిన ట్లనిపిస్తోంది........"

"నన్నా - నన్నెప్పుడు చూశారు బాబూ........"

"ఆఁ గుర్తుకొచ్చింది మా యింట్లో నీ ఫోటో ఉంది...."

ప్రసాద్ భార్య ఇంకా కంగారుపడి - "నా ఫోటో మీ కెక్కడది బాబూ! నేను ఫోటో తీయించుకున్నదే తక్కువ" అంది.

"నా మిత్రుడొక్కడు కిళ్లీకొట్టు పెట్టాడు. నేను విజయవాడలో ఉండగా అతగాడి పెళ్ళయింది. తన పెళ్ళి ఫోటో పంపించాడు. అందులో ఉన్నావు నువ్వు...."

"ప్రసాద్ మీస్నేహితుడా బాబూ!"

"కాదు........"

"మీ మిత్రుడి పెళ్లికి నేను వెళ్ళానంటారా?"

"అది గ్రూప్‌ఫోటో కాదు. భార్యాభర్తలిద్దరే ఉన్నారు. భర్త నా మిత్రుడు. భార్య నువ్వు........"

"ఎవరు బాబూ మీ మిత్రుడు?" అందామె.

"అతడిపేరు రంగయ్య—"

ఉలిక్కిపడిందామె.

"రంగయ్య నెందు కొదిలేశావ్?"

"నేను వాడణ్నొదిల్లేదు బాబూ - వాడే నన్నొదిలేశాడు. ఏణ్ణర్థంనుంచి ఏమయ్యాడో తెలియదు. వాడి తమ్ముడు ప్రసాద్ అండలో ఉంటున్నాను. నలుగురూ మాగురించి ఆమాటా ఈమాటా అనుకుంటున్నారని తెలిసి ప్రసాద్ నన్ను మళ్లీ పెళ్ళి చేసుకున్నాడు. రంగయ్యెక్కడున్నాడో చెప్పండి బాబూ—వాడిదగ్గిర కే వెళ్ళిపోతాను." అందామె.

"వాడిదగ్గర కెళ్ళాలంటే నేల తవ్వాలి. ఎక్కడ తవ్వాలో నీకు తెలుసు...."

"ఏంటి బాబూ మీరనేది?"

"మా పోలీసు బలగం రజనీకాంత్ గెస్టుహౌసుకు వెళ్ళింది. శవం దొరకగానే ఇక్కడికి కబురొస్తుంది. గుర్తుపట్టడానికి నువ్వు నాతో బయల్దేరి రావాలి...."

ఆమె బాగా కంగారుపడింది. చంద్రకాంత్ ఆమెని బెదిరించి నిజం కక్కించేడు. ప్రభాకరం చెప్పిన కథ నంతా ఆమె తన నోటితో మళ్ళీ చెప్పి—"ఈ కథ మీదాకా ఎలా వచ్చింది బాబూ!" అనడిగిందాశ్చర్యంగా.

"నీవంటి పాపాత్ములకి ఏదో ఒకరోజున పాపం పండక తప్పదు. అలాంటి రోజున గోడలకు చెవు లొస్తాయి. గాలికి నోరొస్తుంది—" అన్నాడు చంద్ర కాంత్.

ఆమె తమాయించుకుంది-"బాబూ! నన్ను పాపాత్మురా లనవద్దు. నాకు తెలిసి నేనే పాపమూ చేయలేదు. కావాలని నేనే నేరమూ చేయలేదు...."

"రజనీకాంత్‌వంటి దుర్మార్గుడితో చేయికలిపి కట్టు కున్న భర్తనే తుదముట్టించి మరిదితో కులుకుతున్నావు. నువ్వు పాపాత్మురాలివికాదా!" అన్నాడు చంద్రకాంత్.

"బాబూ! నేను రంగయ్యను పెళ్ళిచేసుకున్నాను. వాడితోటే నా జీవితమనుకున్నాను. నాకేమీ పెద్ద పెద్ద కోరికలు లేవు. ఆశలులేవు. రజనీకాంత్ బాబు దగ్గరికి నేను వెళ్ళలేదు. రంగయ్యే పంపాడు. ఆ బాబు నా అందం చూసి పిచ్చెక్కిపోయాడు. తప్పని చెప్పినా వినలేదు. పిస్టల్ చూపించి చెయ్యిపట్టుకున్నాడు. ప్రాణం కాపాడుకోడానికి మించిన నీతి మరోటుందని నాకు

తెలియదు. రంగయ్య పోలీసు రిపోర్టిచ్చాడు. పోలీసు నన్నే బెదిరించి వెళ్ళాడు. భయపడిపోయాను. ఆ రజనీకాంత్ బాబు ఏం చెబితే అది చేయడానికి ఒప్పుకున్నాను....''

''స్వార్థపరులు, పాపాత్ములు సాధారణంగా చెప్పే కుంటిసాకులే యివి....మనిషి గొప్పతనం స్వార్థాన్నెదిరించడంలో ఉంది. ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడే ధైర్య ప్రదర్శనలో వుంది....''

''అలాంటి వాళ్ళెక్కడో గానీ వుండరు....''

''ఎందుకుండరు? నీ పచ్చకామెర్ల కళ్ళను పక్కన బెట్టి నా కళ్ళతో చూడు ప్రపంచాన్ని. ఎటుచూసినా సాహసవంతులు. త్యాగధనులు కనబడతారు....''

అదోలా నవ్విందామె—''బాబూ! అదే నిజమైతే ఆ రజనీకాంత్ బాబూ, అలాంటివాళ్ళూ చేస్తున్న నేరాలూ, ఘోరాలూ అందరికీ తెలుసు. అలాంటప్పుడు నేరస్థుల్ని పట్టుకునే ఉద్యోగం చేస్తున్న మీవంటి పోలీసు లా బాబులెందు కరెస్టుచేయరు? జైల్లో వేయరు?''

''అందుకు సాక్ష్యాలు కావాలి....''

''సాక్ష్యాల్దొరికేదాకా నేరస్తులని తెలిసీ మీరు వాళ్ళకి సలాములు కొడతారు. మీ సలాములు చూసి సాక్ష్యాలివ్వడానికి మావంటి సామాన్యులు హడిలిచస్తారు. ఎందుకు బాబూ—మీకూ మీకూ మధ్య మావంటి సామాన్యుల్నిరికించి నలిపి చంపాలని చూస్తారు? పెద్దవాళ్ళు నేరాలు రహస్యంగా చేయడంలేదు. ఆ విషయం మీకు తెలుసు. కాదని ఒక్కసారి అనండి....'' అందామె.

చంద్రకాంత్ ఏదో అనబోయేలోగా రజనీకాంత్ గెస్ట్ హౌస్‌నుంచి కబురు వచ్చింది—''శవం దొరికింది సార్

బాగా పాడై పోయింది. చేతికి వాచీ మాత్రం స్పష్టంగా తెలుస్తోంది....''

చంద్రకాంత్‌కి ప్రభాకరం మాటలు గుర్తుకొచ్చాయి. రంగయ్యను గుర్తుపట్టడానికి వాచీ ఒక మంచి ఆధారం.

"రండి బాబూ! మీరు నిజంగా ఆ రజనీకాంత్‌కు శిక్ష పడేలా చేస్తానంటే నాకంటే సంతోషించే మనిషి వేరే వుండదు. మా ధైర్యం మా ప్రాణాలు తీస్తుందని భయపడి ఊరుకుంటే మా అసహాయతకు మీరు స్వార్థం అని పేరు పెడతారు. ఆ స్వార్థాన్ని ప్రోత్సహిస్తున్నది మీవంటి పోలీసులేనని గ్రహించరు. ఒప్పుకోరు. రండి బాబూ....నా డ్యూటీ నేను చేస్తాను. మీరేం చేస్తారో చూస్తాను....'' అందామె.

పోలీసు జీపులో చంద్రకాంత్, ప్రసాద్ భార్య రజనీ కాంత్ గెస్ట్ హోస్‌కి వెళ్ళారు. అక్కడ చాలా పోలీసు బలగముంది. అంతా హడావుడిగా వుందక్కడ.

రెండు నల్లగులాబీల కింద దొరికిన శవం సుమారు పద్నాలుగేళ్ళ వయసు బాలుడిది. అతడి చేతికి వున్న వాచీ గొలుసుమీద ప్రభాకరం అన్న పేరుంది

షాక్ తిన్నాడు చంద్రకాంత్.

ఈలోగా—''శవాన్ని పాతిందకడ కాదు-'' అంది ప్రసాద్ భార్య.

ఆమె చూపిన ప్రాంతంలో తవ్వగా మరో శవం దొరికింది. ఆ శవం చేతికి రంగయ్య పేరుగల గొలుసుతో వాచీ వుంది.

ఆ తర్వాత - రజనీకాంత్‌ను అరెస్ట్ చేయటం— అతను తన నేరాలన్నీ అంగీకరించటం జరిగిపోయింది.

*　　*　　*

తన ఉపన్యాసానికి ప్రభావితుడై హైస్కూల్లో కన బడిన ప్రభాకరం సుమారు ఏణ్ణర్థం క్రితం మాయమై శవంగా మారిపోయాడన్న నిజం మాత్రం చంద్రకాంత్‌ని అయోమయావస్థలో పడేసింది.

శవంగామారి భూస్థాపితమైన ప్రభాకరం ఆ తర్వాత తనకెలా కనిపించాడు? తను భ్రమపడ్డాడా అనుకుంటే ప్రభాకరం నోట విన్నవన్నీ నిజాలే అయ్యాయి. అంటే ప్రభాకరం ఆత్మ ఓ మంచి పోలీసాఫీసరు కోసం అన్వేషిస్తోందా?

ప్రభాకరం విషయం ఎలాగున్నా — కానిస్టేబుల్ మహేష్ హత్యలో — సాక్షికోసం మాత్రం చంద్రకాంత్ మరి అన్వేషించదల్చుకోలేదు. □

కన్నపు చూపు?



సీరియల్

నగరంలో నేరగాళ్ళు

ప్రతాప రవిశంకర్ 8

(గత సంచిక తరువాయి)

పది గంటలు దాటి ఐదు నిముషా లయ్యింది.

అతడి చేతిలో ప్యాకెట్టు వుంది.

అందులో డబ్బు వుంది.

ఆ డబ్బును అతడు మేనేజర్ కివ్వటానికి తీసుకు వచ్చాడు.

టెంపుల్ స్ట్రీట్ లోకి అడుగు పెట్టాడు.

అక్కడక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. ఇద్దరు మనుషులు ఉర్దూలో మాట్లాడుకుంటూ అతడికి ఎదురు వచ్చారు. దూరంగా రోడ్డుచివర వున్న దేవాలయాలు కనపడుతున్నాయి.

బూట్ల చప్పుడు స్పష్టంగా వినపడుతోంది.

వినాయక్ కళ్ళకు ఒక ఇరుకు సందు కార్నర్లో స్ట్రీట్ లైటు నీడలో నిలబడి వున్న మేనేజర్ కనపడ్డాడు. అతడి పక్కనే గోడవారగా స్కూటరు వుంది.

"ప్రింటు తెచ్చావా?" అడిగాడు వినాయక్ అతడి దగ్గరకు వెళ్ళి.

మందు వాసన తగిలి "బాగా మందు కొట్టినట్టున్నారు" అన్నాడు మేనేజర్.

"షటప్....అనవసరంగా మాట్లాడకు....ప్రింటు తీసుకొచ్చావా?"

"డబ్బు."

ప్యాకెట్ చూపించాడు.

ప్రింటును బయటకు తీశాడు మేనేజర్. దాన్ని వినాయక్‌కు ఇచ్చి డబ్బు ప్యాకెట్టును తీసుకున్నాడు. అక్కడే ప్యాడదీసి చూసుకుని "థాంక్యు ఫ్రెండ్" అన్నాడు మేనేజర్.

ప్రింటు కాపీని జేబులో పెట్టుకున్నాడు.

"థాంక్స్ మేనేజర్-నన్ను మోసం చెయ్యనందుకు" అంటూ చేతిని ముందుకు జాపాడు వినాయక్. ముందుకు తూలి మేనేజర్‌ని పట్టుకున్నాడు.

"ఇంకా ప్రింట్లు అవసర మయితే...." అంటున్నప్పుడే అతని మాటలు ఆగిపోయాయి.

చీకట్లో అతను గమనించలేదు.

వినాయక్ జేబులోంచి సైలెన్సర్ అమర్చిన పిస్తోలు తీసి అతడి ఊపిరితిత్తుల పక్కగా రెండుసార్లు కాల్చాడు.

కట్టెలా వెనక్కు పడిపోయాడు మేనేజర్ చీకటిసందులోకి.

పిస్తోలును ప్యాంటు జేబులో పెట్టుకుని పాతిక వేల రూపాయల ప్యాకెట్టును వొంగి తీసుకున్నాడు వినాయక్.

అతడ్ని చంపటం వినాయక్‌కు ఇష్టం లేదు. కాని తన గురించి తెలుసుకున్న మనిషిని ప్రాణాలతో వదల

టానికి అతడికి ఇష్టమనిపించలేదు.

కర్ఫ్యూ విధించినట్టుగా వుంది రోడ్డు.

ఎక్కడో దూరంగా కుక్కలు అరుస్తున్నాయి.

ఒక్కసారి మేనేజర్ శవాన్ని చూశాడు. గుండెల మీదగా నెత్తురు సందులోకి కారుతూ కనపడింది మసక వెలుతురులో.

జాలి పడలేదు వినాయక్.

టెంపుల్ స్ట్రీట్ లో నడవటం మొదలుపెట్టాడు.

6

"మైగాడ్... ఇట్స్ టూమచ్" మళ్ళీ అన్నాడు జైన్ ఎర్రబడిన కళ్ళతో.

"అవును... ఆ బ్రూట్ బ్రతికి వుండటానికి వీల్లేదు. వాడు బతికి వుంటే మనం చచ్చినట్టే లెక్క" అన్నాడు వాడియా గ్లాసులో వున్న విస్కీని గొంతులోకి వంచుకుంటూ.

"వాడి నెత్తురు తాగుతాను.... ఫోన్ చేసి చెప్పినప్పుడు ఎవడో సరదాగా బెదిరించాడనుకున్నాను. కాని ఆ ఫిల్మ్ చూడగానే నా ప్రాణం పోయినట్టయ్యింది" అన్నాడు ధనుంజయ్ సిగరెట్ వెలిగించి పొగ వదులుతూ.

"ఆవేశపడటం కాదు ధనుంజయ్....ఆలోచించాలి. ఇన్నేళ్ళూ మన చట్ట విరుద్ధమైన పనులకు సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా బతుకుతున్నాం. కాని ఈ క్షణంనించీ మన ఫేట్ మారబోతోంది. పాతిక లక్షల దగ్గిర వెనకాడితే వాడు చెప్పినట్టు మనం శాశ్వతంగా జైల్లోనే కూర్చుని చదరంగం ఆడుకోవాలి. చెప్పండి. పాతిక లక్షలకు నేను సిద్ధమయ్యాను. మీ సంగతి చెప్పండి" అన్నాడు జైన్.

"యాభై లక్షలిస్తాను ...నాకు ఆ బాస్టర్డ్ ప్రాణం కావాలి" ఉద్రేక పడుతూ అన్నాడు వాడియా.

"వాడియా ....ముందు ఆ ఫిల్మ్ నెగటివ్ గురించి ఆలోచించండి. వాటిని పోలీసులకు అందించిన క్షణం లోనే మనం జైలు గోడల మధ్యకు విసిరివేయబడతాము. ప్రపంచంలో వున్న ఏ శక్తీ ఆ తర్వాత మనల్ని రక్షించ లేదు. చెప్పండి ....మీ నిర్ణయం ఏమిటి?"

"ఆల్ రైట్ ....పాతిక లక్షలకు నేను రెడీ" అన్నాడు వాడియా.

"నేను కూడా" అన్నాడు ధనుంజయ్ రాజీపడుతు న్నట్టు.

"ఐతే వినండి ....ముందు వాడు అడిగినట్టుగానే డబ్బు ఇచ్చేద్దాం. నెగిటివ్ మన చేతికి వచ్చాక వాడ్ని వేటాడి చంపుదాం ....వాడు బతికి వుండటం నాకూ ఇష్టం కాదు. కాని మనం తొందరపడకూడదు. ఆ నెగిటివ్ వాడికి రక్షణ కవచంలాగా వుపయోగపడుతుంది. మన ప్రాణా లన్నీ అందులోనే వున్నాయి. వాడు మళ్ళీ ఫోన్ చేస్తాడు. డబ్బు ఎట్లా అందజెయ్యమంటాడో చూడాలి" అంటున్నాడు జైన్.

అప్పుడే బల్లమీద చివరగా వున్న ఫోన్ మోగింది.

"వాడే అయ్యుంటాడు" అన్నాడు వాడియా.

"ఫోన్ కాల్ ట్రేస్ చేస్తే" అన్నాడు ధనుంజయ్.

"ప్రయోజనం వుండదు. వాడికి తెలివి బాగానే వుంది" అంటూ రిసీవర్ ఎత్తాడు జైన్.

"హలో జైన్ ....చూసుకున్నారా మీ నేర విన్యా సాలు" అవతల్నించి వినపడింది.

"ఆ ....చాలా బాగా షూట్ చేశావ్ వినాయక్....

కంగ్రాచ్యులేషన్స్."

ఒక్క క్షణం అవతల్నించి ఏమీ వినపడలేదు.

"షాక్ తిన్నావనుకుంటాను వినాయక్....ఇంకా ఎందుకు ఆ వులిపిరి కాయితం....దాన్ని అవతల పారెయ్ చెప్పు... ఎందుకు ఇంత రిస్కు తీసుకుంటున్నావ్?"

"ఏమైనా నువ్వు మేధావివే జైన్... సారీ ఇప్పుడు కూడా నిన్ను బాస్ అని పిలిచే ఆలోచన నాలో లేదు. నన్ను తెలుసుకోలేవని అనుకున్నాను. ఏమంటున్నారు నీ పార్టనర్స్....ఇంకా షాక్ నుంచి బయట పడలేదా?" అడిగాడు వినాయక్.

"నీకు ప్రాణాలమీద ఆశ లేదా వినాయక్?"

"లేదు. నా ప్రాణాల గురించి నేను ఆలోచించటం లేదు. మీరు ప్రాణాలు తీసిన జరీనా గురించి ఆలోచిస్తున్నాను."

"జరిగిందాన్ని గురించి ఆలోచించి ఎందుకు నీ భవిష్యత్తును నరుక్కుంటావ్?"

"వద్దు జైన్....నన్ను మాటలతో నీ దారికి తెచ్చుకునే ప్రయత్నం మానెయ్. నేనేం చెయ్యాలో నాకు తెలుసు. ఇప్పుడయినా పాతిక లక్షల బేరానికి నువ్వు సిద్ధపడ్డటేనా?"

"నే నొక్కడినే యాభై లక్ష లిస్తాను. నిన్ను మాలో ఒక పార్టనర్‌గా చేర్చుకుంటాం. మన మధ్య శత్రుత్వానికి గుడ్‌బై చెప్పు."

"జైన్....నాలో ఓర్పును చంపకు. నీ కండిషన్లు, నువ్వు చూపించే ఆశలు నాలో రగులుతున్న ద్వేషాన్ని చల్లార్చలేవు. ఫలించని ప్రయత్నం చెయ్యకు. ఏదో ఒకటి చెప్పు. కాదంటే ఆ నెగటివ్ ఫిల్మును పోలీసులకి

ఇచ్చేస్తాను. శాశ్వతంగా మిమ్మల్ని జైలు గోడలకు అంకితం చేస్తాను.''

కోపాన్ని గుండెల్లోనే అదిమిపట్టి పైకి నవ్వాడు జైన్.

''ఒక్కొక్కరి దగ్గర పాతికలక్షలు డబ్బు గుంజి నువ్వు ప్రాణాలతో వుండగలననే ధైర్యం వున్నదా నీకు?'' అన్నాడు.

''నా ధైర్యం గురించి మాట్లాడి టైమ్ వేస్ట్ చేస్తున్నావ్ జైన్. ఆల్ రైట్ ....ఆ నెగిటివ్‌ను పోలీసుల దగ్గిరకు చేరుస్తాను.''

మాటలతో వినాయక్ లొంగడని అర్థమైంది జైన్‌కు.

''తొందరపడకు. నువ్వు కోరినట్టే పాతిక లక్షలు ఇవ్వటానికి ఒప్పుకొంటున్నాం. ఆ డబ్బును నీకు ఎట్లా అందజేయాలో నువ్వే చెప్పు.''

వాడియా - ధనుంజయ్ ఆత్రంగా జైన్‌నే చూస్తున్నారు. జైన్ మాటలతో వినాయక్ నిర్ణయం ఏమిటో వాళ్లకు అర్థమయింది. ఆ క్షణాల్లోనే వినాయక్‌ను పట్టుకొని అతడ్ని నరికి ముక్కలు చేయాలనే ఆలోచన రూపుదిద్దుకోటం మొదలయ్యింది.

నేర ప్రపంచానికి చక్రవర్తులయిన తమ దగ్గిర పని చేస్తూ తమ రహస్యాలను ఫిల్ములోకి ఎక్కించి తమనే బ్లాక్‌మెయిల్ చేస్తున్న వినాయక్ వాళ్లదృష్టిలో ధైర్యస్తుడుగా కనపడలేదు. మూర్ఖుడిగా, ఇడియట్‌గా కనపడ్డాడు.

''అరగంట లోపల ఫోన్ చేస్తాను'' అంటూ ఫోన్‌ని పెట్టివేసిన చప్పుడు వినపడింది జైన్‌కు.

వాళ్లవైపు తిరిగి ''వినాయక్ జాగ్రత్త పడుతున్నాడు. ఫోన్‌కాల్‌ని ట్రేస్ చేసి వాడ్ని పట్టుకుంటామని భయపడు

తున్నాడు. అందుకే ఫోన్ పెట్టేశాడు'' అన్నాడు జైన్.

"జరీనాతోపాటు వీడ్నికూడా చంపితే మనకు ఈ రిస్కు వుండేదికాదు'' అన్నాడు వాడియా గ్లాసులోకి ఫారెన్ విస్కీని వొంపుకుంటూ.

"వినాయక్‌ను మనం అనుమానించ లేదు. ఎంతోనమ్మకంగా మనదగ్గిర పనిచేశాడు. ఏ క్షణంలో అనుమానం కలిగినా వాడి శవం బ్లాక్‌హిల్ మీద పడివుండేది'' కోపాన్ని మాటల్లో బయటకు వదులుతూ అన్నాడు ధనుంజయ్.

ముగ్గురూ కొంచెంసేపు మవునంగా వున్నారు.

వాళ్లకు గుండెలనిండా వినాయక్‌ను క్రూరంగా హింసించి చంపాలనే ఆలోచనే నిండిపోయింది.

తనకు అప్పగించిన పనిచెయ్యటంలో జరీనా నిర్లక్ష్యం చూపించింది. జరీనా అజాగ్రత్తవల్ల గ్యాంగ్‌లో ఒక మనిషి పోలీసులకు దొరికిపోయాడు. వాడు నోరు తెరవక ముందే వాడి నోరు మూయించటానికి చాలా రిస్కు తీసుకోవలసి వచ్చింది ఆ ముగ్గురికీ.

అందుకే జరీనాను ఆ ముగ్గురు చక్రవర్తులూ దారుణంగా రేప్ చేశారు. చివరకు ఉరివేశారు, ఆమె చీరతోనే.

ఆ నిముషాల్లో వాళ్ళకు జరీనా, వినాయక్ ప్రేమికులనే తెలుసు. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలని అనుకున్నారని తెలీదు. తెలిసినా వాళ్ళు జరీనాకు ఆ శిక్ష విధించేవాళ్ళే.

తప్పుచేసిన వాళ్లని క్షమించటం ఆ ముగ్గురిలో ఏ ఒక్కరికీ లేదు.

"వినాయక్ ఎడ్రసు నీకు తెలుసుకదూ?'' అడిగాడు జైన్-వాడియాను.

"తెలుసు....కాని అందువల్ల వుపయోగం వుండదు. ఆ ఇంటిని అతను ఎప్పుడో ఖాళీచేసి వుంటాడు.''

"వాడ్ని అంతంచేసే ప్లాను ఆలోచించాలి" ధనుంజయ్ అన్నాడు ఎర్రబడ్డ కళ్లతో.

"వాడ్ని అంతంచెయ్యడానికి ముందు ఆ నెగిటివ్ ఫిల్మ్ మన దగ్గిరకు చేరాలి. అప్పటిదాకా మనం చేతులు కట్టుకుని కూర్చోక తప్పదు" కుర్చీలో వెనక్కు వాలుతూ అన్నాడు ధనుంజయ్.

మళ్ళీ ఫోన్ మోగింది.

జైన్ రిసీవర్ తీసుకుని "వినాయక్ ఈసారైనా చెబుతావా?" అన్నాడు హేళనగా—

"రేపు ఉదయం పదిగంటలకు ముగ్గురూ మూడు బ్రీఫ్ కేసులలో పాతికలక్షలు వుంచి రైల్వేస్టేషన్ క్లోక్ రూమ్‌లో వుంచండి. వాటి రసీదులను 'హోటల్ షినాయ్' రిసెప్షనిస్టుకు ఇవ్వండి. సాయంత్రం ఐదుగంటల్లోపల ఆ బ్రీఫ్ కేసులు నాదగ్గిరకు చేరతాయి. మీరు నన్ను చీట్ చెయ్యలేదని నిర్ణయించుకున్నాక ఆ నెగిటివ్‌ఫిల్మ్‌ను హోటల్ షినాయ్ రిసెప్షనిస్టుకే ఇచ్చి మీకు ఫోన్ చేస్తాను"

"చాలా తెలివిగా ప్లాన్ వేశావ్ వినాయక్. నువ్వు ఫిల్మ్ ఇవ్వకుండా నీచేతికి డెబ్బయ్‌లక్షలు ఇవ్వటానికి మాకూ తెలివి వుంది. డబ్బు తీసుకుని నువ్వు మమ్మల్ని చీట్ చేసే అవకాశం వుందని మాకు తెలీదా?"

"మీకు తెలిసినా, తెలియకపోయినా నా ప్లాన్ ఇదే జైన్. మిమ్మల్ని డబ్బు తీసుకుని మోసంచేసే ఉద్దేశం నాకు లేదు. ఎందుకంటే మీమీద నాకు వున్న ద్వేషానికి, మీరు నాకు చేసిన ద్రోహానికి, జరీనా ప్రాణాలు తీసినందుకు మీకు డెబ్బయ్ఐదులక్షలు జరిమానా విధించాను. ఆ డబ్బుతో నేను తృప్తిపడతాను. డబ్బుతీసుకుని కూడా మీకు చిక్కి ప్రాణాలు పోగొట్టుకునే అమాయకుడ్నికాదు.

డబ్బు చేతికి రాగానే ఈదేశం వదిలి వెళ్ళిపోటానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాను. ఏమైనా మీరు నన్ను నమ్మక తప్పదు జైన్. ఎవరయినా బ్లాక్ మెయిలర్ మాటలు నమ్మి తీరాలి" అన్నాడు వినాయక్ అవతల్నించి.

"ఒక్క నిముషం" అంటూ వినాయక్ కండిషన్ని ఇద్దరికీ చెప్పాడు జైన్.

ఒప్పుకోమని చెప్పారు అతనితో.

"నిన్ను నమ్ముతున్నాం వినాయక్. కాని ముందుగా నీకు వార్నింగ్ ఇస్తున్నాం. మేమెంత సమర్థులమో నీకు తెలుసు. మమ్మల్ని మోసం చెయ్యాలని ప్రయత్నించేస్తే నువ్వూ నీ ప్రేయసి జరీనాను కలుసుకుంటావ్."

"నోర్మూసుకో జైన్.... ...జరీనా పేరు ఎత్తి నా నిర్ణయం మారిపోయేలా చెయ్యకు. అది మీకే నష్టం. ఈ డబ్బును కూడా లెక్కచెయ్యకుండా ఆ ఫిల్మను పోలీసులకు ఇచ్చేస్తాను."

"సారీ....నువ్వు చెప్పినట్టే చేస్తాం....కాని నువ్వు మాట తప్పకూడదు."

"జైన్.... నేను కూడా నీకో వార్నింగ్ ఇస్తున్నాను. ఈ ప్రయత్నంలో నన్ను పట్టుకునే ప్రయత్నాలు చెయ్యకూడదు. నీలాగే నేను కూడా కిరాయి మనుషులతోనే అన్ని పనులూ చేయిస్తాను. ఇన్ని లక్షలు వచ్చేటప్పుడు పదివేలు ఖర్చు చెయ్యటానికి నేను సిద్ధపడతాను. వాళ్ళని పట్టుకున్నా నీకు ఉపయోగం వుండదు. నేనెవర్నో, యెక్కడ వుంటానో వాళ్ళకు తెలీదు. ఎటువంటి ట్రిక్స్ వుపయోగించకు. అది నీకే ప్రమాదం" అన్నాడు వినాయక్.

"అర్థమయ్యింది వినాయక్ ...మళ్ళీ అడుగుతున్నాను

మన శత్రుత్వాన్ని రద్దు చేసుకుందాం.... నువ్వు మాలో ఒకడిగా చేరిపో.... నీలాంటి తెలివైన అనుచరుడు మా గ్యాంగ్‌కు దూరంకావటానికి మాకు బాధగా వుంది. జరీనా విషయంలో తొందరపడ్డందుకు పశ్చాత్తాప పడుతున్నాం.... ప్లీజ్.... వినాయక్...."

ఫోన్ పెట్టిన చప్పుడయింది.

"స్టుపిడ్........ వీడికి మన మీద నమ్మకం పూర్తిగా పోయింది" అన్నాడు జైన్ కోపంగా.

"డబ్బు కాజేసి వీడు మనల్ని మోసంచేస్తే" అన్నాడు వాడియా.

"చెయ్యగలిగింది ఏమిలేదు" అన్నాడు ధనుంజయ్.

"కాదు. ఏదో ఒకటి చెయ్యాలి. వాడి అంతు చూడాలి. వాడు మన దృష్టినించి తప్పించుకోగూడదు. వాడి చావుకు ముహూర్తం ఇప్పుడే నిర్ణయించాలి" జైన్ లేచి నిలబడ్డాడు.

ఇద్దరూ చూస్తున్నారు.

ఎదురుగా వున్న గదిలోకి వెళ్ళాడు.

ఎర్రటి ఫోన్ రిసీవర్ ఎత్తి "జోగిందర్‌ని పంపించండి. అవును. అర్జెంట్" అన్నాడు జైన్ ఫోన్ పెట్టేస్తూ.

7

వసారాలో చీకటిగా వుంది. కిటికీ సందుల్లోనించి సన్నటి వెలుతురు బయటకు వస్తోంది.

దూరంగా వెలుగుతున్న వీధిదీపం వెలుతురు అక్కడ పడటంలేదు.

తలుపుమీద చప్పుడు చేశాడు వినాయక్.

రెండునిముషాలకు రాజేశ్వరి తలుపు తీసింది.

వినాయక్ లోపలకు వచ్చాక ఆమె మళ్ళీ తలుపును మూసింది.

"ఆకలిగా వున్నదా?" అడిగింది రాజేశ్వరి.

"ఉంది."

"రండి. వంటచేశాను మీకూ్కడా" అన్నది.

"నీకెందుకు శ్రమ?" అన్నా డతను.

"నాకెందుకో అట్టా అనిపించలేదు మీరు దెబ్బతిన్న మనిషిలాగా అనిపించారు. మీరు కేవలం ఆ సుఖంకోసమే నా దగ్గరకు రావటంలేదని నాకు తెలుసు. నాలో వున్న మరేదో ఆకర్షణ మిమ్మల్ని నా దగ్గరకు నెడుతోంది" అన్నది.

వినాయక్ రెండు నిముషాలు ఆమె కళ్ళలోకి చూసి ఆ తర్వాత తలదించుకుని చిన్నగా ఏదో అన్నాడు.

"నాకు వినపడలేదు" అన్నది రాజేశ్వరి.

"నా కెవ్వరూ లేరు. నేను ఒంటరివాడ్ని."

"బాధపడకండి... నేను వున్నాను" అన్నదామె.

అతను ఏదో గుర్తువచ్చినట్టు జేబులోనించి ఒక ప్యాకెట్టు తీశాడు. దాన్ని వూడదీసి "ఈ డబ్బు తీసుకో" అన్నాడు నోట్లకట్టలను ఆమెకిస్తూ.

"వద్దు....ఇంత డబ్బు నాకొద్దు....నా గురించి మీరు ఎకు్కవగా ఆలోచిస్తున్నారు" అన్నది.

"నా గురించి ఎప్పుడో చెబుతాను. నీ దగ్గర నా గుండె మంట కొంతవరకు చల్లారుతోంది. అందుకు ప్రతిఫలంగా ఈ డబ్బును నీ కిస్తున్నాను. కాదనకు తీసుకో."

వినాయక్‌ను బాధపెట్టటం ఇష్టంలేక ఆమె ఆ డబ్బును తీసుకుంది.

"ఈ డబ్బును ఇంట్లో వుంచకు....రేపే బేంక్‌లో వేసుకో....ఎప్పుడయినా వుపయోగపడుతుంది" అన్నాడు అతను.

కొంచెం సేపటికి ఆమె-అతడి ముందు విస్కీ బాటిలు, గ్లాసు వుంచింది.

అతను తాగుతున్నాడు మాట్లాడకుండా.

కుర్చీలో కూర్చుని రాజేశ్వరి అతడినే చూస్తోంది.

అతడు నేరస్తుడని ఆమెకి తెలుసు. ఐనా అతడ్ని ఆమె ద్వేషించలేకపోయింది. అతన్లో ఏదో బాధ, సెంటిమెంటు వున్నట్టుగా ఆమె కనుక్కున్నది.

గ్లాసులో కి విస్కీ వంచుతూ "రాజేశ్వరీ....ఇప్పుడు నేను ప్రమాదానికి దగ్గర్లో వున్నాను" అన్నాడు.

"ఏమిటా ప్రమాదం?" అనడిగింది.

"చెప్పను" అన్నాడు అతను మొండిగా.

అతడ్ని గట్టిగా అడగలేదు ఆమె.

8

నల్లగా, పొడుగ్గా ఉన్నాడు జోగిందర్.

అతను వాళ్ళ ముందు నిలబడి వున్నాడు. పైకి దువ్విన జుట్టు - వెడల్పుగా ఉన్న మొహం - లోతుకు పోయిన కళ్ళు - బుగ్గల మీద నల్లటి మచ్చలు వున్నాయతనికి.

స్మగ్లింగ్ చెయ్యటంలో అతను ఎంతో అనుభవం సంపాదించాడు. అతడే వినాయక్‌కు సమవుజ్జీలాంటి వాడు.

"నమ్మకద్రోహం చేసిన వినాయక్‌కు సరయిన శిక్ష నువ్వే వెయ్యాలి" అన్నాడు ధనుంజయ్.

"చెప్పండి బాస్....ఏం చెయ్యమంటారు?" అడిగాడు

జోగిందర్ కళ్ళు పెద్దవి చేసి.

ఆ ముగ్గురి అనుగ్రహం ఇంకొంచెం ఎక్కువగా పొందటానికి సిద్ధపడినవాడిలా వున్నాడు జోగిందర్.

"డెబ్భయ్ ఐదులక్షలు మన దగ్గర్నించి గద్దలాగా తన్నుకుపోవటానికి ఒక ప్లాన్ చెప్పాడు వినాయక్..... అతని ప్లాన్‌తోనే అతని ఆచూకీ తెలుసుకోవాలి....నాకు తెలుసు మారువేషంలో కూడా హోటల్ రిసెప్షనిస్టు దగ్గరకుగాని, రైల్వేస్టేషన్‌కుగాని అతను రాడు. ఎక్కడో వుండి ఎవర్నో పంపుతాడు. వాళ్ళను పట్టుకుని మనకు లాభం లేదు. అందుకే మవ్వొక పని చేయ్యాలి."

"ఏం చెయ్యమంటారు బాస్?" ఛాతీని వెడల్పు చేసి అడిగాడు జోగిందర్.

"మనం ట్రేస్ చెయ్యకుండా వినాయక్ జాగ్రత్తపడుతున్నాడు. అందుకే పబ్లిక్ టెలిఫోన్ బూత్‌ల నుండి మనకు ఫోన్ చేస్తున్నాడు. అందుకే నువ్వు మనవాళ్ళను తీసుకుని రేపు ఉదయం పది గంటల నించి సిటీలో వున్న పబ్లిక్ టెలిఫోన్ బూతులన్నింటినీ కనిపెట్టండి వేషాలు పూర్తిగా మార్చుకోవాలి. మన వెహికల్స్ బయటకు తీయకూడదు. జీపులను హైర్‌కు తీసుకోండి. రాత్రివరకూ తిరుగుతూనే వుండండి. ఎక్కడో ఒక బూత్‌లో దొరుకుతాడు. దొరికితే ప్రాణాలతో ఇక్కడకు తీసుకురండి. ఎదురు తిరిగినా, పారిపోవటానికి ప్రయత్నించినా కాల్చి చంపండి....వాడి దగ్గరే మనక్కావలసిన ఫిల్ము వుంటుంది. దాన్ని తీసుకు రండి."

"అర్థమయ్యింది బాస్" అన్నాడు జోగిందర్ తల వూపుతూ.

"అంతే కాదు, హోటల్ షినాయ్ రిసెప్షనిస్టును కలుసు

కునే మనుషుల్ని కూడా వాచ్ చెయ్యాలి. మనం ఇచ్చే క్లోక్ రూమ్ రశీదులను ఎవరు తీసుకు వెళతారో చూసి వాళ్ళకు తెలియకుండా వెంటాడండి. క్లోక్ రూమ్‌లోనించి మన బ్రీఫ్ కేసులను ఎవరు తీసుకు వెళతారో వాడ్ని కూడా వెంబడించండి. వాడు ఎవర్ని కలుసుతుంటాడో, ఎక్కడికి వెళతాడో తెలుసుకోండి.... వెళ్ళండి.... మీరు సులభంగా గుర్తుపట్టడానికి వీలుగా రేపు డబ్బునంతా తెల్లటి బ్రీఫ్ కేసుల్లో సర్దిపెడతాం" చెప్పాడు జైన్.

"అద్భుతంగా వుంది ఈ పథకం.... ఈ ఉచ్చునుండి తప్పించుకోవటం వినాయక్‌కు సాధ్యం కాదు" అన్నాడు వాడియా.

"వాడి చావుతోనే మనం సుఖపడేది. వాడు దొరికే వరకూ మనం ప్రమాదంలో బతుకుతున్నట్టే" అన్నాడు ధనుంజయ్.

జోగిందర్ జైన్ అందించిన నోట్లకట్టలను తీసుకుని తల వూపి అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

"టెంపుల్‌స్ట్రీట్‌లో స్టుడియో మేనేజర్ని కాల్చిచంపిన హంతకు డెవరో తెలుసా?" అడిగాడు జైన్ వాళ్ళని.

"ఎవరు?" అడిగాడు వాడియా.

"వినాయక్."

"నిజంగానా!" నమ్మలేనట్టు అడిగాడు ధనుంజయ్.

"అవును ఫ్రండ్స్.... వినాయకే ఆ హత్య చేశాడు" సిగరెట్ వెలిగించి అన్నాడు జైన్.

ఆ గదిలో వెలుతురు డిమ్‌గా ఉంది. ఒకరి మొహాలు ఒకరికి మసగ్గా కనబడుతున్నాయి.

"నీకెలా తెలుసు?"

"ఊహించాను. ఎవరో అజ్ఞాత వ్యక్తిగా మన ముగ్గురికీ ఫోన్ చేసి బెదిరించినప్పుడు వినాయక్ దగ్గిర మనకు తర్వాత పంపిన ప్రింట్లు లేవు. ఉంటే అప్పుడే మనకు చేసి వేసి వుండేవాడు. అంటే అప్పుడు అతని దగ్గిర నెగటివ్ ఒక్కటే వుంది. మనం ఆధారాలు చూడనిదే డబ్బులివ్వమని మొండికేశాక అతను నెగిటివ్‌ను ప్రింట్ల కోసం ఇచ్చాడు ఆ మేనేజర్‌కు. అతను ఆ ఫిల్మ్ గురించి అంతా తెలుసుకుని వినాయక్‌ను బ్లాక్‌మెయిల్ చేసి వుంటాడు. డబ్బు ఇవ్వటానికి ఒప్పుకుని టెంపుల్ స్ట్రీట్‌కు రమ్మని, అక్కడే డబ్బు ఇస్తానని చెప్పి అతణ్ని అక్కడకు రప్పించి వుంటాడు. నెగిటివ్ ప్రింట్లు తీసుకుని కాల్చి చంపి వుంటాడు."

"అవును. నిజమే....అంతే జరిగి వుంటుంది" అన్నాడు వాడియా - జైన్ ఉద్దేశాన్ని ఒప్పుకుంటూ.

"నీ ఆలోచనలో ఒక లోపం వుంది జైన్. ఈవెనింగ్ ఎడిషన్‌లో ఆ హత్య రాత్రి పది గంటలు దాటిన తర్వాత జరిగిందని రాశారు. కాని వినాయక్ మనకు ఆ హత్య జరగటానికి ముందుగానే ఈ క్యాసెట్లను అందజేశాడు. వాటి గురించి ఫోన్ చేసి చెప్పాడు. హత్య చేసి అతని దగ్గిర ప్రింట్లు, నెగిటివ్‌లు లాక్కుంటే ముందుగానే అతను మనకెట్లా అందజేస్తాడు?" అనడిగాడు ధనుంజయ్ సందేహంగా.

"వాళ్ళబేరం గురించి మనకు తెలీదు. కాని అతణ్ని కాల్చి చంపిన మనిషి వినాయక్. అనుమానం లేదు" జైన్ అన్నాడు.

"వినాయక్ హంతకుడని పోలీసులకు మనమే తెలియజేద్దాం జైన్" అన్నాడు వాడియా.

"ఇప్పుడు మనం అట్లా చేస్తే మనకే ప్రమాదం....ఆ ఫిల్మును వాళ్ళకే యిస్తాడు వినాయక్. వద్దు అటువంటి ప్రయత్నం చెయ్యొద్దు."

"రేపు వినాయక్ తప్పించుకోగూడదు" ముగ్గురూ ఒకేసారి అన్నారు.

9

జోగీందర్ క్రితంరోజు రాత్రికే సిటీలో పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లు ఏ ప్రాంతాల్లో వున్నాయో ఒక జాబితా తయారు చేశాడు. ఆ జాబితా ప్రకారం ఒక రూటు ప్లాన్‌ను రూపొందించాడు. ఆ ప్లాన్ ప్రకారమే వినాయక్‌ను పట్టుకోటానికి ప్రయత్నం చెయ్యాలని అతను అనుకున్నాడు.

కొన్నాళ్ళ క్రితం వరకు వినాయక్ కూడా తనలాగే ముఖ్యమైన అనుచరుడుగా ఆ నేర సంస్థలో పని చేశాడని జోగీందర్‌కు గుర్తు వుంది. వినాయక్‌కు నేరచక్రవర్తులు ముగ్గురూ కలిసి ద్రోహం చేశారని తెలుసు. అయినా వినాయక్‌ను అంతం చెయ్యటానికి జోగీందర్ ఆత్రుత పడుతున్నాడు. అతడ్ని హత్య చేసి బాస్‌ల మెప్పు పొందటానికి ప్రయత్నం చేస్తున్నాడు.

జీపులను, మెడడోర్ వ్యాన్‌లను తీసుకున్నాడు జోగీందర్. గ్యాంగ్ సభ్యులను జట్లుగా విడగొట్టి వాళ్ళకు తన ప్లాన్ ప్రకారం ఒక్కో రూట్‌ను అప్పగించాడు. వినాయక్ దొరికిన వెంటనే ఆ విషయాన్ని జైన్‌కు తెలియజేయాలి.

వినాయక్‌ను కాల్చి చంపిన సభ్యుడికి ప్రత్యేకంగా పదివేల రూపాయలను బహుమతిగా ఇవ్వటానికి నిర్ణయం చేశాడు జోగీందర్

ముగ్గురు గ్యాంగ్ సభ్యులు హోటల్ షినాయ్ ఎదురుగా వున్న రోడ్డుమీద బూట్ పాలిష్ చేసే వాళ్ళల్లాగా వేషాలు వేసుకుని కూర్చున్నారు. వినాయక్ వాళ్లను చూసినా గుర్తుపట్టలేనంతగా తమ రూపాలను వాళ్ళు మార్చుకున్నారు. ఇంకో సభ్యుడు అప్పుడప్పుడు మారువేషంలోనే హోటల్లోకి వెళ్ళి మారువేషంలో వస్తాడనుకున్న వినాయక్ కోసం వెదకటం మొదలుపెట్టాడు.

పన్నెండు గంటలు దాటింది.

అప్పటికే జైను మనుషుల జీపులు సిటీవీధుల్లో గస్తీ తిరగటం మొదలుపెట్టాయి. జోగీందర్ కూడా పూర్తిగా తన రూపాన్ని మార్చుకున్నాడు. నల్లసిప్యాంటు, బాగా వదులుగా వున్న షర్టు వేసుకున్నాడు. జుట్టును మధ్య పాపిడితీసి దువ్వుకున్నాడు. కళ్లజోడు పెట్టుకున్నాడు.

పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లు వున్న ప్రాంతాలన్నింటినీ అప్పటికే మూడుసార్లు కవర్ చేశాయి వాహనాలు. రోడ్డుమీద ఎదురయ్యే మనుషులను వెయ్యికళ్లతో పరిశీలించటం మొదలుపెట్టారు వాళ్ళంతా.

గాలింపు చర్యల గురించి ఎప్పటికప్పుడు జైనుకు తెలియజేస్తున్నాడు జోగిందర్.

పాతిక లక్షల రూపాయలతో మూడు బ్రీఫ్ కేసులను రైల్వేస్టేషన్ క్లోక్ రూమ్‌లో వుంచి ఆ రశీదులను హోటల్ షినాయ్ రిసెప్షనిస్టుకు పంపించాడు జైన్. ఆ రశీదుల గురించి ఎవరు అడిగితే వాళ్ళకు అందజెయ్యమని చెప్పారు రిసెప్షనిస్టుకు.

ఒంటిగంటకూడా క్లోక్‌రూం రసీదులకోసం ఎవరూ రాలేదు.

రోడ్డుపక్కనే పేవ్‌మెంటుమీద కూర్చున్న బూట్ పాలిష్ చేసే వాళ్ళకు విసుగుపుడుతోంది.

అలవాటులేకపోయినా రకరకాల మనుషుల బూట్లను పాలిష్ చేస్తూకూర్చున్నారు. తమమీద కొంచెం అనుమానం వచ్చినా వినాయక్ దొరకడని వాళ్ళకు తెలుసు. అందుకే ఓపిగ్గా కూర్చుని వినాయక్ కోసం, అతడుపంపే మనిషికోసం ఎదురుచూస్తున్నారు.

రైలు స్టేషన్‌లో కూడా నలుగురు మనుషులను మారు వేషాల్లో వుంచాడు జోగిందర్. మూడు తెల్లటి బ్రీఫ్ కేసులను తీసుకెళ్ళటానికి ఒంటిగంటవరకూ యెవ్వరూ రాలేదు.

గంటకు ఒకసారి జోగిందర్ హోటలు దగ్గర, రైలు స్టేషన్‌లో వున్న తన మనుషులను కలిసి విషయం తెలుసుకుంటున్నాడు.

ఒంటిగంట దాటిన ఇరవై నిముషాలకు హోటల్ షినాయ్ రిసెప్షనిస్టు దగ్గరకు మెట్లు దిగి హోటల్ యూనిఫారంలో వున్న బాయ్ వచ్చాడు. నవ్వుతూ ఆమెతో ఐదునిముషాలు మాట్లాడాడు.

అప్పటివరకు ఏదో సినిమా బొమ్మల పత్రిక చూస్తున్న రిసెప్షన్‌లో వున్న యువతి ఆ పత్రికను అతడికిచ్చేసింది. రెండు నిముషాలకు అతడు ఆ పత్రికను తీసుకుని మెట్లెక్కి పైకి వెళ్ళిపోయాడు.

రిసెప్షనిస్టుమీద నిఘావేసిన అనుచరుడు రూం బాయ్‌ని చూశాడు. కాని అతడిమీద అనుమానం కలగలేదు. బయటనించి వచ్చే మనుషులకోసమే అతను యెదురు చూస్తున్నాడు.

అరగంట తర్వాత రూం బాయ్ మెట్లు దిగి కిందకు

వచ్చాడు. కాని అతను హోటల్ యూనిఫారంలో లేడు. మామూలు డ్రస్సులో వున్నాడు. నీలంరంగు షర్టును తెల్లటి ప్యాంటులోకి దోపుకుని బెల్టు పెట్టుకున్నాడు. కళ్ళకు నల్లని అద్దాలు పెట్టుకున్నాడు.

అతడ్ని గుర్తుపట్టలేదు అనుచరుడు.

చూస్తుండగానే అతడు బయటకు వెళ్ళిపోయాడు.

బూట్‌పాలిష్ చేస్తున్న ముగ్గురూ అతడ్ని చూశారు. కాని అతడ్ని అనుమానించలేదు. అతను లోపలకు వెళ్ళటం వాళ్ళు చూడలేదు. అంతేకాదు. అతడ్ని ఫాలో అవుతూ తమ గ్యాంగ్ మనిషి బయటకు రాలేదు. అంటే అతడిమీద అనుమానంలేదని అనుకున్నారు వాళ్ళు.

అతను కొంతదూరం నడిచి తర్వాత ఆటోరిక్షా ఎక్కాడు.

10

రైలు స్టేషన్ ముందు ఆటోరిక్షా ఆగింది. అందులో నించి లావుగా, పొడుగ్గా వున్న మనిషి దిగాడు. అతడి చేతితో పెద్ద తోలుపెట్టె వుంది. అతను దాన్ని భారంగా పట్టుకుని లోపలకు వచ్చాడు.

ఎంక్వయిరీ దగ్గరకు వెళ్ళి ఏదో అడిగాడు.

తర్వాత రెండుసార్లు బుక్కింగ్ కవుంటర్ల దగ్గరకు వెళ్ళాడు.

వాళ్ళు అతడ్ని గమనించారు.

ప్రయాణీకుడని అనుకున్నారు.

చివరికి అతను క్లోక్ రూంలోకి వెళ్ళాడు.

వాళ్ళు చూశారతన్ని లోపలకు వెళ్ళటం. వాళ్ళకు అతని మీద కొంచెం కూడా అనుమానంలేదు. అతను బిళ్ళ

గోచీ పోసి పంచె కట్టుకున్నాడు. తెల్లటి గ్లాస్కో చొక్కా తొడుక్కున్నాడు. మెళ్ళో ఆంజనేయస్వామి బిళ్ళ ఎర్రటి తాడుకు వేళ్ళాడుతోంది. పలచగా వున్న జుట్టును బాగా అణచిపెట్టి పక్కకు దువ్వుకున్నాడు.

మూడు బ్రీఫ్‌కేసులను తీసుకెళ్ళటానికి వచ్చే మనిషి ఖాళీ చేతులతో వస్తాడనే వాళ్ళు అనుకున్నారు. అందుకే వాళ్ళు తోలుపెట్టెతో వచ్చిన అతడ్ని సందేహించలేదు.

పదినిముషాలకు అతను పెద్ద తోలుపెట్టెను మోసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. ప్రయాణాన్ని వాయిదా వేసుకుని వెళ్ళిపోతున్నాడని అనుకున్నారు.

అతను రోడ్డుమీద నడిచి ఒక బస్టాపు దగ్గర ఆగాడు. కొంచెంసేపటికి వచ్చిన బస్సులో ఎక్కాడు.

అప్పుడు సరిగ్గా ఐదుగంటలయ్యింది.

అతను వెళ్ళిన పదినిమిషాలకు వాళ్ళు నలుగురూ క్లోక్ రూంలోకి వెళ్ళారు. మూడు తెల్లటి బ్రీఫ్‌కేసులూ కనపడలేదు.

అవి ఎలా మాయమయినాయో తెలుసుకోవటానికి వాళ్ళకు ఎక్కువసేపు పట్టలేదు.

ఆ నలుగుర్లో ఒకతను టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళి జైన్ నెంబర్‌కు డయల్ చేశాడు.

క్షణం తర్వాత కనెక్షన్ వచ్చింది.

జైన్ పలికాడు.

"బాస్.........రైలు స్టేషన్నించి ఫోన్ చేస్తున్నాను. ఎవడో వచ్చి ఆ మూడు బ్రీఫ్‌కేసులను పెద్ద తోలు పెట్టెలో పెట్టుకుని వెళ్ళిపోయాడు బాస్."

"ఎవరైనా మనవాళ్ళు వాడ్ని ఫాలో అవుతున్నారా?"

"లేదు బాస్....అసలు మేము వాణ్ని అనుమానించ లేదు. వాడు వెళ్ళిన తర్వాత చూస్తే మన బ్రీఫ్ కేసులు మాయమైనట్టు తెలిసింది."

"ఫూల్స్....మీ ప్రాణాలు తీస్తాను. వెళ్ళండి....వాడు ఎటు వెళ్ళాడో చూసి తెలుసుకోండి. అంతా గాలించండి. ఆ డబ్బు మన చెయ్యి దాటిపోవటానికి వీల్లేదు" ఫోన్‌లో గొంతు చించుకుని అరిచాడు జైన్.

"పదండి....క్విక్" అరుస్తూ టెలిఫోన్ బూత్‌లో నించి బయటకు వచ్చాడు.

నలుగురూ రోడ్డుమీదకు పరుగుదీశారు.

11

నిర్మానుష్యంగా వున్న రోడ్డుపక్కగా వుంది ఆ టెలి ఫోన్ బూత్. దానికి కొంచెం దూరంలో వున్నాడు వినాయక్. అతను అప్పుడప్పుడు వెనక్కి తిరిగిచూస్తూ గబగబా నడుస్తున్నాడు.

సాయంత్రం ఆరుగంటలు దాటుతోంది.

చీకటి పడుతోంది.

దూరంగా ఇళ్ళలో లైట్లు వెలుగుతున్నాయి.

అతను బాగా టెన్షన్‌గా ఫీలవుతున్నాడు.

డెబ్భయ్ ఐదు లక్షలు తన చేతికి వచ్చాయి.

జరీనాని క్రూరంగా చంపినందుకు విధించాలనుకున్న శిక్షలో సగం పూర్తయ్యింది సగం శిక్ష మిగిలిపోయింది.

ఆ శిక్ష కూడా వాళ్ళని వరించాలి.

నరరూప రాక్షసులను చట్టానికి అప్పగించాలి.

టెలిఫోన్ నెంబర్ని గుర్తు చేసుకున్నాడు. బాల్ పెన్నుతో ఆ నెంబర్ని అరచేతిలో రాసుకున్నాడు మరచి

పోకుండా. ఇంకో నెంబర్ అతడికి బాగానే గుర్తుంది.

వీలయినంత వేగంగా ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళి పోవాలనుకున్నాడు వినాయక్.

టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళాడు.

డయల్ చేశాడు.

కనెక్షన్ వచ్చింది.

"యస్.పి ఆఫీస్" అవతల్నించి వినపడింది.

"నాయక్‌గారు వున్నారా?" అడిగాడు వినాయక్.

"మీరెవరు? ఆయనతో పనేమిటి?" ఎవరో అడిగారు.

"ఆయనతోనే మాట్లాడాలి. చాలా అర్జంటు ముఖ్యమైన సీక్రెట్ ఆయనతో చెప్పాలి" ఆత్రంగా అన్నాడు అతను అద్దంలోనించి బయటకు చూస్తూ.

ఒక్కనిముషం ఆగిన తర్వాత "యస్.పి. నాయక్ స్పీకింగ్" అని వినపడింది.

"నమస్తే సర్....మీతో ఒక రహస్యం చెప్పాలి" అన్నాడు వినాయక్.

"రహస్యమా? చెప్పు....ఎవరు నువ్వు? ఎవరి గురించి నువ్వు చెప్పేది?" క్యూరియస్‌గా అడిగాడు నాయక్.

"నా పేరు వినాయక్. నేనొక ఇన్‌ఫార్మర్‌ని .... సంఘంలో పారిశ్రామికవేత్తలుగా తిరుగుతూ నేర ప్రపంచానికి ఆధిపత్యం వహిస్తున్న ముగ్గురు మనుషుల గురించే మీకు ఫోన్ చేశాను."

"ఎవరు వాళ్ళు?"

"జైన్—ధనుంజయ్—వాడియా."

"టాఫ్ ఫిగర్స్"

"అవును సర్....వాళ్ళను జైలుగోడల మధ్య జీవితాంతం బంధించటానికి అవసరమయిన సాక్ష్యాలన్నీ

ఆధారాలతో నేను సంపాదించాను. వాటిని మీకు అందజేస్తాను.''

''అవి ఎక్కడ వున్నాయి? ఇప్పుడు నీ దగ్గరే వున్నాయా?''

''లేవు....వాటిని....''

ఫళ్ళున పగిలింది టెలిఫోన్ బూత్‌కు వున్న అద్దం. అందులోనించి దూసుకు వచ్చిన తుపాకి గుండు వినాయక్ భుజంలో దిగిబడింది.

బాధగా అరిచాడు అతను రిసీవర్ వదిలేస్తూ—

''హలో....హలో'' అరుస్తున్నాడు యస్.పి.నాయక్ అవతల్నించి.

బాధతోనే జేబులోనించి పిస్తోలు బయటకు తీశాడు వినాయక్.

అప్పటికే జోగిందర్, మరో నలుగురు మనుషులు అతడ్ని చుట్టుముట్టారు. జోగిందర్ చేతిలో నిగనిగలాడుతున్న పిస్తోలు వుంది.

వినాయక్ చేతిలో పిస్తోలు పేలకముందే జోగిందర్ చేతిలో వున్న పిస్తోలు రెండుసార్లు పేలింది. పగిలిన అద్దంలో నించి దూసుకువచ్చిన తూటాలు సూటిగా వినాయక్ గుండెల్లోకి దూరిపోయాయి.

అతడి చేతిలో పిస్తోలు జారిపోయింది.

చిన్ని మూలుగుతో అతడు వెనక్కు పడిపోయాడు.

అతడి కళ్ళముందు జరీనా కనపడింది.

తర్వాత రాజేశ్వరి గుర్తుకొచ్చింది.

నెత్తురుతో అతడి షర్టు, ప్యాంటు తడుస్తున్నాయి.

''క్విక్....వెతకండి....వాడి దగ్గరే వుంటుంది ఆ నెగిటివ్'' అరిచాడు జోగిందర్....

రోడ్డుపక్కనే ఆగి వుంది జీపు.

నలుగురు మనుషులు వినాయక్ ప్యాంటు, షర్టు, జేబులు వెతికారు.

నెగటివ్ ఫిల్మ్ దొరకలేదు.

"రోగ్ .. ఎక్కడో దాచిపెట్టి వుంటాడు.." అన్నాడు జోగిందర్.

చీకటిగా వుంది సిగరెట్ లైటర్ వెలిగించాడు ఒకడు.

ఆ వెల్తుర్లో చూశాడు జోగిందర్—వినాయక్ అరచేతి మీద వున్న ఆ టెలిఫోన్ నెంబర్‌ని.

"ఈ నెంబరేమిటి?" ముందుకు వొంగాడు.

జేబులో వున్న చిన్న డైరీలో ఆ నెంబర్ని నోట్ చేసుకున్నాడు అతను. తర్వాత వినాయక్ అరచేతిలో వున్న నెంబర్ని తుడిచేశాడు.

"ఈ నెంబర్‌కే ఫోన్‌లో మాట్లాడుతున్నాడేమో జోగిందర్" అన్నాడతను.

"అవును....అంతే అయ్యుంటుంది. వాడెవరో వీడి పార్టనర్ అయ్యుంటాడు... క్విక్.. పదండి....ఎవరైనా రావొచ్చు" అన్నాడతను.

వినాయక్ జేబులోనించి తీసిన పర్సును అక్కడే పడేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

క్షణంలో జీపు కదిలి ముందుకు దూకింది.

12

యస్. పి. నాయక్ టెలిఫోన్ బూత్ దగ్గిర నిలబడి వున్నాడు. ఆయన మొహం జేవురించి వుంది.

సెర్చ్‌లైటు కాంతి అక్కడి చీకటిని నెట్టేస్తోంది.

దూరంగా వీధిదీపం వెలుగుతోంది.

లావుగా, పొడుగ్గా వున్నాడు నాయక్. ఆయన కళ్లలో వినాయక్‌ను దారుణంగా కాల్చిచంపిన మనుషులమీద ద్వేషం రగులుతోంది.

ఎంతోకాలంనుంచీ నాయక్ అముగ్గురు పెద్దమనుషులను జైలుకు నెట్టే సాక్ష్యాలకోసం వెతుకుతున్నాడు. వినాయక్‌వల్ల ఆ అవకాశం వచ్చింది. కాని అతను ఆ సాక్ష్యాలను అందజెయ్యక ముందే అతన్ని హత్య చేశారు.

టెలిఫోన్ బూత్ అద్దం నిండా అంటుకున్నది రక్తం. బూత్‌లో నించి బయటకు కారుతోంది.

రిసీవర్ కిందికి వేళ్ళాడుతోంది.

తనకు ఫోన్ చెయ్యటానికి వినాయక్ అంత దూరం నడిచి నిర్జనంగా వుండే ఆ ప్రాంతానికి ఎందుకు వచ్చాడో నాయక్‌కు అర్థం కాలేదు.

వినాయక్ జేబులు వెతికి వుపయోగం వుండదని తెలుసు. అతన్ని కాల్చి చంపిన మనుషులు వినాయక్‌ను సోదా చేసినట్టుగా శవం పక్కనే పడివున్న మనీపర్సువల్ల క్లియర్‌గా తెలుస్తూనే వుంది.

హత్య జరిగిన ప్రదేశంలో ఎక్కువగా జనం చేరలేదు.

హంతకుల జాడ తెలియటానికి ఆ ప్రాంతంలో దర్యాప్తు చేసిరమ్మని ఇన్‌స్పెక్టర్‌ని పంపించాడు నాయక్.

ఫోటోగ్రాఫర్ పని ముగించుకుని నిలబడ్డాడు. వేలిముద్రల కోసం ప్రయత్నం చేస్తున్నాడు ఫింగర్‌ప్రింట్ ఎక్స్‌పర్ట్.

నాయక్ అక్కడినించి కదిలాడు.

పిస్తోలు పేల్చినప్పుడు చప్పుడు వినపడి వుండాలి.

కొంచెందూరంలో వున్న ఇళ్ళలో మనుషులయినా ఆ చప్పుడు విని వుండరా!

ఒక కానిస్టేబుల్ చేతిలో వున్న టార్చిలైటును తీసుకున్నాడు నాయక్.

టెలిఫోను బూత్‌కు కొంచెం దూరంలో రోడ్డు మీద టార్చిని ఫోకస్ చేస్తూ ముందుకు నడిచాడు.

ఒకచోట అతనికి మట్టిలో కారు టైర్ల గుర్తులు కనపడ్డాయి. ఏదో కారు అక్కడ కొంచెంసేపు ఆగినట్టుగా నల్లటి ఆయిల్ మరక మట్టిలో కనపడింది.

ఆ గుర్తులను పరీక్షగా చూశాడాయన వొంగి.

ఇన్‌స్పెక్టర్ తిరిగి వచ్చాడు.

"ఏమైనా తెలిసిందా?"

"లేదు సర్ ...ఎవ్వరూ తుపాకీ పేలిన చప్పుడు వినలేదుట. ఒక జీప్ వచ్చి ఇక్కడ ఆగటం ఒకాయన బాల్కనీలో వుండి చూశాడుట."

"ఎవరాయన?"

"రిటైర్డు క్లర్కుట. ఏదో ఆఫీసులో పనిచేసి ఆరేళ్ళ క్రితం రిటైరు అయ్యాడుట"

"జీపులోనించి దిగిన మనుషుల్ని కూడా చూశాడా?"

"లేదు సర్ ....చలిగా వుండటంతో జీపు ఆగగానే లోపలకు వెళ్ళిపోయాడుట."

"కనీసం ఒక్కరు కూడా ఈ హత్యను చూడలేదా?"

"చూడలేదుట సర్ అంతా టి.వి చూస్తున్నారుట. శనివారం కదా సినిమా వస్తోంది."

అప్పుడర్థమయ్యింది నాయక్‌కు. ఆ రోడ్డులో ఒక పక్కగా మైదానం వుంది. ఇంకోవైపు ఇళ్ళున్నాయి. షాపులు లేవు.

ఇళ్ళలో మనుషులందరూ టి.వి. సినిమా చూడటంలో మునిగిపోయారు. అందుకే తుపాకీ పేలిన చప్పుడు ఎవరికీ వినిపించలేదు.

జీపు టైరు గుర్తులను ఫోటోలు తీయించాడు నాయక్.

"సర్ ...ఇతను కూడా ఆ గ్యాంగ్‌లో మనిషే అయి వుంటాడని నా అనుమానం సర్ ..." ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"అయుండొచ్చు .... లేకపోతే ఇతన్ని ట్రేస్‌చేసి ఇక్కడ హత్య చెయ్యటం కష్టం....ఒక్క సాధారణ ఇన్‌ఫార్మర్ ఇంత రిస్కు తీసుకోడు."

శవాన్ని మార్చురీకి పంపే ఏర్పాట్లు మొదలయినాయి.

వినాయక్ శవాన్ని కదిల్చారు.

"సర్ ....పిస్తోలు!" అన్నాడు ఆశ్చర్యంగా ఇన్‌స్పెక్టర్.

నాయక్ చూశాడు.

కర్చీఫ్‌తో దాన్ని తీశాడు ఇన్‌స్పెక్టర్.

దాన్ని చూస్తూ "ఈ పిస్తోలు వినాయక్‌ది అయి వుండవచ్చు. అతను కూడా కాల్పులు జరిపిన గుర్తులు కనపడటం లేదు. ఎవరైనా గాయపడినా ఇక్కడ నెత్తురు బొట్లు కనపడి వుండేవి. వినాయక్ నాకు ఫోన్ చేస్తున్నప్పుడు వాళ్ళు వెనకనించి జీపులో వచ్చి వెంటనే కాల్పులు జరిపి వుండాలి. వినాయక్ తిరిగి కాల్చకముందే అతన్ని చంపేసారు ..." అన్నాడు నాయక్.

"సార్ ....టెంపుల్‌స్ట్రీట్‌లో హత్యకీ, ఈ హత్యకీ ఏదైనా సంబంధం వుండే అవకాశం వుందంటారా?"

"తెలీదు, దర్యాప్తు జరపాలి. వుండొచ్చు....వుండక

పోవచ్చు....స్టుడియో మేనేజర్లకు బ్లాక్‌మెయిలర్స్‌తో సంబంధాలు వుంటాయి. ఏమైనా డెడ్‌లక్. వినాయక్ ఆ సాక్ష్యాలు ఎక్కడ వుంచాడో చెప్పలేదు. వాటిని అతడు ఎక్కడో దాచాడు."

"అతడ్ని కాల్చి చంపిన మనుషులు ఆ సాక్ష్యాన్ని తీసు కెళ్ళారేమో."

యస్. పి. నాయక్ మాట్లాడలేదు.

కొంచెం సేపటికి పోలీసు వాహనాలు అక్కడి నించి కదిలాయి.

13

అంతా తలలు వంచుకుని నిలబడ్డారు. తలెత్తటానికి భయంగా వుంది. ఎదురుగా ముగ్గురు నేరచక్రవర్తులూ దెబ్బతిన్న పులుల్లాగా మండుతున్నారు.

"మిమ్మల్ని మొసళ్ళకు ఆహారంగా వెయ్యాలి. స్టుపిడ్స్ దెబ్బయ్ అయిదు లక్షలూ పోయాయి. ఆ బ్రీఫ్‌కేసులను వాడెవడో మీ యెదురుగానే తీసుకెళుతున్నా మీకు తెలీ లేదు. ప్రతి మనిషినీ అనుమానించమనీ, ఎవర్నీ వదల వద్దనీ మీకు ముందే చెప్పాను. వినాయక్ కోసం ఎదురు చూడమని ఎవరు చెప్పారు? వాడు ముందే చెప్పాడు. తన పనులన్నీ కిరాయి మనుషులతో చేయించుకుంటానని. డబ్బూ పోయింది. మనల్ని పాతాళానికి తొక్కి నెత్తి మీద నిప్పులు పోసే ఆ నెగిటివ్ ఫిల్ము కూడా మనకు దొరకలేదు. మీరంతా చావండి" పెద్దగా నడుము తెగిన తోడేలులా అరిచాడు జైన్.

"బాస్....హోటల్ షినాయ్ రిసెప్షనిస్టును లాక్కొస్తే అన్ని విషయాలూ తెలుస్తాయి బాస్...." అన్నాడు జోగిందర్.

"షటప్! దానికేం తెలుస్తుంది? ఎవరు పదిరూపాయ లిస్తే వాళ్ళ చేతులు నాకుతుంది. మన డబ్బు కాజెయ్యటానికే వాడు దాన్ని ఉపయోగించుకున్నాడు. వాడు మనకు దొరక్కుండా, వాడి వునికి తెలియకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆ రిసెప్షనిస్టుకీ వాడికీ సంబంధం వుండదు" అన్నాడు వాడియా కోపంగా.

"ఇక మనం అజ్ఞాతవాసానికి వెళ్ళిపోక తప్పదేమో! ఆ నెగిటివ్ ఫిల్మును ఆ వినాయక్ ఎవరి దగ్గిర వుంచి ఏం చెప్పాడో మనకు తెలీదు. ఆ ఫిల్ము పోలీసులకు దొరికిందంటే మనం చచ్చిపోయినట్టే. ఇన్నాళ్ళనించీ వాళ్ళకు ఎటువంటి ఆధారాలు దొరక్కుండా తిరుగుతున్నాం.... ఇప్పుడా ఫిల్ము చాలు మనల్ని ఉప్పుపాతర వెయ్యటానికి. ఇప్పుడేం చెయ్యాలి?" జుట్టు పీక్కుంటూ అన్నాడు ధనుంజయ్.

డెబ్భయ్ అయిదు లక్షల రూపాయలు పోయినందుకు వాళ్ళకు ఎక్కువ బాధగా లేదు. అంత డబ్బునూ వాళ్ళు ఆ నెగిటివ్ ఫిల్ము కోసమే ఇచ్చారు. తర్వాత వినాయక్‌ను పట్టుకుని ఆ డబ్బును తిరిగి పొందాలనుకున్నారు.

వినాయక్ దగ్గిర ఆ ఫిల్ము లేదని తెలిసి వాళ్ళకు మతి పోయింది. నిప్పుల మీద నడుస్తున్నట్టుగా అనిపించింది.

చట్టవిరుద్ధమైన ఎన్నో పనులు చేస్తున్నప్పుడు రహస్యంగా తీసిన ఫిల్ము అది. అంత చాకచక్యంగా వినాయక్ ఆ ఫిల్మును ఎట్టా తయారుచెయ్యగలిగాడో వాళ్ళకు అర్థం కాలేదు.

ఇప్పు డా ఫిల్ము ఎక్కడ వుంది?

ఆ ఫిల్ముతోపాటు వినాయక్ ఇంకా ఏమయినా ఆధారాలు సంపాదించాడా?

"నువ్వు ఆలోచన లేకుండా ఆర్డర్లిచ్చావు జైన్" అన్నాడు ధనుంజయ్.

"ఏమనిచ్చాను?" రోషంగా అడిగాడు.

"వినాయక్‌ను కాల్చి చంపమని నువ్వు జోగిందర్‌తో చెప్పకుండా వుంటే బాగుండేది. వాడు ప్రాణాలతో వున్నట్లయితే హింసించి ఆ ఫిల్మ్ గురించి తెలుసుకుని వుండేవాళ్ళం."

"నాకు తెలుసు....వాడ్ని పట్టుకోమనే చెప్పాను. ప్రతిఘటించినా, పారిపోయే ప్రయత్నం చేసినా చంపమని చెప్పాను. వాడు పిస్తోలు తీసి కాల్చే ప్రయత్నం చేశాడుట. అందుకే జోగిందర్ వాడిని కాల్చేశాడు. డామిట్ ....అంతా ఎదురు తిరిగింది. ఆ ఫిల్మ్ తప్పకుండా వాడి దగ్గరే వుంటుందనుకున్నాను. కాని వాడు దాన్ని ఎక్కడో దాచి వుంచాడు."

"వాడికి స్నేహితులు ఎవరైనా వున్నారా?" అడిగాడు వాడియా జోగిందర్‌ని.

"నాకు తెలిసి లేరు బాస్....వాడు జరీనాతోనే స్నేహంగా వుండేవాడు. వాడు ఒంటరివాడు."

"వాడి గదిని వెతికారా?" ధనుంజయ్ అడిగాడు.

"ఇక్కడికి రావటానికి ముందే ప్రతి అంగుళం వెతికాం బాస్....ఏమీ దొరకలేదు. వాడు ఆ గదిని పూర్తిగా వదిలేశాడు."

"ఆ ఫిల్మ్ ఎక్కడ వున్నదో మనం ఎట్టా తెలుసుకోవాలి?" వాడియా అడిగాడు జైన్‌ను.

"ఎవ్వరూ లేని ఒంటరివాడు ఎక్కడ వుంటాడు వాడియా! ఏదో హోటల్లోనో, లాడ్జిలోనో వుంటాడు.

తన వునికి తెలియకుండా, తన గొంతు గుర్తుపట్టకుండా నోటికి వులిపిరి కాయితం అడ్డం పెట్టుకునేవాడు రద్దీగా, ఎక్కువమంది వుండే పెద్ద హోటళ్ళలో వుండడు. ఎక్కడో ఇరుకు సందుల్లో ట్రాఫిక్‌కు దూరంగా వుండే లాడ్జిల్లో వుంటాడు. ఎవరైనా ఎదురయినా గుర్తుపట్ట కుండా వుండటానికి వేషం మార్చుకుని తిరిగి వుంటాడు. మనం రిస్కు తీసుకుంటే వాడు ఎక్కడ వున్నాడో తెలుసు కోవచ్చు."

జోగీందర్ ఆశగా జైన్ ముఖంలోకి చూశాడు.

అతడికి తెలుసు - వినాయక్ ఎదురు తిరగటంతో జైన్, ఆ ఇద్దరూ తనని వదిలారని ప్రాణాలతో. లేక పోతే చెప్పిన పని చెయ్యకపోవటంతో కఠినమైన శిక్షనే విధించేవాళ్ళు. ఎట్లాగయినా ఆ ఫిల్మను సంపాదించి వాళ్ళను సంతోషపెట్టాలనుకున్నాడు జోగీందర్.

"వినాయక్ ఫోటో మన దగ్గిర వుంది. ఆ ఫోటో ఆధారంతో చవకబారు లాడ్జిలలో, హోటళ్ళలో మనం అన్వేషణ సాగించాలి. ఇంతకు మించి ఇంకో దారి లేదు."

"అవును. వెంటనే మనం ఈ వేట సాగించాలి" అన్నాడు ధనుంజయ్.

"జోగీందర్....మీరంతా ఆ వినాయక్‌గాడి బట్టలన్నీ జాగ్రత్తగా ఏదీ వదలకుండా వెతికారా: ఎవరైనా వస్తా రేమోననే భయంతో సరిగ్గా చూడకుండా వచ్చేశారా?" తీక్షణంగా చూస్తూ అడిగాడు జోగీందర్‌ను.

అప్పుడు గుర్తుకు వచ్చింది జోగీందర్‌కు వినాయక్ అరిచేతిమీద వున్న టెలిఫోన్ నెంబర్. ఉలిక్కిపడ్డాడు. ఒళ్ళంతా ఒక్కసారి వణికి పోయింది.

"బాస్!" కంగారుగా అరిచాడు జోగీందర్.

ఆశ్చర్యంగా ఆతడ్ని చూశారు అంతా.

"వినాయక్ అరిచేతిమీద మాకు ఈ టెలిఫోన్ నెంబర్ కనపడింది. ఆ నెంబర్ని నోట్ చేసుకుని చేతిమీద తుడిచి వచ్చాను" అంటూ జేబులోనించి పాకెట్ డైరీ బయటకు లాగాడు.

"ఇడియట్....నిన్ను కుక్కను కాల్చినట్టు కాల్చి చంపాలి" కోపంతో ఎగిరిపడుతూ అన్నాడు వాడియా - జోగిందర్ని.

జోగిందర్ రోషంతో తలెత్తాడు.

"స్టాపిట్....ఈ పరిస్థితుల్లో మనం రోషపడకూడదు జోగిందర్! మనందరం గొంతువరకు మునిగిపోయి వున్నాం. ఆ ఫిల్మ్ మన చేతికి వచ్చేవరకు మనం చచ్చి నట్టే లెక్క."

"డైరక్టరీ తీసుకు రండి" ధనుంజయ్ అన్నాడు.

ఎ.సి. రూములో వున్నవాళ్ళందరికీ చెమటలు పడు తున్నాయి.

"మేం వెళ్ళేసరికి వినాయక్ ఈ నెంబర్కే మాట్లాడు తున్నాడనుకుంటాను" అన్నాడు జోగిందర్.

"వెతకండి నెంబర్ 777262. ఎవరిదో చూడండి."

"వాడియా డైరక్టరీ పేజీలు తిరగేశాడు.

ఐదు నిముషాల్లో అరిచాడు జోగిందర్ ఉత్సాహంగా.

"దొరికింది....అవును ఇదే నెంబర్...."

"ఎవరిదా ఫోన్?" ధనుంజయ్ అడిగాడు.

"డాక్టర్ గోవర్థన్....ఫ్లాట్ నెంబర్ 404, విద్యా నగర్" చదివాడు జోగించర్.

"క్విక్....కారు సిద్ధం చెయ్యండి....వెంటనే బయ ల్దేరాలి" అన్నాడు జైన్.

"మేం కూడా....'' అన్నాడు వాడియా.

"అవసరం లేదు. ఇంతమంది అనవసరం'' అంటూ రూపం మార్చుకోటానికి పక్కనే వున్న గదిలోకి వెళ్లాడు జైన్.

అప్పటికే జోగిందర్, ఇతర అనుచరులు వాహనాలు సిద్ధం చేసి వాటి నెంబరు ప్లేట్లు మార్చటంలో మునిగి పోయారు.

14

చీకటిగా వున్న రోడ్డులోకి తిరిగింది నల్లగా వున్న ఎంబాసిడర్ కారు. అందులో జైన్ కూర్చుని వున్నాడు. అతని కళ్ళు విండో గ్లాసులోనించి బయటకు చూస్తు న్నాయి.

కారు వెనకే వస్తున్న జీపులో జోగిందర్ అతని పక్కనే అనుచరులు కూర్చుని సిగరెట్లు కాలుస్తున్నారు. జోగిందర్ కళ్ళు చిన్నవి చేసుకుని వీధి పక్కనే వున్న ఇళ్ళకేసి చూస్తున్నాడు.

ఇళ్ళలో లోపల ఎక్కడో లైట్లు వెలుగుతున్నాయి. ఒక ఇంట్లోనించి సన్నని సంగీతం వినపడుతోంది.

—డాకర్ గోవర్ధన్.

నేమ్ ప్లేటు గోడకు వేళ్ళాడుతోంది.

ఎంబాసిడర్ ఆ ఇంటికి కొంచెం దూరంలో ఆగింది. ఒక్క నిముషం అందులోనించి ఎవ్వరూ దిగలేదు. జీపు దాని వెనుకనే ఆగింది.

జైన్ దిగాడు.

అప్పటికే జోగిందర్ కిందకు దిగి నిలబడి పోయాడు. అనుచరులు ఎవ్వరూ దిగలేదు.

"జీపును ఇంకా ముందుకు తీసుకువెళ్ళి పార్క్

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జులై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేవిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి రెండేసి నెలలకొకసారి V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో పత్రికల ఖరీదు రు. 30/-లు చెల్లించి కాపీలు పొందవచ్చును. యీ సౌకర్యం కావలసివస్తే మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ!—పత్రికలకు గ్యారంటీ!!

చెయ్యండి" అన్నాడు జైన్ చిన్నగా.

అంబాసిడర్‌ని దాటి ముందుకు కదిలింది జీపు.

జైన్ ఒకసారి ఎదురుగా వున్న భవనాన్ని చూశాడు. పెద్ద మేడ. గేటు దగ్గర్నించి భవనం వరకూ దారిపక్కనే ఏవో చెట్లు వున్నాయి.

లోపల వెలుగుతున్న దీపాల వెలుతురు మసగ్గా బయటకు పడుతోంది.

ఇనుప గేటు దగ్గర ఎవ్వరూ లేరు.

వాచ్‌మెన్‌కోసం చూశాడు జైన్.

జోగీందర్‌కు సైగచేసి ముందుకు కదిలాడు.

గేటు తెరిచి లోపలకు వెళ్ళారు.

చిన్నగా అడుగుల చప్పుడవుతోంది.

ఆగిపోయారు.

తలుపులు మూసి వున్నాయి.

జోగీందర్ తలుపులమీద చప్పుడు చేశాడు. పక్కనే కాలింగ్ బెల్ వుంది. కాని అతడి దృష్టి దానిమీదకు పోలేదు. జైన్ అతడిని విసుగ్గా చూశాడు చీకట్లో నిలబడి. ఒక్కొక్కసారి చిన్న చిన్న పొరపాట్లే అవతలి మనుషులు జాగ్రత్తపడటానికి వుపయోగపడతాయి.

"ఎవరు?" లోపల్నించి ఎవరో అడిగారు.

ఆ గొంతు ఆడమనిషిదని గ్రహించాడు జైన్. చిన్నగా నవ్వుకున్నాడు.

"టెలిగ్రాం."

నిముషానికి ఎవరో గబగబా వచ్చి తలుపు తెరిచారు.

ఎదురుగా కనపడిన జోగీందర్‌ని ఆశ్చర్యంగా చూసింది ఆ యువతి. ఆమెకు ఇరవైయేళ్ళు దాటి

శ్రీ గణేశ్ బుక్ హౌస్

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ & స్టేషనరీ

మా వద్ద సుప్రసిద్ధ రచయితల, రచయిత్రుల సాంఘిక నవలలు, డిటెక్టివ్‌లు, బాల సాహిత్యం, నాటకములు, వైద్య, విద్య, స్కూలు, కాలేజి విద్యార్థులకు కావలసిన అచ్చు పుస్తకములు, ఎక్సర్‌సైజ్ పుస్తకములు

మరియు

రామాయణం, భారతం

భాగవతం, దేవీ భాగవతం

ఇంకా

హిందీ, ఇంగ్లీషు

నవలలు లభించును

తప్పక విచ్చేయండి!

నేడే మా కేటలాగు కొరకు వ్రాయండి.

శ్రీ గణేశ్ బుక్ హౌస్

(పాత కూరగాయల మార్కెట్ వద్ద)

రాజమండ్రి - 533 101.

వుండవు. తెల్లగా, సన్నగా వుంది. సన్నని ముక్కు, పెద్ద కళ్ళు ఆకర్షణీయంగా వుంది.

బెల్గ్రాం బంట్రోతు యూనిఫామ్‌లో వుంటాడని ఆ అమ్మాయికి తెలుసు. ఒక్కక్షణంలోనే తేరుకుని ఆమె తలుపులు మూసే ప్రయత్నం చేసింది.

కాని అప్పటికే జోగిందర్ బూటుకాలును రెండు తలుపుల మధ్య వుంచి ఆమె భుజాలమీద చేతులువేసి వెనక్కి నెడుతూ లోపలకు వెళ్ళాడు.

ఆమె కెవ్వున అరవబోయింది. జోగిందర్ ఆమెకు ఆ అవకాశం ఇవ్వకుండా అరచేత్తో ఆమె నోరు మూశాడు.

జైన్ లోపలకు వెళ్ళబోతూ జీపు దగ్గర నిలుచున్న అనుచరులకు రమ్మని పైగజేశాడు. క్షణంలో వాళ్ళంతా లోపలకు వచ్చేశారు. మొత్తం ఏడుమంది. అంతా నల్లటి డ్రస్సులో వున్నారు. అందరి దగ్గరా క్షణంలో ప్రాణం తీసే ఆయుధాలు వున్నాయి. అంతా ఎన్నో నేరాలు చేసి జైలుకు వెళ్ళివచ్చినవాళ్ళే.

తలుపులు మూశాడు జైన్.

ఒక్కసారి హాలునంతా పరీక్షగా చూశాడు.

అప్పటికే సోఫాలో కూర్చుని టి.వి. చూస్తున్న యాభైయేళ్ళకు దగ్గిర వయసున్న లావుగా వున్నామె భయంతో లేచి నిలబడింది.

"ఎవరు మీరు?" అని అడగాలని ఆమె చేసిన ప్రయత్నం సాధ్యంకాలేదు. భయంతో ఆమె నోరు తెరుచుకోలేదు.

కోటుజేబులోనించి పిస్తోలు బయటకుతీసి ఆమెకు గురిచేసి "గోవర్ధన్ ఎక్కడ?" అన్నాడు జైన్—ఆమె గోవర్ధన్ భార్య అని, ఆ యువతి డాక్టరు కూతురని

అపరాధ పరిశోధన పోటీ-238

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-5-'88 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జులై '88 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. రాష్ట్రం ప్రస్తుతం యీ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది-?
(ఆర్థిక సంక్షోభం, విద్యుత్ సంక్షోభం)
2. ఈ రంగంలో పెట్టుబడులు బాగా తగ్గిపోయాయి—?
(సినీరంగం, పత్రికారంగం)
3. ఇప్పటివరకు వచ్చిన టి.వి. సీరియల్స్‌లో విశేషంగా ప్రజాదరణ పొందిన సీరియల్—?
(రామాయణ్, యేజో హై జిందగీ)
4. దీనికి దాసోహం మానవుడు—?
(డబ్బుకు, పొగడ్తకు)
5. వేసవిలో ఇది లేనిదే తోచదు కొందరికి—?
(ఫ్యాను, చల్లనినీరు)

అనుకున్నాడు.

ఆమెకు గొంతు పెగల్లేదు. ఆమెను అడిగి వుపయోగం లేదని ఆ యువతివైపు తిరిగాడు అతడు.

"బాగా విను. అరిస్తే ఇద్దరి ప్రాణాలూ నిముషాల్లో ఎగిరిపోతాయి. డాక్టర్ గోవర్ధన్ని కూడా కాల్చి చంపుతాను. బుద్ధిగా వుంటే ఎవ్వరూ చావరు ఇప్పుడు చెప్పు గోవర్ధన్ ఎక్కడ? ఇంట్లో వున్నాడా?" అడిగాడు జైన్.

అప్పటివరకూ ఆమె నోటిమీద వున్న అరచేతిని తీసేశాడు జోగిందర్.

ఒక్క క్షణం ఆమె గట్టిగా గాలి పీల్చుకుని గోవర్ధన్ ఇంట్లో లేనన్నట్టు తలను అడ్డంగా వూపింది.

"ఎక్కడికి వెళ్లాడు?"

ఆ యువతి జవాబు చెప్పకుండా తల్లిని చూసింది.

వాళ్ళెవరో యెందుకు వచ్చారో ఆ ఇద్దరికీ తెలీలేదు. డాక్టర్ గోవర్ధన్ ఇటువంటి నేరస్థులతో శత్రుత్వమున్నట్టుగా అతడెప్పుడూ వాళ్ళతో చెప్పలేదు.

అందుకే వాళ్ళకు భయంగా, ఆశ్చర్యంగా వుంది.

ఇల్లు దోచటానికే వాళ్ళు వచ్చి వుంటే గోవర్ధన్ గురించి అడిగేవాళ్ళు కాదు. దోచుకునే ప్రయత్నంలోకి దిగిపోయేవాళ్ళు.

కాని గోవర్ధన్ గురించి అడుగుతున్నారంటే ఆయన కోసమే వచ్చి వుండాలి.

గోవర్ధన్ భార్య దిక్కు తోచనట్టు కూతుర్ని చూసింది.

"గోవర్ధన్ గురించి మీరు మాటలతో చెప్పకపోతే నాకు ఇబ్బంది లేదు. మిమ్మల్ని భరించలేని హింసలు పెడతారు నా అనుచరులు. నా ఆజ్ఞకోసం వాళ్ళు ఎదురు చూస్తున్నారు. అన్నింటికీ తెగించిన మనుషుల దగ్గర

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

తప్పక చదవండి!

1. నిశాంత — యద్దనపూడి సులోచనారాణి — 25-00
(డైరెక్టు నవల)

2. ప్రమాదాల్లో - ప్రమదలు — నవీన్ — 30-00
(స్వాతి వీక్లీ సీరియల్)

3. అన్వేషణ — వి. యస్. రావ్ — 20-00
(ఆపన సీరియల్)

4. మానసిక సమస్యలు సమాధానాలు — డా॥ ఇండ్ల రామసుబ్బారెడ్డి — 20-00

నేడే అడ్వాన్సుతోపాటు ఆర్డర్సు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
మ్యూజియం రోడ్, గవర్నరు పేట,
విజయవాడ - 520 002.

మీ మొండితనం పనిచెయ్యదు. చెప్పండి గోవర్థన్ ఎక్కడ?" పిస్తోలును చూపుతూ అన్నాడు జైన్.

జోగిందర్ చెయ్యి కదిలింది. అతడి చేతికేసి చూసింది ఆ యువతి భీతితో....ప్యాంటు జేబులోకి వెళ్ళిన అతడి చెయ్యి కత్తిని బయటకు తీసింది. బటన్ నొక్కాడు. తళతళ మెరిసే కత్తి విసురుగా బయటపడింది.

ఆ యువతికి వాళ్ళెంత కిరాతకులో క్షణంలో అర్థమయ్యింది. చాలా సినిమాల్లో అటువంటి నేరస్థులను వాళ్ళు చేసే నేరాలనీ చూసింది. అప్పుడు అవన్నీ ఎంతో సరదాగా, థ్రిల్లింగ్‌గా అనిపించాయి. కాని ఇప్పుడు కళ్ళెదురుగా ఆ మనుషులు కనపడుతుంటే భయపడిపోయింది.

"హాస్పిటల్‌నించి ఇంకా ఇంటికి రాలేదు" అన్నది హీనంగా వణుకుతున్న గొంతుతో.

"రోజూ ఎన్ని గంటలకు వస్తాడు?" జోగిందర్ అడిగాడు.

ఆ యువతి ఎదురుగా గోడకు వున్న గడియారాన్ని చూసి "ఇదే టైమ్" అన్నది చిన్నగా.

"ఇంట్లో ఇంకెవరైనా వున్నారా?" అడిగాడు జైన్ లోపలి గదుల్లోకి చూస్తూ.

లేరన్నట్టు తల వూపింది.

"గోవర్ధన్ వచ్చేవరకు మనం ఎదురు చూడాలి.... వీళ్ళిద్దరినీ కట్టెయ్యండి....నోటికి టేప్ అతికించండి."

ఆ యువతి గుంజుకున్నది.

"వద్దు....మీరు చెప్పినట్టు వింటాం.... మమ్మల్ని ఫ్రీగా వుండనివ్వండి" అన్నది ఆ యువతి.

జైన్ మాట్లాడకుండా నవ్వాడు.

బలహీనులనుకున్న మనుషుల్లో ఒక్కోసారి పొంచ్హి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-5-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జులై '88 నెల సంచికలో ప్రకటిస్తాము.

మార్చి '88 పోటీ ఫలితాలు

(1) మార్చి '88 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఎదురు చూపులు లోగిలిలో!
ఎదలో హాయి కౌగిలిలో!!

పంపినవారు: శ్రీ పెంటకోట సోమినాయుడు, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లి., సీతమ్మపేటరోడ్డు, విశాఖపట్టణం—530016.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మదిలో సెగలు!
మేడలో పొగలు!!

పంపినవారు: శ్రీ జె. క్రిష్ణారావు, 6-5-128, నెహ్రూనగర్, 6 వ లైను, గుంటూరు—1.

చని తెగింపు వస్తూవుంటుంది! నేర వృత్తిలో నిర్లక్ష్యం పని చెయ్యదు.

అనుచరులు వాళ్ళిద్దరి చేతులనూ వెనక్కు వుంచి ప్లాస్టిక్ తాళ్ళతో కట్టేశారు. నోటికి టేప్ అతికించి సోఫాల్లో కూర్చోపెట్టారు. టి.వి. ఆన్‌లోనే వుంది.

వాచీకేసి చూసుకున్నాడు జైన్.

సెకండ్ల ముల్లు గెంతుతోంది.

డాక్టర్ గోవర్ధన్‌కి కారుండి వుంటుంది. పక్కనే గేరేజ్ వుంది. ఆయన ఒక్కడే వస్తాడా? డ్రయివర్ కూడా లోపలకు వస్తాడా? ఇద్దరినీ బంధించక తప్పదు.

ఆలోచిస్తున్నాడు జైన్. అక్కడే వున్న కుషన్ చెయిర్‌లో కూర్చున్నాడు. పిస్తోలు జేబులో పడేసుకున్నాడు.

జైన్‌కు అసహనంగా వుంది.

చాలా యాంగ్జయిటీ ఫీలవుతున్నాడు ఆ క్షణాల్లో.

వినాయక్ తనని, తన భాగస్థులనీ వూహించని రిస్కులోకి నెట్టేస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. జరీనా చావు గురించి వినాయక్ అంతగా రియాక్టు అవుతాడని కూడా అనుకోలేదు. ఏమాత్రం వూహించినా జరీనాని క్షమించి వదిలేవాళ్ళు. అలా జరక్కపోతే జరీనాతో వినాయక్ ప్రాణాలు కూడా తీసేవాళ్ళు.

"బాస్!" చిన్నగా పిల్చాడు జోగిందర్.

అతడ్ని చూశాడు జైన్.

"ఇల్లును సోదా చెయ్యమంటారా?"

జైన్ మాట్లాడలేదు.

అనుచరులు అతడ్ని చూశారు. అతను తల వూపితే ఇంట్లోకి దూసు కెళ్ళటానికి సిద్ధంగా వున్నారు. సోదా


బాలభారతి & వి.వి.ఎస్.ఎంటర్‌ప్రైజెస్ వారు తమ స్వంత భవనం "బాలభారతి భవన్" లోకి మారిన సందర్భంలో ఏజెంట్లకు, హోంలైబ్రరీ వారికి కలుగచేస్తున్న గొప్ప అవకాశం
మీ అభిమాన ప్రఖ్యాత రచయితల డిటెక్టివ్, మిస్టరీ, జానపద నవలలు!!
రూ 250/- విలువ చేసే నవలలు
రూ 100/- లకు మాత్రమే!
ఈ అవకాశం ... మాత్రమే!
వివరాలకు: వి.వి.ఎస్. ఎంటర్‌ప్రైజెస్
(బాలభారతి భవన్) 21.A రంగరాజపురం మెయిన్‌రోడ్డు
కోడంబాక్కం, మద్రాసు-600024

పేరుతో డబ్బు, బంగారం దోచుకోవాలనే ఆలోచన వాళ్ళ మెదడుల్లో అప్పటికే పాతుకుపోయింది.

"ఆగండి....గోవర్ధన్ వచ్చేదాకా వెయిట్ చేద్దాం."

"వినాయక్ ఆ కేసెట్‌ను గోవర్ధన్ దగ్గరే దాచి వుంచాడని నా కనిపిస్తోంది బాస్...." జోగిందర్ గొణి గాడు.

"షటప్!" కసిరాడు జైన్.

ఆ యువతి - గోవర్ధన్ భార్య వాళ్ళ సంభాషణ వింటున్నారు.

జోగిందర్ మాట్లాడలేదు.

అతడికి లోపలకు వెళ్ళి ఇల్లం గాలించి ఆకేసెట్‌ను తెచ్చి జైనుకు ఇవ్వాలని వుంది ఆ కేసెట్ దొరికితే జైన్ దృష్టిలో తన వాల్యూ పెరుగుతుందని ఆలోచిస్తున్నాడు.

టిక్‌టిక్ మంటోంది గోడనున్న క్వార్జ్ గడియారం.

జైన్ జేబులోనించి సిగరెట్టు పెట్టె బయటకు తీశాడు. సరిగ్గా అప్పుడే ఆ రోడ్డులోకి రివ్వుగా ఓ మోటారు వాహనం వచ్చిన చప్పుడయ్యింది.

"ఎలర్ట్" అన్నాడు జైన్.

టాక్సీ వచ్చి గోవర్ధన్ ఇంటిముందు ఆగింది.

డాక్టర్ ఫోర్డుకారు సర్వీసింగ్‌లో వుందనీ, ఆయన టాక్సీలో వస్తాడనీ ఆడవాళ్ళిద్దరికీ తెలుసు.

(సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page


Regd.no: H/HD-48
'PRABHAKAR'